తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 06.09.2026 | సంపుటి : 13 సంచిక : 48 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## డిసెంబర్ 1 నుంచి
# జనగణన
### 4 రాష్ట్రాల్లో షురూ!

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్

మిగతా 2లో..

# సభకు రండి..



## రుణమాఫీపై చర్చిద్దాం..
## బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు

## కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. లేదంటే రాజీనామా చేయాలి

సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా సంస్కారం ఉంది. అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లిని బయటకు గెంటేశారు. మీ సంస్కారం ఏంటో.. నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రండి.. చూసుకుందాం. రాసిపెట్టుకోండి.. మీకు భవిష్యత్ లేదు. మీ బతుకులు చీకటిమయమే. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా. .. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గజ్వేల్‌లోనే తేల్చుకుందాం. బీఆర్ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారు. బీఆర్ఎస్ ఎగవేసిన రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారు. మా ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు ఇచ్చాం. - ముఖ్యమంత్రి రేవంత్

- బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దె దిగిపోయింది
- కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి.. సీఎం రేవంత్ సవాల్

**నల్గొండ ప్రతినిధి/నకిరేకల్(జనంసాక్షి):** బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దె దిగిపోయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి చరిత్రను ప్రజలు గమనించాలని కోరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 100 పడకల ఆస్పత్రిని సీఎం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారు. బీఆర్ఎస్ ఎగవేసిన రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నల్గొండ జిల్లాకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారు. మా ప్రభుత్వంలో ఉద్యమకారుల

మిగతా 2లో..

## ఉపాధ్యాయులే తెలంగాణ భవిష్యత్‌కు దిక్సూచి

- రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా తయారు చేయాలి
- ఉపాధ్యాయులు రాజకీయ ఉచ్చులో పడొద్దు
- మీకిచ్చిన హామీలన్నీ అమలుచేస్తాం
- సాంకేతిక విద్యలో తెలంగాణ ముందడుగు
- దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉంది
- విద్యా ఉద్యోగం ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం
- సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిలో వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి




2లో..



## హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

- 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్ నిర్మాణం
- రూ.70వేల కోట్ల పెట్టుబడితో టీసీఎస్ ముందుకు
- గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

# వచ్చేది కేసీఆర్ రాజ్యమే




## విధ్వంస పాలనకు చరమగీతం పాడతాం: కేటీఆర్

- శాసనసభలో కాంగ్రెస్‌ను నిలదీస్తాం
- కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది
- యువత పోరాటం కరీంనగర్ నుంచే మొదలు కావాలి..
- 'యువ సమర భేరి'తో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, విద్యార్థుల సమస్యలపై సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఆయన వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ పాలన రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో 'యువ సమర భేరి' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో హాజరైన ఈ సభలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

**ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేశారు**

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాల పేరుతో మోసం

మిగతా 2లో..

## కేటీఆర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వానిది భూదందా

- 22ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర
- కేసీఆర్ ప్రభుత్వం బాటలో రేవంత్ కూడా..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు: కిషన్‌రెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబర్5(జనంసాక్షి):** సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో శనివారం జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో

మిగతా 2లో..


## ఎవరు పడితే వాళ్లను పార్టీలోకి చేర్చుకోబోం

### కొండా సురేఖ చేరికపై బీజేపీ నేత మురళీధర్ రావు

**హైదరాబాద్,సెప్టెంబర్5(జనంసాక్షి):** మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చుతూ, పార్టీలో చేరికలపై తమకంటూ ఒక స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని ఆయన శనివారం స్పష్టం చేశారు. కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారు" అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయాలపై మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలి

### పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్(జనంసాక్షి):** కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించనప్పుడు ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. ఈ డిమాండ్‌పై ఈనెల 6న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహా ధర్నాపై హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మాట్లాడారు. "బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. పదేళ్లలో 100 ఏళ్ల విధ్వంసం జరిగింది. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ అసెంబ్లీకి హాజరుకాకుండా, తన నియోజకవర్గ ప్రజలకు

మిగతా 2లో..



## విద్యాకుసుమాలను చిదిమేసిన రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొన్న కారు..
- 8 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

**కేరళం(జనంసాక్షి):** కేరళంలోని త్రిశూర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై ఆగిఉన్న లారీని ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందారు. కైపమంగళం ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన

మిగతా 2లో..

# మళ్లీ డేంజర్‌బెల్స్

## నేపాల్‌లో విరిగిపడిన కొండచరియలు.. మళ్లీ పొంచిఉన్న వరద ముప్పు..!

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- 10 రోజుల తర్వాత శిథిలాల నుంచి సజీవంగా
- మరో ఇద్దరిని కాపాడిన సహాయక సిబ్బంది



**ఖాట్మండు(జనంసాక్షి):** హిమానీనదం (గ్లేసియర్) విరిగిపడి భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్‌ను మరో ముప్పు వెంటాడుతోంది. తాజాగా జారీచేసిన వరద ప్రమాద హెచ్చరికలు ఆ దేశాన్ని తీవ్రంగా భయపెడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో దార్చులా జిల్లాలోని భట్టార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కొండలపై నుంచి జారిపడిన రాళ్లు, మట్టితో నదీ ప్రవాహం పాక్షికంగా నిలిచిపోయింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాళ్లు తొలగిపోతే ఒక్కసారిగా దిగువ ప్రాంతాలను వరద ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పరిస్థితిని పర్యవేక్షించేందుకు పోలీసులను రంగంలోకి దించింది. సహాయక చర్యల కోసం అత్యవసర ఫోన్ నంబర్లనూ విడుదల చేసింది. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు ఇంకా కోలుకోకముందే.. ఈ కొత్త ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరంగా మారింది.

మిగతా 2లో..

## విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యం

### వారిని తరగతి గదికే పరిమితం చేయకూడదు: మోదీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయస్థాయిలో ఉత్తమ టీచర్లుగా ఎంపికైన వారి తో మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. విద్యార్థుల చదువు గురించే కాకుండా వారి దైనందిన జీవితాలపై కూడా టీచర్లు శ్రద్ధ వహించాలని సూచించారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతోందని.. ఈ సమయంలో ఉపాధ్యాయులే విద్యార్థులను సరైన దారిలో నడిపించాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల సమస్యను ప్రస్తావిస్తూ.. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారనే విషయాలను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. "విద్యార్థులు స్క్రీన్ చూసే సమయాన్ని తగ్గించడం ప్రస్తుతం చాలా అవసరం. క్రీడలు, సృజనాత్మక ఆవిష్కరణలపై వారిలో ఆసక్తిని పెంపొందిస్తే.. ఫోన్‌కు దూరంగా ఉంచొచ్చు. అంతేకాదు, నూతన సాంకేతికతలపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. బోధనతో విద్యార్థుల్లో చాలా మార్పు తీసుకురావచ్చు. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. ప్రతి చిన్నారిలో ఒక ప్రతిభ ఉంటుంది. దానిని ఉపాధ్యాయులు గుర్తించి, ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరు. పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదు. వారిని బయటకు తీసుకువెళ్లి.. నిజ జీవిత నైపుణ్యాలు, సమాజ పరిస్థితులపై అవగాహన

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org ఆదివారం 06.09.2026

## సభకు రండి..

పిల్లలకు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 1.06 కోట్ల రేషన్‌కార్డులు ఇచ్చాం. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. బీఆర్ఎస్ కార్యకర్తలకూ వాటిని అందిస్తున్నాం. వారి ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా?మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు తీసుకోలేదా?పేదలకు సహాయం చేసినందుకు ఇందిరమ్మ పాలన పోవాలా?"

కేసీఆర్ సభకు రావాలి.. లేదంటే రాజీనామా చేయాలి

"సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా సంస్కారం ఉంది. అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లిని బయటకు గెంటేశారు. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు.. ఆడబిడ్డను చూసుకోవాలి. మీ సంస్కారం ఏంటో.. నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రండి.. చూసుకుందాం. రాసిపెట్టుకోండి.. మీకు భవిష్యత్ లేదు. మీ బతుకులు చీకటిమయమే. రేవంత్ ఉన్నంతకాలం.. బీఆర్ఎస్ అనే మొక్కను ఎదగనివ్వం. తెలంగాణ తులసి వనంలో గంజాయి మొక్కను పీకుతాం. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా. వచ్చేసారి సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలుస్తుంది. ఈనెలాఖరుకు సిరిసిల్ల వెళ్తాం. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తాం. బావ బావమరుదులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోండి. వచ్చే ఎన్నికల నాటికి సీట్లు పెరిగితే 117, ప్రస్తుతం ఉన్నవే కొనసాగితే 90 స్థానాలతో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గజ్వేల్‌లోనే తేల్చుకుందాం" అని రేవంత్ సవాల్ విసిరారు.

## హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు.

ఈ డేటా సెంటర్ సామర్థ్యం గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది.టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది భూదందా

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు:కిషన్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సైతం భూములను అమ్మే ప్రయత్నం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. నిషేధిత భూసమస్యలపై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి దోచుకుంటోంది. భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు. 22ఏ కింద తమ భూములు ఉన్నాయని చాలామందికి తెలియదు. ధరణి పేరుతో బీఆర్ఎస్ (ఃఖీూ) ప్రభుత్వం ఎలా దోచుకుందో అందరికీ తెలుసు. రాష్ట్రాన్ని స్థిరాస్తి వ్యాపారంగా మార్చారు. అన్ని రకాల అనుమతులు ఉన్న భూములను 22ఏ జాబితాలో పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే. భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడవలేని పరిస్థితి ఉంది. వక్ఫ్‌భూములపై తప్ప అన్ని భూములపై సీఎం రేవంత్ కన్నేశారు. రాష్ట్రాన్ని ఆర్‌ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారు. ఉద్యోగులకు జీతాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితికి తెచ్చారు. 60 లక్షల ఎకరాలకు పైగా భూమిని 22ఏలో పెట్టారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉందా?కాంగ్రెస్ నాయకులను, అధికారులను హెచ్చరిస్తున్నా.. మీరు దోచుకున్న ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజలకు పంచుతాం. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ కూడా 30 శాతం కమిషన్ అడుగుతోంది. కమిషన్ల కోసమే ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. రానున్న రోజుల్లో 22ఏపై ఇంటింటికీ వెళ్లాలి.. రేవంత్ ప్రభుత్వంపై పోరాటం చేయాలి. 22ఏలో పెట్టిన పేదల భూములను తొలగించాలి" అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయులే తెలంగాణ భవిష్యత్‌కు దిక్సూచి

- తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా తయారు చేయాలి
- రాజకీయ ఉచ్చులో పడొద్దు
- మీకిచ్చిన హామీలన్నీ అమలుచేస్తాం
- సాంకేతిక విద్యలో తెలంగాణ ముందడుగు
- దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉంది
- విద్యా ఉద్యోగం ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం
- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిలో వేడుకలో సీఎం రేవంత్ రెడ్డి

వికారాబాద్ జిల్లా బ్యూరో(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా.. తెలంగాణ విద్యార్థులు దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలబడే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చా రుశనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఉపాధ్యాయ దినోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొని 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు. ముందుగా ఉపాధ్యాయ బృందంతో గ్రూప్ ఫోటో దిగి, కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫోటో సోషల్ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సందర్శించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగిత రాణా, విద్యా శాఖ కమిషనర్ దేవసేన ఛాయాచిత్ర ప్రదర్శన విశేషాలను వివరించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు పేద బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులే అధికంగా ఉంటారు కాబట్టి వారికి అత్యుత్తమైన నాణ్యమైన విద్యను బోధించి రాష్ట్రానికి, దేశానికి దిశానిర్దేశం చేసే స్థాయికి తీసుకువెళ్లాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థుల భవిష్యత్ కు పునాదులు వేసేది ఉపాధ్యాయులేనని,తల్లిదండ్రులకంటే విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దనే ఎక్కువ సమయం గడుపుతారన్నారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశంలో మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ అనే గొప్ప సిద్ధాంతం ఉందని అన్నారు. ప్రభుత్వము తీసుకుంటున్న పారదర్శకమైన విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి గణ నీయంగా పెరిగింది అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు సైతం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు శుభసాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసనసభ అధ్యక్షులు గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, తాండూర్ శాసనసభ్యులు బి. మనోహర్ రెడ్డి, పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ యోగిత రాణా, దేవసేన కమిషనర్, కళాశాల ప్రిన్సిపల్ సెక్రెటరీ అభిలాష అభినవ్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, స్థానిక మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, జిల్లా అధికారులు ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు వారి బంధువులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులే తెలంగాణ భవిష్యత్‌కు దిక్సూచి

కొడంగల్: తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా, తెలంగాణ విద్యార్థులు దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డా. యోగిత రాణా, విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఛాయాచిత్ర ప్రదర్శన విశేషాలను ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

**రూ.27 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం**

వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.27 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగంలోని వివిధ విభాగాలను సందర్శించి, అక్కడ కల్పించిన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, అత్యవసర వైద్య సేవలు, రోగులకు అందించే సౌకర్యాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్, అరబిందో ఫార్మా లిమిటెడ్ దాతృత్వ విభాగం సహకారంతో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన పాఠశాల భవనాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు.వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో రూ.8 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల నూతన భవనాల శిలాఫలకాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించి ప్రారంభించారు. అదేవిధంగా కోస్గి పట్టణంలో రూ.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన శిలాఫలకాన్ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం నూతన పాఠశాల భవనంలో గణపతి, సరస్వతి, వెంకటేశ్వర స్వామి చిత్రపటాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఈ డిసెంబర్ 1 నుంచి జనగణన

జనరల్ సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

## ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలి

అందుబాటులో లేకుండా, ప్రతిపక్ష నేత పాత్రను నిర్వర్తించకుండా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లనున్నాం. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యం

కల్పించాలి. సిలబస్‌తో పాటు నైతిక విలువలూ నేర్పాలి" అని మోదీ ఉపాధ్యాయులకు సూచించారు.

82 మంది ఉపాధ్యాయులకు అవార్డులు..

ఈ ఏడాది 82 మంది ఉపాధ్యాయులు (వజీఇ్ఞపవతీబ), విద్యావేత్తలు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య అక్షరాస్యత శాఖ నుంచి 48 మంది ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌ల నుంచి 21 మంది అధ్యాపకులు.. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత విభాగం నుంచి 13 మంది నైపుణ్య శిక్షకులు ఉన్నారు. పురస్కార గ్రహీతలు తమ బోధనా పద్ధతులు, అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు.

## విద్యాకుసుమాలను చిదిమేసిన రోడ్డు ప్రమాదం

చోటుచేసుకుంది.ఈ కారు గురువాయూర్ నుంచి కొడుంగలూరు వెళ్తుండగా హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టింది ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అతి కష్టమ్మీద కారులోని వారిని బయటకు తీశారు. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 8 మంది ఉండగా.. ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు కేరళం పోలీసులు వెల్లడించారు. మృతులంతా తమిళనాడులోని దిండిగుల్ ప్రాంతంలో గల ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు.మృతుల పేర్లు, ఇతర వివరాలు ఇంకా తెలియరాలేదు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో జాతీయ రహదారిపై మరమ్మతులు జరుగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ప్రపంచ వేదికపై పెరుగుతున్న భారత్ పాత్ర..

బ్రసెల్స్(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. అత్యంత స్ఫూర్తిదాయకమైన ప్రపంచ నేతల్లో ఆయన ఒకరని ప్రశంసించారు. మోదీ చాలా తెలివైన వారని.. అస్థిరమైన ప్రపంచ పరిస్థితుల మధ్య ఆయన అనుసరిస్తున్న విధానం ప్రత్యేకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఏదైనా బాగా ఆలోచించే చెప్తారని.. ఆయన చెప్పినట్లు చేయాలన్నారు. "గతంలో భారత పర్యటనకు రావాలనుకున్న సమయంలో కొవిడ్ ప్రబలడంతో పర్యటన రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఇక్కడికి చేరుకోవడం ఆనందంగా ఉంది. మోదీని కలవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఆయన్ను అత్యంత స్ఫూర్తిదాయకమైన ప్రపంచ నాయకుల్లో ఒకరిగా భావిస్తా. చాలా మంది ప్రపంచ నేతల మాటలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతుంది. కానీ.. మోదీ మాట్లాడితే ఆయన చెప్పినట్లు చేయాలనిపిస్తుంది. చాలా స్ఫూర్తి పొందొచ్చు. ఆయన పాలనలో భారత్ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది' అని బెల్జియం ప్రధాని పేర్కొన్నారు.ప్రపంచ వేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందని బార్ట్ డె వెవర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా.. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను అభివర్ణించారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి సమయంలో బ్రసెల్స్ ఇప్పుడు భారత్‌ను ఒక కీలక, విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందన్నారు. ఆ దేశంతో బంధాలను ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా వ్యూహాత్మకంగానూ మరో స్థాయికి తీసుకెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ప్రపంచ దేశాలపై ట్రంప్ విధిస్తున్న సుంకాలపై బెల్జియం ప్రధాని పరోక్ష విమర్శలు చేశారు. 'ఈ రోజుల్లో అడ్డంకులు పెంచాలని, మార్కెట్లను మూసివేయాలని, సుంకాలు విధించాలని చాలా మంది పిలుపునిస్తున్నారు. కొందరు ఈ రోజు తీసుకున్న నిర్ణయాన్ని రేపు రద్దు చేస్తారు. ఎల్లుండి మళ్లీ పునరుద్ధరిస్తారు. నేను ఎవరి గురించి మాట్లాడుతున్నానో మీకు తెలిసే ఉంటుంది. అటువంటి వారి వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. స్వేచ్ఛా మార్కెట్లు, బలమైన ఆర్థిక భాగస్వామ్యాల వల్లే అభివృద్ధి సాధ్యమవుతుంది' అని వ్యాఖ్యానించారు.

## ఝీరాం వ్యాలీలో మావోయిస్టుల దాడి కేసు..

### 10మందిని దోషులుగా తేల్చిన కోర్టు

రాయ్‌పూర్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో పదమూడేళ్ల క్రితం మావోయిస్టులు జరిపిన దాడిలో కాంగ్రెస్ నేతలు సహా 29 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ పూర్తి చేసిన ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు.. పది మందిని దోషులుగా తేలుస్తూ తీర్పు వెలువరిచింది. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వీరందరికీ సెప్టెంబర్ 16న న్యాయస్థానం శిక్ష ఖరారు చేయనుంది. విచారణ సమయంలో దాదాపు 101 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు న్యాయస్థానం వెల్లడించింది.బస్తర్ జిల్లాలోని ఝీరాం వ్యాలీలో 2013లో కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీ నిర్వహించింది. ఆ సభను లక్ష్యంగా చేసుకొన్న మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. ఆ ఘటనలో కాంగ్రెస్ నేతలు, భద్రతా సిబ్బంది, సామాన్యులు సహా 29 మంది మృతి చెందారు. మరో 30 మంది గాయాలపాలయ్యారు.

# వచ్చేది కేసీఆర్ రాజ్యమే

చేశాయని కేటీఆర్ ఆరోపించారు. "ఢిల్లీలో బడే భాయ్ రెండు కోట్ల ఉ ద్యోగాలు ఇస్తామన్నారు.. ఇక్కడ చోటే భాయ్ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు" అంటూ ప్రసంగిం చారు. తెలంగాణకు రావాల్సిన పరిశ్రమలు, కంపెనీలను కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌కు తరలిస్తోందని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి, 1,32,308 ఉద్యోగాలను భర్తీ చేశామని కేటీఆర్ తెలిపారు. తమ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పనిచేసిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రశ్నలు

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపైనా కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రూ.20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించామని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు రూ.12 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు.

రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక మంత్రిని బర్తరఫ్ చేశారని, అయితే వాస్తవానికి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. గతంలో కేసీఆర్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి ముందుగా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్ నుంచే మరో పోరాటం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ కరీంనగర్ నుంచే తన పోరాటాన్ని ప్రారంభించారని కేటీఆర్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు యువత పోరాటం కూడా కరీంనగర్ నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ గతంలోనూ అణచివేసిందని విమర్శించారు.

తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోషించిన పాత్రను కేటీఆర్ ప్రస్తావించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు యువతపై ప్రేమ ఉన్నట్లుగా నటిస్తున్నాయని విమర్శించారు. యువత వాస్తవాలను తెలుసుకుని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

సోషల్ మీడియాను ఆయుధంగా వాడాలి

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత సోషల్ మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన నిరసనలకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిన సందర్భాలను గుర్తుచేస్తూ.. యువత తలచుకుంటే ప్రభుత్వాలను ప్రశ్నించడమే కాకుండా మార్పును తీసుకురాగలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తీరు మార్చిన కేటీఆర్.. యువతలో ఉత్సాహం

కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమాలకు కరీంనగర్‌లో నిర్వహించిన 'యువ సమర భేరి' సభ పరాకాష్టగా నిలిచింది. సభలో కేటీఆర్ తన ప్రసంగ శైలిలోనూ మార్పును ప్రదర్శించారు. నిరసనకు ప్రతీకగా నల్లరంగు టీషర్ట్ ధరించి సభకు హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కొత్త టెక్నాలజీతో డిజిటల్ తెరపై ప్రదర్శిస్తూ ప్రజలకు వివరించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ ఆయన చేసిన నినాదాలకు యువత నుంచి అనూహ్య స్పందన లభించింది. సభికులతో పలుమార్లు నినాదాలు చేయిస్తూ ఉత్సాహపరిచారు. హిందీలోనూ ప్రసంగిస్తూ సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ గతంలో ఇచ్చిన హామీలను ప్రస్తావించి వాటిని తెలుగులోకి వివరించారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

విద్యార్థులు, నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని నిర్వహించిన ఈ సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. భారీగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, యువత కేటీఆర్ ప్రసంగానికి మద్దతుగా నినాదాలు చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై మరింత పోరాటాలు నిర్వహించేందుకు ఈ సభ పార్టీ శ్రేణులకు ఊతమిచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయడంతో పాటు, యువతను పెద్ద ఎత్తున తమవైపు తిప్పుకునే లక్ష్యంతో బీఆర్ఎస్ ముందుకు సాగుతున్నట్లు సభలో కేటీఆర్ ప్రసంగం స్పష్టం చేసింది.సభలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఒడితెల సతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం..

హైదరాబాద్,సెప్టెంబర్5(జనంసాక్షి):బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తృటిలో రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కరీంనగర్‌కు వెళుతుండగా శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆయన ప్రయాణిస్తున్న కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొనేందుకు కేటీఆర్ శనివారం బయలుదేరారు. మార్గమధ్యలో అలుగునూరు వద్ద ఆగగా, పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని ప్రయాణం తిరిగి ప్రారంభమైన వెంటనే, కారుకు సమాంతరంగా వెళుతున్న ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగంలోని డోర్ తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కేటీఆర్ కారులోనే ఉన్నప్పటికీ, ఆయన సురక్షితంగా బయటపడటంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. కేటీఆర్ ప్రయాణాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జులైలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు గాయాలయ్యాయి.

## జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

శ్రీనగర్(జనంసాక్షి):పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబా కమాండర్‌ను జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. కొంతకాలంగా ఉగ్రవాది యాసిర్ కదలికలపై నిఘా పెట్టిన భద్రతా బలగాలు శుక్రవారం యూస్‌మార్గ్‌లో అతడిని గుర్తించాయి. ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో యాసిర్ హతమైనట్లు అధికారులు వెల్లడించారు.శుక్రవారం యూస్‌మార్గ్‌లోని పర్వత ప్రాంతాల్లో గాలింపు చేపట్టిన భద్రతా బలగాలపై ఓ ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో కొనసాగిన ఎదురు కాల్పుల్లో అతడు మరణించాడు. హతమైన ఉగ్రవాదిని యాసిర్‌గా గుర్తించినట్లు శనివారం కశ్మీర్ పోలీసులు వెల్లడించారు. యాసిర్ గతంలో లష్కరే తయ్యిబాకు చెందిన ఓ ఉగ్రముఠాలో సభ్యుడిగా ఉండేవాడు. ఏడాది క్రితం ఆ బృందం నుంచి విడిపోయి, స్వతంత్రంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు లష్కరే ఉగ్రవాదులతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# మళ్లీ డేంజర్‌బెల్స్

**10 రోజుల తర్వాత శిథిలాల నుంచి సజీవంగా..!**

నేపాల్‌లో ఏవైపు చూసినా బురద.. శిథిలాలు.. కూలిపోయిన భవనాలే..! వరదలు సృష్టించిన బీభత్సం అనంతరం సహాయక బృందాలు చేపట్టిన ముమ్మర గాలింపులో పదో రోజైన శనివారం మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న ఓ చైనా కార్మికుడిని సహాయక సిబ్బంది సురక్షితంగా వెలికితీశారు. అదే సమయంలో శిథిలమైన ఇంట్లో చిక్కుకున్న 64 ఏళ్ల మహిళను సైతం ప్రాణాలతో కాపాడారు. ఈ రెండు ఘటనలు తీవ్ర విషాదంలో కొట్టుమిట్టాడుతున్న నేపాల్‌లో కొత్త ఆశలు నింపాయి.చైనా కార్మికుడి రక్షణ కోసం నేపాల్ సైన్యం దక్షిణ కొరియాకు చెందిన విపత్తు సహాయక నిపుణులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. 225 మీటర్ల పొడవైన సొరంగంలో చిక్కుకున్న అతడి కోసం తీవ్రంగా శ్రమించారు. బురద, శిథిలాలను తొలగిస్తూ ముందుకు సాగిన సిబ్బంది చివరకు అతడిని సజీవంగా గుర్తించారు. బయటకు తీసుకొచ్చిన వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తనను రక్షించేందుకు వచ్చిన సిబ్బందిని చూసిన క్షణం ఆ వ్యక్తి తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు 26న నేపాల్‌లో హిమానీనదం విరిగిపడడంతో సంభవించిన వరదలకు పలు గ్రామాలు, ఇళ్లు, రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో పెను విషాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు 1300 మందికి పైగా మృతి చెందగా.. 5000 మందికి పైగా గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో చిక్కుకున్న వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

# డిప్యూటీ సీఎం భట్టితో స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి భేటీ



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా నూతనంగా నియమితులైన గద్వాల్ విజయలక్ష్మి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం ప్రజా భవన్ నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ప్రణాళిక శాఖ పరంగా సంపూర్ణ సహకారాన్ని అందించాలని విజయలక్ష్మి డిప్యూటీ సీఎం భట్టిని కోరారు.

# యువకుడి దారుణ హత్య



వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) : వరంగల్ నగర సమీపంలోని మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ హైవేలి గ్రామానికి చెందిన మేకల గౌతం (22) ను అదే గ్రామానికి చెందిన కొందరు ఒక పంచాయతీ విషయంలో మాట్లాడేందుకు ఉరుసు బైపాస్ బెస్తం చెరువుకు వెళ్లే దారి వద్దకు తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ వారి మధ్య జరిగిన వాగ్వాదము గొడవ కారణంగా ఓ వ్యక్తి గౌతమును కత్తితో పొట్ట మీద కోయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. మరికొందరు ప్రాణాపాయ స్థితిలో ఉన్న గౌతమ్ను చికిత్స నిమిత్తం ఎంజిఎంకు తరలించినట్లు తెలిసింది. అక్కడ గౌతమ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ఈ హత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మామునూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతుని కుటుంబ సభ్యులు బంధువులు గౌతమ్ మృతదేహంతో తిమ్మాపూర్ లో నిరసన చేసినట్లు సమాచారం. హత్యకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని నిరసన చేసినట్లు సమాచారం.

# ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలి

- 12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారు
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్5 (జనంసాక్షి) : రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పబ్లిక్ డొమైన్‌లో కులగణన సర్వే

- సామాజిక న్యాయ చాంపియన్ కాంగ్రెస్
- రాష్ట్ర మంత్రి, పొన్నం ప్రభాకర్




హైదరాబాద్ (జనంసాక్షి) : కులగణన సర్వేను పబ్లిక్ డొమైన్ లో పెట్టామని, సామాజిక న్యాయ చాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు కొప్పుల రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ తెలంగాణలో ఉండాలా వద్దా అనేది బీజేపీ నిర్ణయం తీసుకోవాలని, బండి సంజయ్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, పాయల శంకర్ బీజేపీ నాయకత్వాన్ని ఒప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నాయకత్వంపై మాట్లాడితే పదవులు పోతాయని భయపడుతున్నారా అని మంత్రి పొన్నం ప్రశ్నించారు. బీహార్ ఎన్నికల ముందు దేశ వ్యాప్తంగా కులగణన చేస్తామని ఏప్రిల్ 1,2025 న కేంద్రం చెప్పిందని, బీహార్ ఎన్నికల తర్వాత కేంద్రం మాట తప్పిందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కులగణనపై ఏఐసీసీ 100 రోజుల కార్యక్రమాన్ని తెలంగాణలో విజయవంతం చేస్తామన్నారు.

కొప్పుల రాజు మాట్లాడుతూ ఐదు ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ, ఖర్గే జనాభా లెక్కలతో పాటు కులగణన చేయాలని మోదీపై ఒత్తిడి తెస్తున్నారని, ఈ అంశాన్ని దేశ వ్యాప్తంగా ఉద్యమంగా తీసుకువెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోందన్నారు. జనాభా లెక్కలతో ఓబీసీ కులగణన జరుగుతుందని బీహార్ ఎన్నికల్లో ప్రధాన మంత్రి మోదీ చెప్పారని, జనాభా లెక్కల్లో ఓబీసీ కులగణనను కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని ఆయన మండిపడ్డారు. ఫ్యామిలీ సర్వేతో పాటు ఓబీసీ కులగణన చేస్తామని పార్లమెంట్ లో కేంద్రమంత్రి అమిత్ షా చెప్పారని, కానీ ఫామ్ లో ఓబీసీ ప్రస్తావన లేదని కొప్పుల రాజు ఆరోపించారు.

రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలని సీడబ్ల్యూసీలో నిర్ణయం తీసుకున్నామని, ఓబీసీ కులాల డేటా ఖరారు అయితే రిజర్వేషన్లలో 50 శాతం సీలింగ్ ఎత్తివేయవచ్చన్నారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళా రిజర్వేషన్లు కోల్పోయే అవకాశం ఉందని, తెలంగాణలో కేసీఆర్ సమగ్ర సర్వే చేసినప్పుడు ఓబీసీ డేటా లేకుండా చేశారని కొప్పుల రాజు ఆరోపించారు. ఓబీసీ హక్కుల కోసం 100 రోజులు కార్యక్రమాన్ని ఏఐసీసీ తీసుకుందని, తెలంగాణ మోడల్ ను ఫాలో కావాలని ఏఐసీసీ దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తోందని కొప్పుల రాజు వివరించారు. 50 శాతం జనాభా వద్ద కేవలం 3 శాతం సంపద ఉందని, పెద్ద, పెద్ద కాంట్రాక్టులు ఎవరి చేతుల్లోకి వెళ్తున్నాయో గమనించాలని ఆయన సూచించారు.

టీపీసీసీ చీఫ్, మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రీయంగా కుల సర్వే చేశారని, తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 100 రోజుల దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన ఉంటుందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో దేశ భౌగోళిక, సామాజిక స్థితిగతులను అర్థం చేసుకున్నారని, ఎవరి జనాభా అంత వారికి భాగస్వామ్యం అనే నినాదంతో రాహుల్ గాంధీ ముందుకు వెళ్లారని, ఆయన ఇచ్చిన నినాదం ఉద్యమంలా మారిందన్నారు.

# సీఎంఆర్ ధాన్యాన్ని నిలువునా దోచేశారు!

- రూ.3.80 కోట్ల ధాన్యం పక్కదారి..
- శ్రీ బాలాజీ రైస్ మిల్లులో మాయమైన 37,118 బస్తాలు
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో వెలుగులోకి అక్రమాలు



వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) : జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి అందాల్సిన ధాన్యం పక్కదారి పట్టినట్లు రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. గోపాల్‌పేట మండలం చెన్నూర్ గ్రామ శివారులోని శ్రీ బాలాజీ రైస్ మిల్లులో అధికారులు చేపట్టిన తనిఖీల్లో 2023–24 ఖరీఫ్ సీజన్‌కు కేటాయించిన ధాన్యంలో భారీగా కొరత ఉన్నట్లు గుర్తించారు.

### 37,118 బస్తాలు మాయం

అధికారుల తనిఖీల్లో మిల్లుకు కేటాయించిన ధాన్యంలో ఏకంగా 37,118 బస్తాలు కనిపించకపోవడం కలకలం రేపుతోంది. మాయమైన ధాన్యం విలువ సుమారు రూ. 3.80 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వానికి సీఎంఆర్ కింద తిరిగి అందించాల్సిన ధాన్యం నిల్వలు లేకపోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

### తనిఖీలతో వెలుగులోకి..

ఇటీవల రాష్ట్ర స్థాయి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాలోని పలు రైస్ మిల్లులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీ బాలాజీ రైస్ మిల్లులో రికార్డుల్లో ఉన్న నిల్వలు, వాస్తవంగా మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఈ క్రమంలో భారీగా ధాన్యం కొరత ఉన్నట్లు గుర్తించిన అధికారులు సంబంధిత వివరాలను నమోదు చేశారు.

### పోలీసులకు ఫిర్యాదు

ధాన్యం నిల్వల్లో భారీగా తేడాలు గుర్తించిన నేపథ్యంలో డీటీ పరమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీ బాలాజీ రైస్ మిల్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ ధాన్యం విషయంలో ఇంత భారీ మొత్తంలో కొరత రావడానికి కారణాలేమిటి? ధాన్యం ఎక్కడికి తరలించారు? ఇందులో మరెవరైనా ప్రమేయం ఉందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

### ఇతర మిల్లులపైనా నిఘా?



వనపర్తి జిల్లాలో సీఎంఆర్ ధాన్యం అక్రమాలపై గతంలోనూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాజా ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో వనపర్తి జిల్లాలోనే సీఎంఆర్ ధాన్యానికి సంబంధించి ఎక్కువ అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల్లోనూ ధాన్యం నిల్వలు, రికార్డులను అధికారులు మరింత లోతుగా పరిశీలించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించి, మిల్లింగ్ అనంతరం నిర్ణీత పరిమాణంలో సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాలని నిబంధనలు ఉన్నాయి. అయితే కొందరు మిల్లర్లు నిబంధనలను ఉల్లంఘిస్తూ ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజా ఘటన నేపథ్యంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పర్యాటకాభివృద్ధికి కేంద్రీకృత వ్యూహాత్మక విధానం

- రాష్ట్ర సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో పర్యాటక విధానం లక్ష్యాలకు అనుగుణంగా, పర్యాటక అభివృద్ధికి ఒక కేంద్రీకృత, వ్యూహాత్మక విధానం అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు స్పష్టం చేశారు. పెరుగుతున్న పర్యాటకుల అవసరాలను తీర్చడానికి, అధిక పర్యాటక సామర్థ్యం ఉన్న కొన్ని ఎంపిక చేసిన ప్రదేశాలను గుర్తించి, అక్కడ నాణ్యమైన హోటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. శనివారం రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సంజయ్ జాజు ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు మెరుగైన వసతి, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన అనువైన ఆస్తులను కూడా ఉన్నతీకరించి, ఆధునీకరించవచ్చని సూచించారు. నియమ నిబంధనల ప్రకారం అనుమతించబడిన ప్రదేశాల్లో హోటళ్లు, పర్యాటక సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వ భూములు, అనువైన పాక్షిక అటవీ భూములను గుర్తించవచ్చని సంజయ్ జాజు తెలిపారు. వసతి, అనుసంధానం, సౌకర్యాలు మరియు సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడం ద్వారా ప్రధాన పర్యాటక కేంద్రాలను పర్యావరణ హితంగా రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు తెలంగాణను ఆకర్షణీయమైన గమ్యస్థానంగా చూపించడానికి, సమగ్రంగా పర్యాటక ప్రోత్సాహక వ్యూహాన్ని రూపొందించాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ పర్యాటక సామర్థ్యాన్ని సమర్థవంతంగా చాటిచెప్పగల మరియు రాష్ట్ర పర్యాటక బ్రాండ్‌ను పర్యాటకులకు చేరవేయడంలో సహాయపడగల వ్యక్తులను గుర్తించాలని, ప్రచార కార్యక్రమాలు మరియు బ్రాండింగ్ కార్యక్రమాలలో ఒక విలక్షణమైన మరియు ఆకర్షణీయమైన ట్యాగ్‌లైన్‌ను రూపొందించాలని కూడా ఆయన కోరారు. వారసత్వం, సంస్కృతి, ప్రకృతి, పర్యావరణ పర్యాటకం, సాహస పర్యాటకం, ఇతర అభివృద్ధి చెందుతున్న విభాగాలతో సహా రాష్ట్రంలోని విభిన్న పర్యాటక ఆకర్షణలను ప్రోత్సహించేలా కార్యాచరణను సిద్ధం చేయాలని ముఖ్య కార్యదర్శి అధికారులను ఆదేశించారు. జిల్లాల కలెక్టర్లు పర్యాటక రంగ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని, వారు తమ జిల్లాల్లోని పర్యాటక అవకాశాలను గుర్తించి, పర్యాటక ప్రాంతాలు మరియు సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉట్నూర్ సబ్ కలెక్టర్‌గా ప్రణయ్ కుమార్



ఉట్నూర్ (జనంసాక్షి) : ఉట్నూర్ సబ్ కలెక్టర్‌గా ప్రణయ్ కుమార్ శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకే ఉట్నూర్ సబ్ కలెక్టర్‌గా ఉన్న యువరాజ్ మర్మట్ ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా వెళ్లారు. ఉట్నూర్‌కు ఐటీడీఏ పీవోగా ఐఏఎస్ అధికారి ఉన్న తరుణంలో ప్రభుత్వం సబ్ కలెక్టర్‌గా మరో ఐఏఎస్ అధికారిని నియమించడం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉట్నూర్ సబ్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

# ఏఐ, డేటా సైన్స్ కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ

- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్ లో దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ (జనంసాక్షి) : నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా కంప్యూటర్ సాఫ్ట్వేర్ ఏఐ డేటా సైన్స్ లో పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోందని నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ఇంటర్ పాస్, ఇంజినీరింగ్ , డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని, నేషనల్ స్కిల్ అకాడమీ విద్యార్థులు సరికొత్త సాఫ్ట్వేర్ టెక్నాలజీలలో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తోందని తెలిపారు. కోర్సులు ఈ–లెర్నింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ అందించబడుతుందని, తర్వాత పరీక్షలను నిర్వహిస్తారని, పాస్ అయిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన సర్టిఫికేట్‌ను అందుకుంటారని తెలిపారు. కోర్సు వ్యవధి 5 నెలల నుండి 10 నెలల వరకు ఉంటుందని, సబ్జెక్ట్‌లో ఇన్ డెప్త్ నాలెడ్జ్ పొందేందుకు విద్యార్థులకు ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోందని, ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.nationalskillacademy.inలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 9505800050 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# కొల్లాపూర్ అభివృద్ధికి భారీగా నిధులు

## రూ.20.37 కోట్ల పనులకు శ్రీకారం

- పెద్దకొత్తపల్లి మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు సీతక్క, జూపల్లి, ఎంపీ మల్లురవి
- రూ.20.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 19.35 కి.మీ. మేర మూడు హ్యామ్ రోడ్లు
- 257 చెంచు కుటుంబాల పునరావాసానికి ఆర్అండ్ఆర్ కాలనీ



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 5 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో గ్రామీణ రహదారుల అభివృద్ధి, చెంచు కుటుంబాల పునరావాసానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా పెద్దకొత్తపల్లి, వీపనగండ్ల మండలాల్లో రూ. 15.87 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు హ్యామ్ రోడ్డు పనులతో పాటు, నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు కుటుంబాల పునరావాసం కోసం బాచారం గ్రామంలో రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న ఆర్అండ్ఆర్ కాలనీ అభివృద్ధి పనులకు మంత్రులు, ఎంపీ, జిల్లా కలెక్టర్ శంకుస్థాపన చేశారు.రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ కలిసి నక్కలబండ స్టేజ్, నక్కలపల్లి గేట్ వద్ద రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.

### 19.35 కిలోమీటర్ల మేర రహదారులు

పెద్దకొత్తపల్లి మండలం బండారపాకుల వద్ద పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జెడ్పీ రోడ్డు వరకు నక్కలపల్లి, వెంకటచెర్ల మీదుగా 6.95 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ. 569.90 లక్షలు కేటాయించారు.అదేవిధంగా పెద్దకొత్తపల్లి మండలంలో బండపల్లి మీదుగా పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జమ్మనాపూర్ వరకు 4.40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ. 360.80 లక్షలు మంజూరు చేశారు.వీపనగండ్ల మండలంలో కొర్లకుంట ఎక్స్ రోడ్డు నుంచి తూముకుంట--బొల్లారం ఎక్స్ రోడ్డు వరకు 8 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులను రూ. 656 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు.మూడు రహదారుల మొత్తం పొడవు 19.35 కిలోమీటర్లు కాగా, మొత్తం అంచనా వ్యయం రూ. 1,586.70 లక్షలు (సుమారు రూ. 15.87 కోట్లు). ఈ రహదారుల నిర్మాణంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, ప్రజల ప్రయాణ కష్టాలు తగ్గి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

### 257 చెంచు కుటుంబాలకు పునరావాసం

నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన 257 చెంచు కుటుంబాల పునరావాసం కోసం కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు.బాచారం గ్రామంలో రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పునరావాస కాలనీకి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క), మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ కలిసి ఈ పనులకు శంకుస్థాపన చేశారు.నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పునరావాస కాలనీలో సురక్షితమైన, గౌరవప్రదమైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. కాలనీలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో ఒకే కార్యక్రమంలో రూ. 20.37 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ద్వారా రహదారి మౌలిక వసతులతో పాటు చెంచు కుటుంబాల పునరావాసానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఎఫ్‌డీఓ చంద్రప్రకాశ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, ఆయా గ్రామాలకు చెందిన చెంచు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
06 సెప్టెంబర్ 2026

# ప్రపంచం ముందు చిన్నబోయిన పెద్దన్న

సంపాదకీయం

అమెరికా అంటే ఇంటెలిజెన్స్‌కు మారుపేరు. ప్రపంచంలో ఏ దేశానికీ లేనంత పకడ్బందీ భద్రతా వ్యవస్థ తమదని ఇన్నాళ్లూ చాటుకున్న దేశం అది. కానీ ఇరాన్‌తో యుద్ధం విషయంలో ఆ డాంబికం భళ్లున బద్దలైంది. యుద్ధ రహస్యాలు, ఆయుధ నిల్వల వివరాలు, కీలక సైనిక సమాచారం మీడియాకు లీకవడం అమెరికా చరిత్రలో మామూలు విషయం కాదు. ఇంటి దొంగను పట్టుకోలేని స్థితిలో సాక్షాత్తూ అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగమే సొంత సైనికాధికారులపై లైడిటెక్టర్ పరీక్షలు నిర్వహించాల్సి రావడం అమెరికా భద్రతా వ్యవస్థ ఎంత బలహీనపడిందో చెప్పకనే చెబుతోంది.

జాయింట్ స్టాఫ్ విభాగంలో పనిచేసే దాదాపు 50 మంది సీనియర్ అధికారులకు పోలీగ్రాఫ్ పరీక్షలు పెట్టడం సాధారణ విషయం కాదు. ఇది కేవలం ఒక దర్యాప్తు కాదు, తమ సైన్యం మీదే తమకు నమ్మకం లేని స్థితికి అమెరికా చేరిందనడానికి నిదర్శనం. వేలాది మంది పనిచేసే ఒక కీలక విభాగంలో, ఎవరు రహస్యాలు లీక్ చేస్తున్నారో తెలియక యంత్రాంగమంతా అనుమానంతో సొంత మనుషులనే ప్రశ్నించే దుస్థితి – ఇది బలమైన అగ్రరాజ్యానికి తగినదేనా?

పెంటగాన్ మాటలు ఎంత సర్దిచెప్పే ప్రయత్నం చేసినా, వాస్తవం మాత్రం స్పష్టం. జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని కాపాడుకోలేకపోవడం, ప్రపంచవ్యాప్తంగా మోహరించిన తమ సైనికుల రక్షణకే ముప్పు తెచ్చే స్థాయిలో లీకులు జరగడం – ఇది కేవలం ఒక పరిపాలనా వైఫల్యం కాదు, వ్యవస్థాగత లోపం. ఇంత జరిగినా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ సహా కొందరు సీనియర్ అధికారులు ఈ పరీక్షలకు కూడా హాజరుకాలేదన్న వార్తలు మరింత ఆందోళన కలిగించేవి. అంటే అనుమానం అంతర్గతంగా పైస్థాయి వరకూ వ్యాపించిందన్నమాట. యుద్ధం చేయడం వేరు, యుద్ధాన్ని నిర్వహించే వ్యవస్థను కాపాడుకోవడం వేరు. సొంత ప్రజల్లోనే వ్యతిరేకత, సొంత సైన్యంలోనే విశ్వాసరాహిత్యం – ఈ రెండింటినీ ఒకేసారి ఎదుర్కొంటున్న ట్రంప్ యంత్రాంగం పరిస్థితి నిజంగా ఇబ్బందికరమే. ప్రపంచానికి పాఠాలు చెప్పే అమెరికా, తన ఇంటి రహస్యాలను తానే కాపాడుకోలేని స్థితిలో నిలబడటం అనేది కేవలం ఒక వార్త కాదు – అగ్రరాజ్య ప్రతిష్టకే పెద్ద దెబ్బ.

# సాంప్రదాయక కుటుంబ వంట గదిపై ద్రవ్యోల్బణం ప్రభావం

**ద్రవ్యోల్బణం అనే పదం ఆర్థిక శాస్త్రంలో ఒక గణాంకంగా కనిపించినప్పటికీ, సామాన్య కుటుంబానికి మాత్రం అది ప్రతిరోజూ వంటగదిలో కనిపించే వాస్తవ సమస్య. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన ప్రతిసారీ ఆ ప్రభావం నేరుగా కుటుంబ వంటగదిపై పడుతోంది. ఒకప్పుడు నెలకు సరిపడే ఆదాయంతో కుటుంబ అవసరాలను సులభంగా నిర్వహించగలిగిన పరిస్థితి క్రమంగా మారుతోంది. కూరగాయలు, పప్పులు, నూనెలు, చక్కెర, బియ్యం, పిండి, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబ బడ్జెట్‌పై ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాల కుటుంబాలు ఈ ధరల పెరుగుదలను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి.**



వంటగదిలో ద్రవ్యోల్బణం ప్రభావం కేవలం ఖర్చు పెరగడానికే పరిమితం కావడం లేదు. కుటుంబాల ఆహారపు అలవాట్లు, పోషకాహారం, ఆరోగ్యం, పొదుపు, పిల్లల విద్య, వైద్యం వంటి అనేక అంశాలపై దీని ప్రభావం పడుతోంది. ఆదాయం పెరుగుతున్న వేగం కంటే నిత్యావసర వస్తువుల ధరలు వేగంగా పెరిగితే కుటుంబాల నిజమైన కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. జీతం అదే స్థాయిలో ఉన్నప్పటికీ నెలాఖరుకు చేతిలో మిగిలే డబ్బు తగ్గిపోవడం దీనికి స్పష్టమైన ఉదాహరణ. ద్రవ్యోల్బణం మొదటగా కనిపించేది కూరగాయల మార్కెట్‌లోనే. టమాటా, ఉల్లి, పచ్చిమిర్చి, ఆకుకూరలు, వంకాయ, బెండకాయ, దొండకాయ వంటి సాధారణ కూరగాయల ధరలు కాలానుగుణంగా పెరుగుతుంటాయి. వర్షాలు, ఎండలు, పంట నష్టం, రవాణా సమస్యలు, నిల్వ సదుపాయాల కొరత, మధ్యవర్తుల ప్రభావం వంటి కారణాలు ధరల పెరుగుదలకు దారితీస్తాయి. రైతు పొలంలో తక్కువ ధరకు విక్రయించిన ఉత్పత్తి వినియోగదారుడి వంటగదికి చేరే సమయానికి అనేక రెట్లు పెరిగిపోవడం మన వ్యవసాయ మార్కెట్ వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది.

నూనెల ధరల పెరుగుదల కూడా కుటుంబ బడ్జెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వంటనూనె ప్రతి కుటుంబానికి తప్పనిసరి అవసరం. నూనె ధర పెరిగినప్పుడు దాని వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాదు. ఫలితంగా కుటుంబాలు ఇతర ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తుంది. పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు వంటి పోషకాహార పదార్థాల కొనుగోళ్లను తగ్గించడం ద్వారా ఖర్చులను నియంత్రించేందుకు ప్రయత్నించే కుటుంబాలు కూడా ఉన్నాయి. ఇది దీర్ఘకాలంలో పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, శారీరక శ్రమ చేసే వ్యక్తుల పోషకాహార స్థితిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. చక్కెర, బియ్యం, పప్పులు వంటి ప్రాథమిక ఆహార పదార్థాల ధరలు పెరిగినప్పుడు దాని ప్రభావం మరింత విస్తృతంగా ఉంటుంది. ఒక కుటుంబంలో సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉంటే ఆహార ఖర్చు మరింత పెరుగుతుంది. ముఖ్యంగా స్థిరమైన జీతం లేదా రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలకు ధరల పెరుగుదల పెద్ద ఆర్థిక భారంగా మారుతుంది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు పెరగడం వల్ల అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడవచ్చు.

వంటగదిపై ద్రవ్యోల్బణం ప్రభావాన్ని అర్థం చేసుకోవాలంటే కుటుంబ బడ్జెట్‌ను పరిశీలించాలి. ఒక కుటుంబ ఆదాయంలో ఆహారం కోసం ఖర్చు చేసే మొత్తం పెరిగితే విద్య, వైద్యం, ఇల్లు, రవాణా, పిల్లల అవసరాలు, పొదుపు వంటి ఇతర రంగాలకు కేటాయించే డబ్బు తగ్గుతుంది. తక్కువ ఆదాయ కుటుంబాల్లో ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. అధిక ఆదాయం కలిగిన కుటుంబాలు ధరల పెరుగుదలను కొంతవరకు భరించగలిగినా, పేద కుటుంబాలకు ఆహార ధరల పెరుగుదల నేరుగా జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతుంది. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు కుటుంబాలు ముందుగా అనవసర ఖర్చులను తగ్గిస్తాయి. ఆ తర్వాత వినోదం, ప్రయాణాలు, దుస్తులు, గృహోపకరణాల కొనుగోళ్లు వంటి ఖర్చులను వాయిదా వేస్తాయి. పరిస్థితి మరింత తీవ్రమైతే పప్పులు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాహార పదార్థాల వినియోగాన్ని కూడా తగ్గించే ప్రమాదం ఉంటుంది. ఇక్కడే ద్రవ్యోల్బణం ఆర్థిక సమస్య నుంచి సామాజిక సమస్యగా మారుతుంది.

ధరల పెరుగుదలకు ఒకే కారణం ఉండదు. వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం, వాతావరణ మార్పులు, ఇంధన ధరలు, రవాణా వ్యయం, నిల్వ సదుపాయాల కొరత, సరఫరా వ్యవస్థలో లోపాలు, మధ్యవర్తుల అధిక మార్జిన్లు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు వంటి అనేక అంశాలు కలిసి నిత్యావసర వస్తువుల ధరలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా పాడైపోయే కూరగాయలు, పండ్ల విషయంలో సరైన శీతల నిల్వ వ్యవస్థలు లేకపోవడం వల్ల రైతు ఉత్పత్తి మార్కెట్‌కు చేరేలోపే నష్టం జరుగుతుంది. ఆ నష్టాన్ని చివరకు వినియోగదారుడే అధిక ధరల రూపంలో భరిస్తాడు. రైతుకు తగిన ధర రాకపోవడం, వినియోగదారుడు అధిక ధర చెల్లించాల్సి రావడం మధ్యలో ఉన్న మార్కెట్ వ్యవస్థలోని సమస్యలను సూచిస్తుంది. రైతు ఉత్పత్తికి న్యాయమైన ధర లభించాలి. అదే సమయంలో వినియోగదారుడికి సరసమైన ధరకు నాణ్యమైన ఆహారం అందాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడానికి రైతు బజార్లు, సహకార మార్కెటింగ్ వ్యవస్థలు, ప్రత్యక్ష మార్కెట్ అవకాశాలు, నిల్వ కేంద్రాలు, శీతల గిడ్డంగులు, సమర్థవంతమైన రవాణా వ్యవస్థలు బలోపేతం కావాలి.

ద్రవ్యోల్బణం ఎక్కువకాలం కొనసాగితే దాని ప్రభావం ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలపై కూడా పడుతుంది. వినియోగం తగ్గుతుంది. చిన్న వ్యాపారాల అమ్మకాలు తగ్గవచ్చు. కుటుంబాలు పెద్ద కొనుగోళ్లను వాయిదా వేస్తాయి. పొదుపులు తగ్గుతాయి. అప్పులపై ఆధారపడే పరిస్థితి పెరుగుతుంది. చివరకు ఆర్థిక వృద్ధి వేగంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందువల్ల వంటగదిపై పడుతున్న ద్రవ్యోల్బణ భారాన్ని ఒక కుటుంబ సమస్యగా మాత్రమే చూడకూడదు. ఇది వ్యవసాయం, మార్కెట్లు, ఉపాధి, ఆదాయాలు, ప్రజారోగ్యం, పోషకాహారం, సామాజిక సమానత్వం వంటి అనేక రంగాలతో ముడిపడి ఉన్న సమస్య.

భారత ఆర్థిక వ్యవస్థలో చక్కెరకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇది ఒకవైపు వ్యవసాయ ఉత్పత్తి కాగా, మరోవైపు పారిశ్రామిక ఉత్పత్తి. కోట్లాది మంది రైతులను చక్కెర కర్మాగారాలు, వ్యాపారులు, శుద్ధి పరిశ్రమలు, వినియోగదారులతో అనుసంధానించే వస్తువుగా చక్కెర నిలుస్తుంది. ఇటీవలి పరిణామాలు చక్కెర ధరల నిర్వహణ ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తున్నాయి. దేశీయంగా చక్కెర లభ్యతను పెంచి, పండుగల కాలానికి ముందు ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ముడి చక్కెర దిగుమతులపై సుంకాన్ని తొలగించింది. అయితే 2026 ఆగస్టులో రాయిటర్స్ నివేదిక ప్రకారం, దేశీయ చక్కెర ధరలు గణనీయంగా పడిపోవడంతో దిగుమతుల లాభదాయకత తగ్గిపోయింది. దీంతో అనుమతించిన పరిమాణంతో పోలిస్తే దిగుమతులు చాలా తక్కువగా ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేశాయి. ఇది ఒక ప్రాథమిక సమస్యను వెల్లడిస్తుంది. ధరలను నియంత్రించడం అంటే కేవలం సరఫరాను పెంచడం మాత్రమే కాదు. విధాన నిర్ణేతలు రైతుల ఆదాయం, చక్కెర కర్మాగారాల ఆర్థిక స్థితి, వినియోగదారుల కొనుగోలు సామర్థ్యం, ఎగుమతుల ప్రయోజనాలు, దేశీయ నిల్వలు వంటి అనేక అంశాలను ఒకేసారి పరిగణనలోకి తీసుకోవాలి. అయితే వినియోగదారుడి కోణంలో ఆర్థిక సిద్ధాంతం చాలా సరళమైనది. చక్కెర ధర పెరిగితే స్వీట్లు, బిస్కెట్లు, పానీయాలు, తీపి పదార్థాలు, అనేక గృహ తయారీ వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. పండుగల సమయంలో డిమాండ్ సాధారణంగా పెరిగే కారణంగా ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఆనందంతో ముడిపడిన చక్కెర, ఆర్థిక ఆందోళనకు ప్రతీకగా మారడం ఒక విచిత్రమైన పరిస్థితి.

చక్కెర ఆహార ద్రవ్యోల్బణానికి కనిపించే రూపమైతే, వంట నూనె దాని నిశ్శబ్దమైన, కానీ విస్తృతమైన ప్రభావాన్ని సూచిస్తుంది. భారతీయ వంటగదిలో నూనె ప్రతిరోజూ ఉపయోగించే వస్తువు. అందువల్ల దాని ధరలో స్వల్ప పెరుగుదల కూడా నెల రోజుల వ్యవధిలో లేదా ఏడాది కాలంలో కుటుంబంపై గణనీయమైన అదనపు భారాన్ని మోపుతుంది. అంతేకాకుండా వంట నూనెల ధరలు అంతర్జాతీయ వస్తు మార్కెట్లు, మారకపు విలువలు, దిగుమతి వ్యయాలు, దేశీయ నూనెగింజల ఉత్పత్తితో అనుసంధానమై ఉంటాయి. భారతదేశం దిగుమతి చేసుకునే వంట నూనెలపై ఆధారపడటం వల్ల దేశీయ మార్కెట్ అంతర్జాతీయ పరిణామాలకు మరింత సున్నితంగా మారుతుంది. ప్రపంచ మార్కెట్లో ధరలు పెరగడం, రవాణా వ్యయాలు అధికం కావడం లేదా దేశీయ కరెన్సీ విలువలో ప్రతికూల మార్పులు చోటుచేసుకున్నప్పుడు, ఆ ప్రభావం అంతర్జాతీయ మార్కెట్ల నుంచి టోకు మార్కెట్లకు, అక్కడి నుంచి చివరకు కుటుంబ వంటగదికి చేరుతుంది. వినియోగదారుడు ఈ మొత్తం సరఫరా గొలుసును చూడలేడు. ఒకప్పుడు నెలంతా సులభంగా సరిపోయే నూనె సీసా ఇప్పుడు త్వరగా ఖాళీ అవుతోందని లేదా దాన్ని తిరిగి కొనడానికి ఎక్కువ డబ్బు ఖర్చవుతోందని మాత్రమే గమనిస్తాడు.

భారతదేశ ఆహార ధరల అస్థిరతను ఉల్లిపాయ కంటే స్పష్టంగా చూపించే వస్తువులు చాలా తక్కువ. అన్ని ఆర్థిక వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజలు ఉల్లిపాయను వినియోగిస్తారు. అందువల్ల ఉల్లిపాయ సామాజికంగా, రాజకీయంగా అత్యంత సున్నితమైన వస్తువుగా మారింది. కాలానుగుణ లభ్యత, వాతావరణ పరిస్థితులు, నిల్వ సామర్థ్యం, రవాణా సమస్యలు, సరఫరాలో ఆకస్మిక మార్పుల కారణంగా ఉల్లిపాయ ధరలు ఒక్కసారిగా భారీగా మారవచ్చు. ఇటీవలి నివేదికలు ఉల్లిపాయ ధరలు గణనీయంగా పెరిగిన విషయాన్ని వెల్లడించాయి. దీనికి ప్రతిస్పందనగా కేంద్ర ప్రభుత్వం నిల్వ చేసిన ఉల్లిపాయలను విస్తృత రైల్వే రవాణా ద్వారా వివిధ ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చేపట్టింది. దీని ద్వారా ఉత్పత్తి ఎంత ముఖ్యమో, రవాణా మరియు పంపిణీ కూడా అంతే ముఖ్యమని స్పష్టమవుతోంది. ఉల్లిపాయల సమస్య మరింత లోతైన నిర్మాణాత్మక బలహీనతను బయటపెడుతుంది. దేశంలో మొత్తం మీద తగినంత ఆహారం ఉత్పత్తి అయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో లేదా కొన్ని కాలాల్లో కొరత ఏర్పడవచ్చు. అందువల్ల సమస్య కేవలం "ఎంత ఉత్పత్తి జరిగింది?" అనే ప్రశ్నతో ముగియదు. "అది ఎక్కడ నిల్వ ఉంది?", "ఎంత వేగంగా వినియోగదారుడికి చేరుతుంది?", "పంట కోత తర్వాత ఎంత నష్టం జరుగుతోంది?", "రైతు నుంచి వినియోగదారుడికి మార్కెట్ వ్యవస్థ ఎంత సమర్థవంతంగా అనుసంధానమవుతోంది?" అనే ప్రశ్నలు కూడా అంతే ముఖ్యమైనవి. ఈ అనుసంధానాల్లో లోపాలు ఏర్పడినప్పుడు చివరికి దాని భారాన్ని వినియోగదారుడే భరించాల్సి వస్తుంది.

ద్రవ్యోల్బణం కేవలం వస్తువుల ధరలను పెంచడమే కాదు. అది కుటుంబాల ప్రవర్తనను కూడా మార్చేస్తుంది. ఆహారంపై ఖర్చు పెరిగినప్పుడు కుటుంబాలు దుస్తులు, విద్యకు సంబంధించిన అవసరాలు, వినోదం, గృహ మెరుగుదలలు, ఇతర అవసరేతర కొనుగోళ్లపై ఖర్చులను తగ్గించుకోవాల్సి రావచ్చు. ఇటీవల ఆర్థిక విశ్లేషణలు కూడా అధిక ఆహార ద్రవ్యోల్బణం వల్ల కుటుంబాల అందుబాటులో ఉన్న ఆదాయంలో ఎక్కువ భాగం నిత్యావసర వినియోగానికే మళ్లిపోయి, ఆహారేతర వస్తువులు, సేవలపై వ్యయం బలహీనపడే అవకాశం ఉందని హెచ్చరించాయి. అందుకే ఆహార ద్రవ్యోల్బణాన్ని కేవలం వంటగదికి పరిమితం చేసి చూడకూడదు. ఒక కుటుంబానికి పరిమిత ఆదాయమే ఉంటుంది. కిరాణా బిల్లు పెరిగినా వేతనం అదే స్థాయిలో ఉంటే, మరేదో ఒక ఖర్చును తగ్గించుకోవాల్సిందే. పేద కుటుంబాలకు ఈ పరిస్థితి మరింత కష్టతరంగా ఉంటుంది. ఎందుకంటే వారి మొత్తం ఖర్చులో ఆహారానికి వెళ్లే వాటా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ద్రవ్యోల్బణానికి ఒక సామాజిక కోణం కూడా ఉంది. ధరలు పెరగడం వల్ల మాత్రమే అసమానత పెరగదు; ఆ ధరల పెరుగుదలను భరించే సామర్థ్యం కుటుంబాల మధ్య చాలా భిన్నంగా ఉండటం కూడా అసమానతను పెంచుతుంది. ద్రవ్యోల్బణానికి ఒక్క కారణాన్ని మాత్రమే నిందించడం సాధ్యం కాదు. వాతావరణ పరిస్థితులు వ్యవసాయ ఉత్పత్తిని తగ్గించవచ్చు. ఇంధన ధరలు రవాణా, ఉత్పత్తి వ్యయాలను పెంచవచ్చు. అంతర్జాతీయ వస్తు ధరల మార్పులు దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై ప్రభావం చూపవచ్చు. నిల్వ సదుపాయాల కొరత కాలానుగుణ కొరతకు దారితీయవచ్చు. మధ్యవర్తులు, మార్కెట్‌లోని అసమర్థతలు రైతు వద్ద లభించే ధరకు, వినియోగదారుడు చెల్లించే ధరకు మధ్య అంతరాన్ని పెంచవచ్చు. భయంతో అధికంగా కొనుగోలు చేయడం, ఊహాగానాలు కూడా తాత్కాలిక కొరతను మరింత తీవ్రతరం చేయవచ్చు. భారతీయ రిజర్వు బ్యాంకు కూడా ఇటీవల ఆహారం, ఇంధనం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్ల విస్తృత ద్రవ్యోల్బణ ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని నుంచి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ద్రవ్యోల్బణాన్ని కేవలం తాత్కాలిక ధర నియంత్రణలతో ఎదుర్కోవడం సాధ్యం కాదు. ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెట్ నియంత్రణ, సముచిత ద్రవ్య మరియు ఆర్థిక విధానాలను సమన్వయంతో అమలు చేయాలి.

**సంక్షోభ నిర్వహణ నుంచి నిర్మాణాత్మక సంస్కరణల వైపు**

భారతదేశానికి ఆహార ధరల స్థిరత్వం కోసం దీర్ఘకాలిక వ్యూహం అవసరం. మొదటగా, అనిశ్చిత వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయాలి. మెరుగైన సాగునీటి సదుపాయాలు, వాతావరణాన్ని తట్టుకునే పంటలు, మెరుగైన వ్యవసాయ పద్ధతులు సరఫరా లోటును తగ్గించగలవు. రెండవది, నిల్వ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలి. ఉల్లిపాయ వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తులకు శాస్త్రీయ నిల్వ సదుపాయాలు అవసరం. ఇవి పంట కోత అనంతర నష్టాలను తగ్గించడంతో పాటు ధరలు ఒక్కసారిగా పెరిగినప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేసే అవకాశాన్ని కల్పిస్తాయి. మూడవది, సరఫరా వ్యవస్థలను ఆధునీకరించాలి. వేగవంతమైన రవాణా, మెరుగైన మార్కెట్ అనుసంధానం, పారదర్శక ధరల వ్యవస్థ రైతు నుంచి వినియోగదారుడి వరకు ఉండే అనవసర మధ్యవర్తిత్వాన్ని తగ్గించగలవు. నాలుగవది, ప్రభుత్వ నిల్వలు, మార్కెట్ జోక్యాలు సమయానుకూలంగా, సమతుల్యంగా ఉండాలి. తాత్కాలికంగా ధరలను అణచివేయడం మాత్రమే లక్ష్యంగా కాకుండా, ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులను నివారించడంతో పాటు రైతులకు న్యాయమైన ప్రతిఫలం లభించేలా విధానాలు రూపొందించాలి. చివరగా, వినియోగదారులకు ధరలపై మరింత పారదర్శక సమాచారం అందుబాటులో ఉండాలి. పోటీతో కూడిన, సమాచారంతో నడిచే మార్కెట్ అన్యాయమైన ధరల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడుతుంది.

ద్రవ్యోల్బణం అసలు అర్థం కేవలం ఆర్థిక నివేదికల్లో కనిపించదు. నెలవారీ బడ్జెట్‌ను మౌనంగా మళ్లీ లెక్కించుకునే తల్లిదండ్రుల్లో అది కనిపిస్తుంది. లాభాలను కొనసాగించడానికి ఇబ్బంది పడే చిన్న వ్యాపారిలో కనిపిస్తుంది. ఉత్పత్తి వ్యయాల గురించి ఆందోళన చెందే రైతులో కనిపిస్తుంది. నిత్యావసర వస్తువులు ఎందుకు రోజురోజుకూ ఖరీదవుతున్నాయో ఆలోచించే వినియోగదారుడిలో కనిపిస్తుంది. చక్కెర, నూనె, ఉల్లిపాయ ఒక్కొక్కటిగా చూసినప్పుడు చిన్న వస్తువులుగా కనిపించవచ్చు. కానీ కోట్లాది కుటుంబాల జీవనంలో ఇవి ఆర్థిక పరిస్థితికి కీలక సూచికలు. ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థ అంటే కేవలం దేశ స్థూల దేశీయోత్పత్తి పెరగడం లేదా స్టాక్ మార్కెట్లు పెరగడం మాత్రమే కాదు. సాధారణ ప్రజలు తదుపరి ధరల షాక్ గురించి నిరంతరం భయపడకుండా నిత్యావసర ఆహారాన్ని కొనుగోలు చేయగలిగే పరిస్థితి కూడా ఉండాలి. అందువల్ల ఆర్థిక ప్రగతికి నిజమైన పరీక్ష దేశం ఎంత ఉత్పత్తి చేస్తుందనే దానితో మాత్రమే నిర్ణయించకూడదు. ఆ దేశ ప్రజలు ఆ ఉత్పత్తి నుంచి లభించే ప్రయోజనాలతో ఎంత భద్రంగా, స్థిరంగా జీవించగలుగుతున్నారనే దానిని కూడా కొలవాలి. ద్రవ్యోల్బణం ప్రభుత్వ లెక్కల పట్టికలో ఒక సంఖ్యగా ప్రారంభం కావచ్చు. కానీ చివరికి అది కుటుంబ భోజనపు బల్లపై ఒక ప్రశ్నగా మారుతుంది నిన్న కొనగలిగిన వస్తువును ఈరోజు కూడా ఆ కుటుంబం కొనగలదా? అందుకే చక్కెర, నూనె, ఉల్లిపాయల ధరలు కేవలం వంటగదికి సంబంధించిన అంశాలు కావు. అవి ఆర్థిక భద్రతకు, సామాజిక స్థిరత్వానికి, సాధారణ పౌరుడి కొనుగోలు శక్తికి కొలమానాలు.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# మీడియా మూలాలు మరిచినప్పుడు ప్రజాస్వామ్యం ఏం కోల్పోతుంది?

ఒకప్పుడు వార్తా మాధ్యమం అంటే ప్రజలకు సమాచారం అందించే సంస్థ మాత్రమే కాదు. అధికారాన్ని ప్రశ్నించే వ్యవస్థ. ప్రజల గొంతుకను ప్రభుత్వానికి వినిపించే వారధి. ప్రజాస్వామ్యానికి కాపలాదారు. అందుకే పత్రికా రంగాన్ని "నాలుగో స్థంభం"గా పిలిచారు. కానీ గత దశాబ్ద కాలంలో భారతీయ మీడియా ఎదుర్కొంటున్న పరిణామాలను పరిశీలిస్తే, సమస్య కేవలం కొన్ని టెలివిజన్ చానళ్ల రేటింగులు పడిపోవడం లేదా జిల్లా స్థాయిలో రిపోర్టర్ల సంఖ్య తగ్గడం కాదు. మీడియా తన సామాజిక పాత్ర, విశ్వసనీయత, స్వతంత్రతను క్రమంగా కోల్పోతున్నదా అన్నదే అసలు ప్రశ్న.

ఈ మార్పుకు సాంకేతిక పరిణామం ఒక ప్రధాన కారణం. స్మార్ట్‌ఫోన్, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, పాడ్‌కాస్ట్‌లు, కృత్రిమ మేధస్సు ఆధారిత సమాచార వేదికలు వార్తల వినియోగ పద్ధతినే మార్చేశాయి. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2026 నివేదిక ప్రకారం భారతదేశంలో ఆన్‌లైన్ వార్తలకు మొబైల్, సామాజిక మాధ్యమాలు ప్రధాన మార్గాలుగా మారాయి. టెలివిజన్ ఇప్పటికీ 44 శాతం మందికి వార్తల వనరుగా ఉన్నప్పటికీ, దాని ఏకాధిపత్యం తగ్గింది. అంటే పాతకాలపు భారీ న్యూస్‌రూమ్‌లు, వందలాది జిల్లా ప్రతినిధులు, ఖరీదైన ప్రసార వ్యవస్థలపై ఆధారపడిన మోడల్ ఆర్థికంగా ఒత్తిడికి గురవుతోంది. దీంతో మరో మార్పు వచ్చింది. వార్తా సంస్థకు జర్నలిజం కంటే "కంటెంట్" ముఖ్యమవుతోంది. వేగం, సంచలనం, రేటింగ్, క్లిక్, వైరల్ వీడియో ఇవే విజయానికి ప్రమాణాలుగా మారుతున్నాయి. ప్రకటనల ఆదాయం టెలివిజన్, పత్రికల నుంచి డిజిటల్ వేదికలకు మళ్లడం కూడా ఈ సంక్షోభాన్ని తీవ్రతరం చేసింది. కొవిడ్ తరువాత ఉద్యోగ కోతలు ఈ పరిస్థితిని మరింత బహిర్గతం చేశాయి. ఉదాహరణకు జీ నెట్‌వర్క్‌లో 2024లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించినట్లు సిబ్బంది వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వచ్చాయి. ఉద్యోగ భద్రత లేని జర్నలిస్టు యాజమాన్య ఒత్తిడిని, రాజకీయ ఒత్తిడిని ఎంతవరకు ఎదుర్కోగలడు అన్నది సహజమైన ప్రశ్న. అయితే భారతీయ మీడియా సంక్షోభాన్ని కేవలం టెక్నాలజీతో వివరించడం అసంపూర్ణం. మీడియా యాజమాన్యం కొద్దిమంది ఆర్థిక శక్తివంతుల చేతుల్లో కేంద్రీకృతం కావడం మరో కీలక పరిణామం. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2025 భారత నివేదికలో మీడియా యాజమాన్యం కొద్దిమంది సంపన్న వ్యాపారవేత్తల వద్ద కేంద్రీకృతమైందని, వారిలో పలువురు ప్రధానమంత్రికి అనుకూలంగా ఉన్నారని పేర్కొంది. అదే నివేదిక ప్రభుత్వాన్ని విమర్శించే స్వతంత్ర మీడియా సంస్థలు, జర్నలిస్టులు వేధింపులు లేదా చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇక్కడే రాజకీయ ప్రభావం ప్రశ్న ముందుకు వస్తుంది. 2014 తరువాత బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శకులు చేసిన ప్రధాన ఆరోపణ ఏమిటంటే ప్రభుత్వ సంస్థలు, నియంత్రణ వ్యవస్థలు, పన్ను దర్యాప్తులు, భద్రతా చట్టాలు, డిజిటల్ నియంత్రణలను ఉపయోగించి విమర్శనాత్మక స్వరాలపై ఒత్తిడి పెంచుతున్నారని. దీనిని ప్రభుత్వం సాధారణంగా చట్టబద్ధమైన దర్యాప్తు, జాతీయ భద్రత, తప్పుడు వార్తల నియంత్రణ అవసరంగా సమర్థిస్తుంది. కాబట్టి ప్రతి దర్యాప్తునూ "మీడియా అణచివేత"గా పరిగణించడం సరైంది కాదు. కానీ ఒకే విధమైన చర్యలు పదేపదే ప్రభుత్వాన్ని విమర్శించే సంస్థలపైనే పడుతున్నాయా అన్న ప్రశ్న మాత్రం ప్రజాస్వామ్యంలో తప్పక పరిశీలించాలి. బీబీసీ కార్యాలయాల్లో 2023లో జరిగిన ఆదాయపు పన్ను సర్వేలు ఇందుకు ప్రముఖ ఉదాహరణగా నిలిచాయి. అవి పన్ను నిబంధనల ప్రకారమే జరిగాయని ప్రభుత్వం చెప్పింది. కానీ ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, బీబీసీ డాక్యుమెంటరీపై ప్రభుత్వ చర్యల తరువాత ఈ సర్వేలు జరగడం వల్ల మీడియాపై భయపెట్టే ప్రభావం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

కాశ్మీర్‌లో జర్నలిస్టులపై కేసులు, విచారణలు, అరెస్టులు, ప్రయాణ పరిమితులు కూడా చాలా కాలంగా విమర్శలకు కారణమవుతున్నాయి. సిద్ధిక్ కప్పన్ అరెస్టు, యూఏపీఏ కింద దీర్ఘకాలిక నిర్బంధం అంతర్జాతీయ జర్నలిస్టు సంస్థల దృష్టిని ఆకర్షించింది. ఇలాంటి ఉదాహరణలు ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతున్నాయి: జర్నలిస్టును జైలులో పెట్టడం కంటే, కేసు నమోదైన వెంటనే ఏర్పడే భయం కూడా స్వీయ నియంత్రణకు దారి తీస్తుంది. డిజిటల్ యుగంలో ఈ ఒత్తిడి మరింత విస్తరించింది. 2021 సమాచార సాంకేతిక నియమాలు, 2023 టెలికమ్యూనికేషన్స్ చట్టం, డిజిటల్ వ్యక్తిగత డేటా చట్టం వంటి వ్యవస్థలపై స్వేచ్ఛా భావప్రకటనకు సంబంధించి విమర్శలు వచ్చాయి. కొత్త భారతీయ న్యాయ సంహితలోని 152వ సెక్షన్ దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు ముప్పు కలిగించే చర్యలకు కఠిన శిక్షలు నిర్దేశిస్తుంది. చట్టంలో ప్రభుత్వ చర్యలను చట్టబద్ధ మార్గాల్లో మార్చాలని కోరే విమర్శలు నేరం కాదని స్పష్టీకరణ ఉన్నప్పటికీ, ఇలాంటి విస్తృత పదజాలం దుర్వినియోగం కాకుండా జాగ్రత్త అవసరం. పెగాసస్ నిఘా ఆరోపణలు కూడా మీడియా స్వేచ్ఛపై అనుమానాలను పెంచాయి. జర్నలిస్టులు సహా వందలాది ప్రముఖుల ఫోన్లు లక్ష్యంగా పెట్టబడ్డాయని అంతర్జాతీయ దర్యాప్తులు వెల్లడించగా, భారతదేశంలో డిజిటల్ నిఘా సామర్థ్యాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇదంతా ప్రజల విశ్వాసంపై ప్రభావం చూపకపోవడం అసాధ్యం. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ 2026 నివేదిక ప్రకారం భారత సర్వేలో కేవలం 39 శాతం మంది మాత్రమే ఎక్కువ సమయం వార్తలను విశ్వసిస్తున్నామని చెప్పారు. ఇది ఆ నివేదికలో భారతదేశానికి 11 సంవత్సరాల్లో నమోదైన అత్యల్ప స్థాయి. అంటే ప్రజలు మీడియాను పూర్తిగా వదిలిపెట్టడం కాదు; కానీ ఏ మీడియాను, ఏ వార్తను, ఏ యాంకర్‌ను నమ్మాలో నిర్ణయించుకోవడానికి వారు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు. ఇక్కడే మన ముందున్న అసలు ప్రమాదం ఉంది. ఒక చానల్ ఒక పార్టీకి, మరొక చానల్ మరో పార్టీకి ప్రచార వేదికగా మారితే, ప్రజలకు వార్త కాదు. కేవలం పక్షపాతపు రాజకీయ వివరణ మాత్రమే మిగులుతుంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి అనుకూలంగా స్వరం మార్చుకోవడం కూడా అంతే ప్రమాదకరం. బీజేపీ--ఆరెస్సెస్ ప్రభావంపై విమర్శలు ఉన్నట్లే, గతంలో ఇతర పార్టీల పాలనలో మీడియా, రాజకీయ, వ్యాపార సంబంధాలపై కూడా విమర్శలు ఉన్నాయి. కాబట్టి సమస్యను ఒక్క పార్టీకి పరిమితం చేయడం కంటే, రాజకీయ అధికారం అలాగే మీడియా యాజమాన్యం మధ్య పెరుగుతున్న పరస్పరం ఆధారపడటాన్ని ప్రశ్నించాలి. యజమాని ఎవరు, ప్రభుత్వం ఏది, పార్టీ ఏది అనే లెక్కలకతీతంగా వాస్తవాన్ని ప్రజల ముందు ఉంచడమే జర్నలిజం. మీడియా తన మూలాలను మరిచిపోతే ప్రజలు దానిని ఎందుకు నమ్మాలి? చివరికి కోల్పోయేది చానల్ రేటింగ్ మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికి అవసరమైన ప్రజా విశ్వాసం కూడా.




డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్, 9849328496

# సావిత్రిబాయి పూలే జన్మదినమే, ఉపాధ్యాయ దినోత్సవం కావాలి!

ఈ దేశంలో మనుస్మృతి కారణంగా చదువుకు దూరమై, తీవ్ర సామాజిక అణచివేతలకు గురైన శూద్ర కులాల ప్రజలకు (ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల ప్రజలకు) చదువు చెప్పడం కోసం.. మనుస్మృతిని ధిక్కరించి, ఎన్నో కష్టాలకు ఓర్చి, అవమానాలను భరించి.. నిరుపేద శ్రామిక మహిళలకు, శ్రామిక ప్రజలకు విద్యాబుద్ధులు చెప్పిన, ఈ దేశపు మొట్టమొదటి పంతులమ్మ 'సావిత్రిబాయి పూలే!' అందువల్ల ఆ ఆదర్శ మహిళ పుట్టినరోజు 'ఉపాధ్యాయ దినోత్సవం' జరుపుకోవడమే సముచితం! ఇంతటి ప్రాధాన్యత కలిగిన అంశాన్ని, ప్రభుత్వాలు నేటికీ విస్మరించడం శోచనీయం!

చరిత్రలో ఉపాధ్యాయ వృత్తిలో నుండి, ఇతర రంగాల్లోకి వెళ్లి సేవలందించిన ప్రముఖులు అనేకమంది ఉన్నారు. ఆ విధంగా ఈ వృత్తిలో నుండి, రాజకీయ రంగంలోకి వెళ్లి, రాష్ట్రపతిగా సేవలందించిన 'సర్వేపల్లి రాధాకృష్ణన్' గారి సేవలను కూడా గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. అంతేకానీ, జీవితాంతం పేద ప్రజలకు చదువు చెప్పడమే లక్ష్యంగా కొనసాగిన సావిత్రిబాయి పూలే వంటి చదువుల తల్లిని విస్మరించి, సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పుట్టినరోజైన (సెప్టెంబర్ 5 నా) 'ఉపాధ్యాయ దినోత్సవం' ప్రభుత్వం జరపడం అంటే.. నిజమైన ఉపాధ్యాయులను




ప్రభుత్వాలు అవమానించడమే అవుతుంది. వారి పట్ల వివక్ష చూపడమే అవుతుంది! అందుకే ఆనాటి ప్రభుత్వం చేసిన ఈ పని ముందు చూపు లేక చేసిందా? వివక్షతతో చేసిందా? యాంత్రికంగా చేసిందా? అన్నది పునరాలోచించుకొని, సమీక్షించుకొని.. సావిత్రిబాయి పూలే పుట్టిన రోజైన జనవరి 3 (1831) న, 'ఉపాధ్యాయ దినోత్సవం' జరపాల్సిన బాధ్యత ఈనాటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంది. ఏ విధంగా చూసినా, ఉపాధ్యాయ వృత్తికి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చేసిన సేవల కంటే, సావిత్రిబాయి పూలే గారు చేసిన సేవలే ఉన్నతమైనవి, సామాజిక బాధ్యతతో కూడుకున్నవి అన్నది చారిత్రక వాస్తవం! కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల విజ్ఞప్తిని గుర్తించి, ఈ అంశం మీద సీరియస్ గా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది!

ప్రజలారా, నాటి నుండి నేటి వరకూ, సామాజిక అసమానతలకు అణచివేతలకు గురవుతున్న శ్రామిక ప్రజలంతా 'మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే' ల సేవలను గుర్తుపెట్టుకోవాలి! తమ వంతు సామాజిక బాధ్యతగా, సావిత్రిబాయి పూలే జన్మదినం అయిన జనవరి 3 తేదీన, అధికారికంగా ఉపాధ్యాయ దినోత్సవం జరపాలని, మనమంతా ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి! సాధారణ ఉపాధ్యాయులు, కొంతకాలమే ప్రజల జ్ఞాపకాల్లో ఉంటారు! కానీ సామాజిక ఉపాధ్యాయులు వారి సేవలు, చిరస్మరణీయం కాబట్టి.. వారు ప్రజల గుండెల్లో, సమాజ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారు!

ముద్దగౌని సుభాష్
సామాజిక ఉద్యమ రచయిత
ఫోన్: 9000904284

# శాటిలైట్ సహకారం అద్భుతం

- చంద్రయాన్-3 తర్వాత ప్రపంచం భారత్ వైపు చూస్తోంది
- స్పేస్ రంగంలో అందరికీ ఉద్యోగావకాశాలు
- ఇస్రో సీనియర్ సైంటిస్ట్ గంజి వెంకటనారాయణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా, దేశంలోనూ అభివృద్ధి కార్యక్రమాల్లో అంతరిక్ష సాంకేతికత, శాటిలైట్ల పాత్ర అత్యంత కీలకంగా మారిందని ఇస్రో సీనియర్ సైంటిస్ట్ గంజి వెంకటనారాయణ అన్నారు. సామాన్యుల నిత్యజీవితం నుంచి వ్యవసాయం, వాతావరణం, సముద్ర పరిశోధనలు, ఖనిజాల గుర్తింపు, ప్రభుత్వ సేవల వరకు శాటిలైట్ సేవలు విస్తృతంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆగస్టు 23 జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన దర్శిని, తెలంగాణ బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. "చంద్రయాన్-3 విజయోత్సవం.. పెన్సిల్ రాకెట్ నుంచి బాహుబలి రాకెట్ వరకు భారత స్ఫూర్తిదాయక ప్రయాణం" అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటనారాయణ హాజరై అంతరిక్ష రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

### సామాన్యుల జీవితంలో శాటిలైట్ల పాత్ర

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కనీస చదువు లేని వ్యక్తి సైతం సెల్‌ఫోన్ ద్వారా సాంకేతిక సేవలను వినియోగించుకుంటున్నారని చెప్పారు. రైతులు పొలాల్లోనే ఫోన్ల ద్వారా సమాచారాన్ని పొందుతున్నారని, చిన్న వస్తువు కొనుగోలు చేసినా స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసే స్థాయికి సాంకేతికత చేరిందన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలకు అవసరమైన కీలక సమాచారం కూడా శాటిలైట్ల ద్వారా అందుతోందని వివరించారు.

సముద్రంలో చేపలు ఎక్కడ ఉన్నాయో మత్స్యకారులకు సమాచారం అందించడం, వర్షాలు ఎప్పుడు, ఎక్కడ కురిసే అవకాశం ఉందో తెలుసుకోవడం, ప్రకృతి వైపరీత్యాలను అంచనా వేయడం, సముద్రాలు, అడవులు, కొండ ప్రాంతాల్లో ఖనిజ వనరులను గుర్తించడం వంటి అనేక రంగాల్లో ఉపగ్రహాలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. సెల్‌ఫోన్ వంటి పరికరాల స్థానాన్ని గుర్తించడంలోనూ శాటిలైట్ ఆధారిత సాంకేతికత ఉపయోగపడుతుందని చెప్పారు.

### చంద్రయాన్-3తో భారత్ ప్రతిష్ట మరింత పెరిగింది

చంద్రయాన్-3 విజయంతో అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ట మరింత పెరిగిందని వెంకటనారాయణ అన్నారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు చంద్రునిపై ప్రయోగాలు చేసినప్పటికీ, చంద్రయాన్-3 ద్వారా భారత్ సాధించిన విజయానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల నిరంతర కృషి, పట్టుదలతో దేశం అంతరిక్ష రంగంలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిందని పేర్కొన్నారు. దేశంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఉపగ్రహాల తయారీ, అంతరిక్ష పరిశోధనలకు భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. శాస్త్రవేత్తల కృషి ఫలితంగా భారత్ అంతరిక్ష రంగంలో అగ్రదేశాల సరసన నిలిచిందన్నారు.

### కర్మాన్ లైన్ దాటితే అంతరిక్షం

భూమి వాతావరణానికి, బాహ్య అంతరిక్షానికి మధ్య ఉన్న సరిహద్దును కర్మాన్ లైన్ అంటారని ఆయన విద్యార్థులకు వివరించారు. సముద్ర మట్టానికి సుమారు 100 కిలోమీటర్ల ఎత్తులో ఈ సరిహద్దు ఉంటుందని తెలిపారు. అంతరిక్షంపై పరిశోధనల్లో ఈ రేఖకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు.



### స్పేస్ రంగంలో అందరికీ ఉద్యోగ అవకాశాలు

అంతరిక్ష రంగంలో ఉద్యోగాలు కేవలం గొప్ప శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకే పరిమితం కావని వెంకటనారాయణ స్పష్టం చేశారు. వివిధ డిగ్రీలు, పాలిటెక్నిక్ డిప్లొమాలు, సాంకేతిక విద్యార్హతలు కలిగిన వారికి అనేక విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే సైన్స్, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశంలోని ప్రముఖ పరిశోధనా ప్రయోగశాలలను సందర్శించే అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ఇలాంటి శాస్త్రీయ కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని కోరారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో అంతరిక్ష, సాంకేతిక రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు టి. రమేష్, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్. సోమయ్య, మహేష్ దుర్గే, కమిటీ సభ్యులు శోభారాణి, నవీన్ చాపల, సౌభాగ్య, పద్మ, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, బాల నారాయణ, సంధ్య, పి. నవీన్, బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది ఉపాధ్యాయులు, సైన్స్ విద్యార్థులు హాజరై అంతరిక్ష రంగానికి సంబంధించిన పలు ప్రశ్నలను అడగగా వెంకటనారాయణ సమాధానాలు ఇచ్చారు.

## బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ప్రజా సంక్షేమం ఒక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. గౌతమ్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ గూటికి చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వైపే మొగ్గు చూపుతున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని, అందుకే ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున చేరికలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, బిఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, జ్ఞానేశ్వర్, యాదగిరి, కరి రాజు, దేవేందర్, బాలరాజ్, ఎల్లం బాబు, శేఖర్ గౌడ్, రాజేష్, రవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**కేశంపేట, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పేదలు రేషన్ కార్డులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ రేషన్ కార్డులను అందజేసిందని చెప్పారు. ప్రభుత్వం పంపిణీ వ్యవస్థను ఆధునీకరిస్తూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ మరింత సులభతరం అవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**మొయినాబాద్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని వారిని మోసం చేసిందని.. నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయడం లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. శనివారం మొయినాబాద్ మండల కేంద్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదని నిరసిస్తూ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి వారి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వం ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. నిరుద్యోగులు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, నరోత్తం రెడ్డి జగన్మోహన్ రెడ్డి నరసింహారెడ్డి కొత్త నరసింహారెడ్డి, ముదిగొండ రవి యాదవ్, కొత్తపల్లి తిరుపతిరెడ్డి సుధాకర్ యాదవ్ సాయిలు సురేందర్ గౌడ్ నరేష్ ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, కొంతం నాగేశ్వర్ రెడ్డి, డప్పు రాజు, పార్టీ ప్రసాద్నాగరాజు మధు సాగర్ కృష్ణారెడ్డి, మన్నె ప్రభాకర్ రెడ్డి సాయిపాల్ రెడ్డి అరవింద్ రజక తదితరులు ఉ

## శిరీష హత్యాచార ఘటనపై పిఓడబ్ల్యు బృందం పరిశీలన



**హయత్‌నగర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఊకె శిరీష అత్యాచారం, హత్యకు గురైన ఘటనపై ప్రగతిశీల మహిళా సంఘం బృందం శనివారం తుక్కుగూడలో పర్యటించింది. సంఘటనా స్థలంతో పాటు శిరీష పనిచేసిన ప్రైమ్ కేర్ సూపర్ స్పెషాలిటీ ప్రైవేట్ ఆసుపత్రిని, సంబంధిత పోలీస్ స్టేషన్‌ను బృందం సందర్శించి వివరాలను సేకరించింది. ఈ సందర్భంగా పి ఓ డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనసూయ మాట్లాడుతూ సుదూర అటవీ ప్రాంతాల నుంచి చదువుకొని, ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన యువతుల భద్రతకు తగిన రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఆసుపత్రి యాజమాన్యం తమ ఆధ్వర్యంలో కేటాయించిన గదుల్లో నివసిస్తున్న యువతుల భద్రత తమ బాధ్యత కాదని చెప్పడం విచారకరమన్నారు. వసతి సదుపాయాల భద్రత తమ పరిధిలో లేదని, అది డి ఎం హెచ్ ఓ పరిధి లోని అంశమని పోలీసు అధికారులు చెప్పడం కూడా బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆమె విమర్శించారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో మహిళలపై లైంగిక, కుటుంబ హింస ఘటనలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. శిరీష అత్యాచారం, హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి నిందితుడికి కఠిన శిక్ష విధించాలని ఆమె డిమాండ్ చేశారు. లైంగిక నేరాలకు దారితీసే మద్యం, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు, చట్టవిరుద్ధమైన పోర్నోగ్రఫీ కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శిరీష కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు నాయకులు స్వరూప, రేణుక, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నల్లచెరువుకు మహర్దశ

- మురికికూపం నుంచి ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా రూపాంతరం
- ఆక్రమణల తొలగింపుతో 52.30 నుంచి 67.31 ఎకరాలకు పెరిగిన విస్తీర్ణం
- 2.4 కిలోమీటర్ల బండ్..
- వాకింగ్ ట్రాక్, గజీబోలు, కూర్చునే సదుపాయాలతో సరికొత్త రూపు



**ఉప్పల్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** ఉప్పల్ నల్లచెరువుకు మహర్దశ పట్టనుంది. ఒకప్పుడు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీరు, ముళ్లపొదలతో మురికికూపంగా మారిన నల్లచెరువు ప్రస్తుతం హైడ్రా చర్యలతో సరికొత్త రూపును సంతరించుకుంటోంది. చెరువు పరిసరాల్లోని ఆక్రమణలను తొలగిస్తూ, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

ఆక్రమణల కారణంగా గతంలో 52.30 ఎకరాలకు పరిమితమైన నల్లచెరువు విస్తీర్ణాన్ని హైడ్రా చర్యలతో 67.31 ఎకరాలకు పెంచారు. చెరువు చుట్టూ సుమారు 2.4 కిలోమీటర్ల మేర బండ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్, గజీబోలు, కూర్చునే సదుపాయాలు, పచ్చదనం తదితర ఏర్పాట్లతో నల్లచెరువును ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విహార కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు.

### ఆక్రమణలపై కొరడా

ఉప్పల్ నల్లచెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను ఎలాంటి సడలింపులు లేకుండా తొలగించినట్లు అధికారులు తెలిపారు. చెరువు విస్తీర్ణాన్ని పునరుద్ధరించడంతో పాటు నీటి నిల్వకు అవసరమైన స్థలాన్ని కాపాడుతున్నారు. చెరువులో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీటి సమస్యలను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు.

### వరద నియంత్రణలో కీలకం

నల్లచెరువు అభివృద్ధి పూర్తయితే ఉప్పల్ ప్రాంతంలో వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు వరదనీటి నియంత్రణకు కూడా ప్రయోజనం చేకూరనుంది. చెరువు చుట్టూ పచ్చదనం, వాకింగ్ ట్రాక్, ఇతర సదుపాయాలు అందుబాటులోకి వస్తే ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం లభించనుంది. ఉప్పల్ అభివృద్ధిలో కీలకంగా మారుతున్న నల్లచెరువు భవిష్యత్తులో స్థానికులకు ఆహ్లాదాన్ని అందించే ప్రధాన విహార కేంద్రంగా రూపుదిద్దుకోనుంది.

## జీవో 97ను ప్రభుత్వం రద్దు చేయాలి



**నిజాంపేట్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ విప్ కె.పి. వివేకానంద సూచనల మేరకు గండిమైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, బీఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శంభీపూర్ క్రిష్ణ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పెద్ద సంఖ్యలో బైక్‌లతో భారీ ర్యాలీగా ఐడీపీఎల్ ఎక్స్ రోడ్స్ వరకు తరలివెళ్లారు. విద్యార్థులు, యువత హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరుబాట ,ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్. విద్యార్థులు, యువత హక్కుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, ఆయా డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, యువజన మరియు విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులు యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి రాని కేసీఆర్ రాజీనామా చేయాలి



**కాప్రా, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** అసెంబ్లీకి రాని కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. శాసనసభకు రాకుండా, ప్రజల సమస్యలపై మాట్లాడకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌తో ఎవరికీ కూడా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్ పజ్జురి పావని మణిపాల్ రెడ్డి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్ డివిజన్ అధ్యక్షులు ,మాజీ కార్పొరేటర్లు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,ఎస్ సి సెల్,బీసీ సెల్,మైనారిటీగా,మహిళా కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం

- కాంగ్రెస్ హామీల అమలుకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టం
- మాజీ మంత్రి తలసాని

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీమంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పద్మారావునగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పద్మారావునగర్‌లోని ఎస్వీ కాలేజీ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువులు పూర్తయినా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యా సంస్థల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో చెల్లించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూశామని అన్నారు.

### జీవో 97 రద్దు చేయాలి

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల ఆస్తులపై ప్రభుత్వం కన్నేసిందని తలసాని ఆరోపించారు. వాటిని ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని అన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97తో పాలిటెక్నిక్ విద్య భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కాలేజీలను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేయాలని




చూస్తున్నారని, జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, అంబులెన్స్ సురేష్, వెంకటరమణ, మహేందర్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కొత్తూరు వెంకట్, అశ్విన్, జగ్గయ్య, రవి, ముక్కా శ్రీనివాస్, శ్రీనివాస్, అనిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూములపై 22-ఏ నిషేధం ఎత్తివేయాలి

- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
- రెవెన్యూ మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**గుమ్మడిదల, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** రైతుల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్‌ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో రైతన్న పోరుబాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని ఆరోపించారు. రైతులను రాజులను చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర విషయంలోనూ రైతులకు తగిన న్యాయం జరగడం లేదని అన్నారు.

### కేసీఆర్ హయాంలో వ్యవసాయానికి ప్రాధాన్యం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్ల పాటు పోరాడిన కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలిచారని అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో రైతులు రాత్రివేళ పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేయాల్సిన పరిస్థితి తగ్గిందని పేర్కొన్నారు.

### 22-ఏ జాబితాతో రైతులకు ఇబ్బందులు

జిన్నారం, గుమ్మడిదల తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. భూములు బ్లాక్‌లిస్ట్‌లో ఉండటంతో వాటిని విక్రయించుకోవడం, రుణాలు పొందడం వంటి విషయాల్లో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

రైతుల భూములపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

### రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం

ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పరిశ్రమల కోసం కేటాయించిన భూములకు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని మహిపాల్‌రెడ్డి అన్నారు. రైతుల భూముల విషయంలో అక్రమాలు, మధ్యవర్తుల జోక్యం ఉన్నట్లయితే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు.

రైతులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వారి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెబ్బేరు పీహెచ్‌సీలో డాక్టర్‌ను నియమిస్తాం

- జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్



**పెబ్బేరు, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న జనరల్ ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, ఇన్ పేషెంట్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధుల మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, రాకుండా ప్రతి మంగళ వారం మరియు శుక్రవారం రోజు అందరూ డ్రై డే కార్యక్రమం నిర్వహించాలనీ వైద్య సిబ్బందికి చెప్పినారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ ఆఫీసర్ కొరత ఉన్నందున ఇద్దరిని నియమించారు, తొందరలో కొత్త డాక్టర్‌ను నియమిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ సుధారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్, నర్సింగ్ రావు , హెల్త్ సూపర్వైజర్ పార్వతి హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ ఫార్మసిస్ట్ కుమారి, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ లక్ష్మీ, ల్యాబ్ టెక్నీషియన్ విక్టర్ రాజు, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనపై విమర్శించడం విడ్డూరం

- మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్




**పెబ్బేరు, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంబరాలను చూసి జీర్ణించుకోలేక బీజేపీ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేయడం విడ్డూరమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. శనివారం పెబ్బేరు పాత్రికే భవనంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలపై పూర్తి అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత విద్యుత్‌తో పాటు రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం, విద్య, వైద్యం తదితర రంగాల్లో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. పెబ్బేరు అభివృద్ధి విషయానికి వస్తే గతంతో పోలిస్తే బస్టాండ్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయని, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కూడా చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నూతన ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయని, ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ చొరవతోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. పెబ్బేరు మున్సిపాలిటీ ఏర్పడి కేవలం ఎనిమిది నెలల సమయం మాత్రమే అయిందని, ఈ స్వల్ప కాలంలోనే అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. పెబ్బేరు ప్రాంతంలో డివైడర్, ఫ్లైఓవర్ లేదా అవసరమైన ఇతర రహదారి సదుపాయాలు కల్పించి విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చిన విషయాన్ని చూసి మీరు కూడా కిషన్‌రెడ్డికి వినతిపత్రాలు ఇవ్వడం మాత్రమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ నాయకులకు సూచించారు. ఈ సమావేశం మున్సిపల్ ఛైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి కౌన్సిలర్లు తాటికొండ కృష్ణ ,శివ సాయి, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల టీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- రాజిరెడ్డిని విమర్శించడం తగదు
- మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి
- సర్పంచుల పోరం జిల్లాఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి



**వెల్దుర్తి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** గత పది సంవత్సరాల కాలంలో మాసాయిపేట గ్రామానికి ఏ ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి మాసాయిపేట మండల కేంద్రంలో శనివారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండల కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు మాసాయిపేట 13 గ్రామాలను కలిపి మాసాయి పేట మండలం గా ఏర్పడిందని నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో మండల పరిధిలోని నాగ్సన్ పల్లి హకీంపేట్ గ్రామాలకు కోట్ల రూపాయల నిధులు వేయించి రోడ్డు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు తమ గ్రామానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయని అవి కూడా పూర్తయి కొందరు గృహప్రవేశాలు కూడా చేశారన్నారు ఆవుల రాజు రెడ్డి తన ట్రస్టు ద్వారా నర్సాపూర్ నియోజకవర్గంలో ఎంతోమందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు సమకూర్చి వారికి కంటి ఆపరేషన్ కూడా చేయించారని అన్నారు బిఆర్ఎస్ నాయకులు తమ మండలాన్నికి ఏమి అభివృద్ధి చేశారని జిల్లా మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ రాజిరెడ్డి పై అనుశ్చిత వ్యాఖ్యలు చేయడం సబవు కాదని మాసాయిపేట గ్రామానికి ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి గోమారం గ్రామానికి కూడా అన్ని ఇండ్లు మంజూరయ్యాయని గత పది సంవత్సరాలలో టిఆర్ఎస్ పార్టీ ఈ గ్రామంలోనైనా ఒక్క ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన దాఖలా లేవని కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదింటి కలలు నెరవేర్చేందుకు గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు ఇప్పటికైనా చంద్ర గౌడ్ నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి సిద్ధ రాములు గౌడ్ 13 గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

- జూనియర్ సివిల్ జడ్జి, స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి. దుర్గారాణి




సంగారెడ్డి, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి స్పెషల్ కోర్టు న్యాయమూర్తి టి. దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలను వివరించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకొని క్రమశిక్షణ, నైతిక విలువలతో మంచి పౌరులుగా ఎదగాలని న్యాయమూర్తి సూచించారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు మాదిగ జర్నలిస్టులు ఏకమవ్వాలి

- టీఎంజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి సురేందర్ పిలుపు



**జడ్చర్ల, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** హక్కుల సాధన కోసం మాదిగ జర్నలిస్టులందరూ ఐక్యం కావాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజెఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి సురేందర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న టీఎంజెఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల కరపత్రాలను శనివారం జడ్చర్ల సిగ్నల్ గడ్డ, అంబేద్కర్ కూడలిలో ఆవిష్కరించారు. ఎస్సై జయప్రసాద్, జెడ్పీ మాజీ వైస్ చైర్పర్సన్ కోడుగల్ యాదయ్య, మాజీ ఎంపీటీసీ సుంకసారి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు, సామాజిక మార్పుకు సంఘాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ నెల 12వ తేదీన హైదరాబాద్ కోఠిలోని బీసీసీ భవన్‌లో టీఎంజెఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు నిర్వహించనున్నట్లు ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేతరి దాసు, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పుల్లగళ్ల శ్రీధర్ వెల్లడించారు. ఈ మహాసభలకు మాదిగ మేధావులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభల నిర్వహణ నేపథ్యంలో జడ్చర్ల మండల అడ హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా గిద్ద విజయ్ కుమార్, కో-కన్వీనర్లుగా గడ్డమీది మహేష్, కడమంచి చెన్నయ్య నియామకమయ్యారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కే. శ్రీనివాస్, కో-కన్వీనర్ లింగగళ్ల నరసింహులు, ఎస్. కృష్ణ, నాయకులు కరాటే శ్రీను, శంకర్ నాయక్, ఇంతియాజ్, గిరి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కిశోర్, రఘుపతి రెడ్డి, కోడ్గల్ రమేష్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఏసీ సెక్రెటరీ శ్రీమతి ఆర్. సిరి సౌజన్య పిలుపునిచ్చారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయస్థానాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకునే రాజీ మార్గమే కక్షిదారులకు నిజమైన రాజమార్గమని పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, సులభంగా, తక్కువ ఖర్చుతో చట్టబద్ధమైన న్యాయం అందించడమే లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ నెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల పెండింగ్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ప్రత్యేకంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, భూసేకరణ కేసులు, మున్సిపల్, ఇన్సూరెన్స్, బ్యాంకు తదితర కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా పరిష్కరించుకోవడంతో పాటు కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. కాబట్టి కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరిక
- సంగారెడ్డిలో విద్యార్థి యువజన నిరసన ర్యాలీ
- నాలుగో రోజు కు చేరిన నిరసనలు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా నాలుగో రోజు సంగారెడ్డిలో విద్యార్థి--యువజన నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొని. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తవుతున్నాయి. అయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం కాలేదు, జాబ్ క్యాలెండర్ అమలు కాలేదు, యూత్ డిక్లరేషన్ హామీలు నెరవేరలేదు. యువతకు ఇచ్చిన మాట ఏమైంది? నిరుద్యోగులకు చూపించిన ఆశలు ఏమయ్యాయి?" అంటూ ప్రశ్నించారు. అధికారం కోసం అవగాహన లేకుండా ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా యువత, విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోవాలని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. "రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాషను చూసి విద్యార్థులు, యువత కూడా అదే స్థాయిలో ప్రశ్నిస్తున్నారు. యువతను తక్కువ అంచనా వేయొద్దు" అని అన్నారు. దేశవ్యాప్తంగా యువత తమ హక్కుల కోసం పోరాడిన సందర్భాలను గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్య గొంతును అణచివేయాలని ప్రయత్నించినా యువత ఉద్యమాలు ఆగవని స్పష్టం చేశారు. "హామీలు అమలు చేయకపోతే బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం మరింత ఉధృతం అవుతుంది. యువత, విద్యార్థుల పక్షాన చివరి వరకు నిలబడతాం అని ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం అని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి, యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలి. లేకపోతే ప్రజా ఉద్యమం తీవ్రతరం అవుతుంది" అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరించారు. హామీలు అమలు చేసే వరకు మా పోరాటం ఆగదు... యువతకు న్యాయం జరిగే వరకు మా అడుగులు వెనక్కి పడవు" అంటూ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీలో విద్యార్థులు, యువజన నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చంద్ర గౌడ్, మాజీ డీసీసీబీ వైస్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, హకీం, మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి , విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి , మనోహర్ గౌడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు యువత నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్ పెద్ద ఎత్తున యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** విద్యార్థులకు జ్ఞానంతో పాటు విలువలు, విజ్ఞానం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణను నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని శాసన మండలి సభ్యుడు అంజిరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. మత్తు పదార్థాలకు, సెల్‌ఫోన్ వ్యసనానికి విద్యార్థులు దూరంగా ఉండేలా పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను విద్యా ప్రయోజనాలకే వినియోగించేలా మార్గనిర్దేశం చేయాలని అన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రీడలు, పుస్తక పఠనం, శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచాలని సూచించారు. కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికత, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, జిల్లా విద్యాధికారి రోహిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం తప్పనిసరి

- విద్యుత్ సమస్యలపై సర్పంచుల ఫిర్యాదు..
- స్పందించిన విప్ రామచంద్రనాయక్




**డోర్నకల్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మండలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ అధికారు లను ప్రజాప్రతినిధులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమన్వయ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల ప్రగతిపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. రోడ్లు, భవనాలు, చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రాధాన్యత మండల పరిధిలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో చెక్ డ్యాంలు, అంతర్గత రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు వివరించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తక్కువ కాలంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా మారిందని ఆయన కొనియాడారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు.. సీజనల్ వ్యాధులపై అలర్ట్**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎలాంటి రాజకీయం ఉండకూడదని విప్ స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా అర్హత ప్రాతిపదికన పేదలకు, జర్నలిస్టులకు, ఉద్యమకారులకు ఇండ్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ అలర్ట్‌గా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని తాగునీటి క్లోరినేషన్ సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపిక

- జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు చేతుల మీదుగా అవార్డుల స్వీకరణ...



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 5 ( జనం సాక్షి):** వరంగల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార 2026 ప్రధానోత్సవం వరంగల్ లోని ఆకుతోట కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. చెన్నారావుపేట మండలం నుండి ఈదునూరి రవీందర్ రెడ్డి చెన్నారావుపేట ఉపాధ్యాయులు, సంతోష్ కుమార్ ఉప్పరపల్లి ఉపాధ్యాయులు, నల్ల రవి అమీనాబాద్ ఉపాధ్యాయులు, పావని ఎల్లయ్యగూడెం ఉపాధ్యాయురాలు నలుగురు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద , జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు చేతుల మీదుగా పూరస్కారాలను అనుకున్నారు . జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన ఉపాధ్యాయులకు పిఆర్టియు చెన్నారావుపేట మండల శాఖ పక్షాన మండల అధ్యక్షులు పూజారి సురేందర్, ప్రధాన కార్యదర్శి బానోతు వెంకన్న లు శుభాకాంక్షలు తెలిపారు.

## చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి బాటగా తీర్చిదిద్దుతా

- మంత్రి వివేక్ వెంకటస్వామి



**చెన్నూర్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీల మేరకు అన్ని పనులను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం ఉదయం స్థానిక అయ్యప్ప ఆలయంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో ఇప్పటికే కొనసాగుతున్న అభివృద్ధి పనులతో పాటు మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బస్ డిపో నిర్మాణానికి భూ సమస్యపై కోర్టులో కేసు ఉండటంతో కొంత జాప్యం జరుగుతోందని, సమస్య పరిష్కారం కాగానే పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. చెన్నూర్, కోటపల్లి మండలాలతో పాటు వేమనపల్లి మండల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. గత పదేళ్లలో పెండింగ్‌లో ఉన్న జోడుబాగుల వంతెన నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు త్వరలోనే రానున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళు ,, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి, కౌన్సిలర్ అజీమ్, కో ఆప్షన్ సభ్యుడు సాధనబోయిన కృష్ణ, సీనియర్ నాయకులు బెల్లంకొండ కరుణాకర్ రావు, తనువుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య హత్య కేసులో నిందితుడి అరెస్ట్



**నెన్నెల, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని నెన్నెల పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నెన్నెల గ్రామానికి చెందిన తోట మల్లేష్ (42) తన భార్య తోట సబిత (38)ను హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. కొంతకాలంగా భార్యపై అనుమానంతో మల్లేష్ తరచూ ఆమెను వేధిస్తూ గొడవపడేవాడని, గతంలోనూ హత్యకు ప్రయత్నించినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 2న మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మల్లేష్ తన భార్యను గొంతు నులిమి, అనంతరం ఇంట్లో లభించిన పదునైన వస్తువుతో గొంతుపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం రక్తపు మరకలు ఉన్న దుస్తులను ఇంట్లోనే వదిలి, దుస్తులు మార్చుకుని అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు సెప్టెంబర్ 4న సాయంత్రం తాళ్లగురజాల వై-జంక్షన్ వద్ద మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ హనూక్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.

# అప్పుల తెలంగాణను.. అభివృద్ధి తెలంగాణగా మార్చాం!

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు..
- కాంగ్రెస్ వెయ్యి రోజుల్లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట..
- భూపాలపల్లి అభివృద్ధికి భారీగా నిధులు..
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి బాట పట్టించిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రజా సంక్షేమం, రైతుల సంక్షేమం, పేదల సొంతింటి కల, మహిళలకు అండగా నిలిచే కార్యక్రమాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ, రోడ్‌షోలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలో సందడి నెలకొంది. పార్టీ జెండాలు, నినాదాలతో ప్రధాన రహదారులు మార్మోగాయి. ర్యాలీ అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని గండ్ర విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తామని, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల భారంతో కుదేలు చేశారని గండ్ర మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26.70 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటివరకు రూ.31 కోట్ల మేర సాయం అందించామని వెల్లడించారు. ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వ అండగా నిలవాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు.

**44,700 ఎకరాలకు దేవాదుల నీరు..**

భూపాలపల్లి నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డీబీఎం-38 ద్వారా గోరుకొత్తపల్లి, రేగొండ, చిట్యాల, టేకుమట్ల మండలాల్లోని 44,700 ఎకరాలకు దేవాదుల నీటిని అందించేందుకు రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. సాగునీరు అందుబాటులోకి వస్తే ఆయా మండలాల్లో వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని, వ్యవసాయరంగం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. రైతుల భూములకు నీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని తెలిపారు. నియోజకవర్గంలోని సాగునీటి వనరులను బలోపేతం చేసేందుకు కూడా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గడప సముద్రం, భీమ్‌గన్‌పూర్ చెరువులకు సిమెంట్ లైనింగ్ పనులకు ఇప్పటికే మంజూర్లు వచ్చాయని, త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. చెరువులు, కాలువల అభివృద్ధితో సాగునీటి సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**అవినీతికి తావులేదు.. ఉక్కుపాదంతో అణచివేత..**

తమ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు, భూకబ్జాలకు ఏమాత్రం అవకాశం లేదని గండ్ర స్పష్టం చేశారు. ప్రజల హక్కులను, ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. అధికారులు తప్పు చేసినా, దళారులు, రౌడీలు ఎవరైనా చట్టానికి లోబడి వ్యవహరించాల్సిందేనని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలను ఉక్కుపాదంతో అణచివేస్తామని స్పష్టం చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో భూపాలపల్లి నియోజకవర్గానికి తీసుకొచ్చిన నిధులు, గత పాలనలో తీసుకొచ్చిన నిధులపై పూర్తి లెక్కలు ప్రజల ముందు ఉంచుతామని ఎమ్మెల్యే అన్నారు. మాటలతో కాకుండా పనులతోనే అభివృద్ధిని నిరూపిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు, సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. భూపాలపల్లిని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపడం తన లక్ష్యమని గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ ర్యాలీకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో జిల్లా కేంద్రం కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో మార్మోగింది. వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషన్ సభ్యులు రామ్ నరసింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు అప్పం కిషన్, బొడ్డు అశోక్, సర్పంచులు, సింగిల్‌విండో అధ్యక్షులు, నాయకులు సత్యనారాయణరెడ్డి, పిప్పాల రాజేందర్, వెంకీ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువతకిచ్చిన హామీలు ఏమైనట్టు?

- ముఖ్యమంత్రి నోరు విప్పితే అన్ని అబద్ధాలే..
- రాష్ట్రంలో దొంగలు, దోపిడీదారుల పాలన కొనసాగుతోంది
- బిఆర్ఎస్ మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్05(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో దొంగలు, దోపిడీదారుల పాలన కొనసాగుతుందని బి.ఆర్.ఎస్ పార్టీ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య పరచాలనే ఉద్దేశంతో బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు(లక్ష్మణ్ బాబు) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు జిల్లాలో ప్రజలను ఆలోచింప చేస్తున్నాయి. అందులో భాగంగా శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యువజన విభాగం ములుగు జిల్లా అధ్యక్షులు కోకిల మహేష్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది యువతతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు యువత భవిష్యత్తును మారుస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు గెలిచాక విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోవడం సిగ్గుచేటని అన్నారు. విద్యార్థుల హామీల అమలుపై స్పష్టమైన సమాధానం ఎందుకు ఇవ్వడం లేదని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో యువతను ఆకట్టుకునేలా కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ప్రకటించిందని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమం, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించి యువతను ప్రభావం చేసిందని పేర్కొన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను ప్రజల ముందుంచడం లేదని బీఆర్ఎస్ ఆమె ఆరోపించారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ యువజన విధానమని వారు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నోరు విప్పితే అన్ని అబద్ధాలేనని అన్నారు. మంత్రి సీతక్క ములుగు జిల్లా ప్రజానీకానికి ఏం చేసిందో బహిరంగంగా చెప్పాలని అన్నారు. మాజీ సీఎం కెసిఆర్ ప్రభుత్వ హయాంలోనే ములుగు జిల్లా అభివృద్ధి చెందిందని, ములుగు జిల్లాలో తట్టెడు మట్టిపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఘట్టమ్మ వద్ద పైలాన్ నిర్మించుకోవడం సిగ్గుగా ఉందని అన్నారు. పదేళ్ల పాలనలో చేయని పనులు 1000 రోజుల్లో చేశామని గొప్పలు చెబుతున్న మంత్రి సీతక్క ప్రజా సమక్షంలో చర్చకు సిద్ధమవ్వాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీ పరిస్థితి ఏమిటో ప్రభుత్వం యువతకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చింది, ఎన్ని పోస్టులు భర్తీ చేసింది, ఎన్ని పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి, ఎన్ని నియామక ప్రక్రియలు పెండింగ్‌లో ఉన్నాయి? అనే ప్రశ్నలకు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువతను కించపరిచే వ్యాఖ్యలు చేస్తూ జెన్ జీలను రేవంత్ రెడ్డి కించపరుస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ రావు, నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, తాటి కృష్ణ భూక్య జంపన్న, చెన్న విజయ్, శ్రీనివాస్ రెడ్డి, బైకాని ఓదెలు, కోకిల లక్ష్మి, ఈర్ల వెంకన్న, పోరిక విజయ, రామ నాయక్, గోవిందు రాజకుమార్, మొర్రి రాజు యాదవ్, నరేంద్ర చారి, కామ అశోక్, జన్ను రాంబాబు సురేష్, కిషోర్, ప్రశాంత్, పూర్ణచదర్ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## లోక్‌అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం

**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** ఈనెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అర్హత కలిగిన క్రిమినల్ కాంపౌండబుల్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా పోలీసు, న్యాయ, ప్రాసిక్యూషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీవాణి సూచించారు. శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో పెండింగ్ కేసులను గుర్తించడం, కక్షిదారులతో సంప్రదింపులు జరపడం, కేసుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయడంపై చర్చించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ జడ్జి పి. రవీందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవేందర్, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు, న్యాయస్థాన అధికారులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఫలాలన్నీ అర్హులకు పక్కాగా అందాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనంసాక్షి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అన్ని క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ అందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో అమలు అవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న ప్రతి ఒక్క పథకం అర్హులైన ప్రతి వ్యక్తికి చేరే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలులో ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, సిపిఓ గంగారెడ్డి, డిఎంహెచ్ఓ రాజేందర్, వ్యవసాయ అధికారి సుజాత, హార్టికల్చర్ అధికారి రమణ, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలు**

విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యంతో పాటు జీవితాన్ని ఎదుర్కొనే శక్తిని అందించి, వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ఏఐ యుగంలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్, ఆచరణాత్మక ఆలోచనా విధానాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పఠన అలవాటును పెంపొందించి, సమాజంపై అవగాహన, శోధనాత్మక దృక్పథం, నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు, పరీక్ష ఫలితాల్లో పురోగతి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీఆర్వో రమేష్‌రాథోడ్, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పరశురామ్, సంక్షేమ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బ్రహ్మేశ్వర్ జలపాతంలో విషాదం..

- స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి





**కుబీర్, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** శ్రావణ మాసం సందర్భంగా ఆనవాయితీగా దేవుడి పల్లకితో బ్రహ్మేశ్వర్ దేవాలయానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జలపాతంలో పడి మృతి చెందిన ఘటన కుబీర్ మండలంలో శనివారం చోటుచేసుకుంది. పార్డి (బి) గ్రామానికి చెందిన గుడాల సాయినాథ్ (48) గ్రామస్తులతో కలిసి రాజరాజేశ్వర పల్లకిని బ్రహ్మేశ్వర్ దేవాలయానికి తీసుకెళ్లారు. అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించి దేవుళ్లకు జలాభిషేకం చేశారు. అనంతరం సాయినాథ్ దేవాలయం సమీపంలోని జలపాతంలో స్నానానికి వెళ్లారు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ ఘోర వైఫల్యం

- యువతను మోసం చేసి విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం
- వెయ్యి రోజుల పాలనపై నిప్పులు జరిగిన పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా యువత, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి జడ్పీ సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ పార్లమెంట్ సభ్యుడు నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌కు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేలాది కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయినా ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తోందని



మండిపడ్డారు. ఇంజనీరింగ్ ప్రవేశాల సమయంలో నెల రోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు ఆ హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అజయ్ కుమార్ ఆరోపించారు. నాణ్యమైన భోజనం అందడం లేదని, సమయానికి పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. యువతకు ఇచ్చిన హామీల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రకటించిన యువత ప్రకటనలో నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని, మూడేళ్లకు ఒక్కో నిరుద్యోగికి రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు బకాయి పడిందని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని, ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నట్టేట ముంచిందని ఆరోపించారు. ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లు కేవలం 16 వేలేనని, మిగిలిన నియామకాల్లో ఎక్కువ భాగం గత ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు భారత రాష్ట్ర సమితి పోరాటం ఆపేది లేదని పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. నిరసన ర్యాలీని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, భీరెడ్డి నాగచంద్ర రెడ్డి, బచ్చు విజయ్ కుమార్, గొల్లపూడి రాంప్రసాద్, దేవభక్తుని కిషోర్ బాబు, కృష్ణ, మక్బుల్, పార్టీ ముఖ్య నాయకులు, యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన భద్రాద్రి కొత్తగూడెం క్రీడాకారులు



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 05 (జనం సాక్షి) :** కేరళలో ఇటీవల నిర్వహించిన 17వ సౌత్ జోన్ రైఫిల్ అండ్ పిస్టల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ బాలికల విభాగంలో బాణాల జస్మిత, పి. రోడా గ్రేస్, బండారి సహస్ర ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వీరు డిసెంబర్ 2026లో ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

### నిరంతర శిక్షణతోనే రాణింపు

లక్ష్మీదేవిపల్లి శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని 'జిల్లా ఇండోర్ రైఫిల్ షూటింగ్ రేంజ్'లో క్రీడాకారులకు క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తున్నారు. జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి పర్యవేక్షణలో, కోచ్ ఎం.డి. అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఈ క్రీడాకారులు వరుసగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (రా+ఖీ) పోటీల్లోనూ జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని, ఇప్పుడు ముగ్గురు బాలికలు ఒకేసారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జిల్లా షూటింగ్ రంగానికి ఎంతో గర్వకారణమని జిల్లా క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

### అభినందనలు తెలిపిన జిల్లా క్రీడాధికారి

జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారిణులను, వారి తల్లిదండ్రులను మరియు శిక్షకుడు (కోచ్) ఎం.డి. అబ్దుల్ నబీని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరికొంత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా షూటింగ్ రేంజ్‌లో శిక్షణను మరింత పటిష్టం చేస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

## రూ.1.50 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు ఆమోదం

- 59 తీర్మానాలకు కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్



**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** ఎదులాపురం మున్సిపాలిటీలోని 26వ వార్డు పెద్దతండలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత అధ్యక్షతన నిర్వహించారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, ప్రజా సౌకర్యాలకు సంబంధించి మొత్తం 59 తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించింది. అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్లకు పైగా నిధులు వెచ్చించేందుకు తీర్మానాలు చేశారు. వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, పైపులైన్లు, కల్వర్టులు, రోడ్డు మరమ్మతులు, లైన్ కేబుల్స్ ఏర్పాటు తదితర మౌలిక వసతుల పనులకు నిధులు కేటాయించాలని నిర్ణయించారు. తాగునీటి సరఫరా మెరుగుదలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపారు. పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన కౌన్సిల్.. చెత్త సేకరణ, రోడ్ల వెంట పేరుకుపోయిన మట్టి, చెత్త తొలగింపు, జేసీబీ పనులు, పారిశుధ్య సిబ్బందికి అవసరమైన పరికరాలు, వాహనాల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

## కలుషిత నీరుతో కలకలం

**నాగార్జునసాగర్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ జలాశయం పరిధిలోని దయ్యాల గండి వద్ద కృష్ణానది నీరు ఆకుపచ్చ రంగులోకి మారడం కలకలం రేపుతోంది. గతంలో ఎన్నడూ ఈ ప్రాంతంలో కృష్ణా జలాలు ఇలా రంగు మారలేదని స్థానికులు, జాలర్లు చెబుతున్నారు. గత రెండు, మూడు రోజులుగా నీరు ఆకుపచ్చగా కనిపిస్తుండటంతో స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలాశయం పరిధిలోని ఇతర ప్రాంతాల్లో నీరు సాధారణంగానే కనిపిస్తుండగా, కేవలం దయ్యాల గండి ప్రాంతంలోనే నీరు ఆకుపచ్చని రంగు మారడం పలు అనుమానాలకు తావిస్తోంది. నదిలోకి ఏవైనా రసాయనాలు కలిశాయా? లేదా సమీప ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న కలుషిత వ్యర్థాలు నీటిలోకి చేరాయా? అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. నీరు ఆకుపచ్చగా మారడమే కాకుండా, నీటి పరిసరాల్లోని పచ్చటి గడ్డి సైతం ఎండిపోతుండటంతో స్థానికుల్లో ఆందోళన మరింత పెరిగింది.



నీటిలో ఏదైనా రసాయన కాలుష్యం చోటుచేసుకుందేమోనని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే నీరు రంగు మారడానికి అసలు కారణం ఏమిటనేది అధికారుల పరిశీలన అనంతరం స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఈ సంఘటనపై నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో సాగర్ డ్యాం సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ సర్కిల్--హిల్ కాలనీ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి శనివారం దయ్యాల గండి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జలాశయంలోని నీటి పరిస్థితిని, ఆకుపచ్చగా కనిపిస్తున్న ప్రాంతాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి రంగు మారడానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్వయంగా ప్రాంతాన్ని పరిశీలించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. నీటి నాణ్యతపై పూర్తిస్థాయి పరిశీలన నిర్వహించి, నీరు ఆకుపచ్చ రంగులోకి మారడానికి గల అసలు కారణాన్ని గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు చేపట్టిన పరిశీలనతో కృష్ణా జలాల రంగు మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే దయ్యాల గండి వద్ద కృష్ణా జలాల నమూనాలను తక్షణమే సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. నీరు రంగు మారడానికి గల కారణాలను శాస్త్రీయంగా గుర్తించి, ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతున్నారు. నీటి కాలుష్యానికి కారణం ఏదైనా ఉన్నట్లు పరీక్షల్లో తేలితే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నీటి నాణ్యత పై స్పష్టత ఇవ్వాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్ రెడ్డి




**ఖైరతాబాద్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర కాలనీ డివిజన్‌లోని జీవీకే మాల్ ఎదురుగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని విమ ర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెం ట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు నిరుద్యోగ యువత కోసం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చి, విద్యార్థులు, నిరుద్యోగ యువ త ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమన్నారు. విద్యార్థులు, నిరు ద్యోగ యువత హక్కుల కోసం బీఆర్ఎస్ ఎల్ల ప్పుడూ అండగా ఉంటుందని, సమస్యల పరిష్కా రం కోసం ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్.వి నాయకులు సాయి నాయుడు, సంతు ముదిరాజ్, నవీన్ నాయక్, ముస్తాక్ అలీ, రాంచందర్, నరసింహ, రావుల విజయ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, పాతర్ల నరసింహ, బిట్ల శ్రీనివాస్, సారంగపాణి, శశిరాజు, ధనరాజ్, విశాల్ తదితరులు, నాయకులు, ఉద్యమకారులు, మహిళా నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివ మర్డర్ కేసులో మరో నలుగురు నిందితుల అరెస్ట్



**మణుగూరు, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** గత వారం మణుగూరు మండలం సింగరేణి నేతాజీ గ్రౌండ్స్ లో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేయడం జరిగిందని మణుగూరు డి.ఎస్.పి రవీంద్రారెడ్డి తెలిపారు. పోలీస్ అందించిన వివరాలు ప్రకారం గత వారం ఎంకే గ్యాంగ్ మధ్య జరిగిన ఘర్షణలో సింహాద్రి అలియాస్ శివ అనే యువకుడుని పిడుగుద్దులతో కొట్టి దారుణంగా హత్య చేసిన ఎంకె గ్యాంగ్ లో 23 మంది నిందితులను గతవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే అందులో నలుగురు నిందితులు పరార్ లో ఉండగా వారిని ఇవాళ అరెస్టు చేశామని తెలిపారు అరెస్ట్ అయిన వారిలో శివరాత్రి సాంబశివరావు, పూనెం నాగేంద్రబాబు, చాబోతుల యేసు, వల్లపు మల్లికార్జున్ ఈ నలుగురు నిందితులను ఈరోజు అదుపులో తీసుకొని, వారి వద్ద నుండి మోటార్ సైకిల్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందని డి.ఎస్.పి తెలిపారు.

### యువతకు డీఎస్పీ హెచ్చరిక

మణుగూరు పట్టణంలో శాంతి భద్రతలకు విగాథం కలిగించిన, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన గ్యాంగ్ వారు అంటూ రోడ్లపై కుస్తీలు పట్టడం, రౌడీయిజం చేయడం లాంటివి ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించే పనిలేదని డిఎస్పి రవీంద్రారెడ్డి హెచ్చరించారు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా సరే చట్టపరిధిలో శిక్షిస్తామని ఆయన తెలిపారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మణుగూరులో ప్రధాని కూడల్లో పోలీసు నిఘాను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎక్కడా కూడా ప్రజలు వాహనాలను రోడ్లపై నిలిపి వెళ్లడం, ట్రాఫిక్ అంతరాయం కలిగించే వాహనాలను సైతం సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తులు, గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించే యువకులను ప్రత్యేక టెక్నాలజీతో కనిపెడుతున్నట్లు ఆయన తెలిపారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగబాబు, ఎస్సైలు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్




**కోదాడ, సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్వీ కోదాడ పట్టణ అధ్యక్షుడు బొర్రా వంశీ నాని ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో విద్యార్థుల భారీ ర్యాలీ నిర్వహించారు. రంగా థియేటర్ చౌరస్తా వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులకు ఇస్తామని హామీ ఇచ్చిన ఉచిత స్కూటీలను తక్షణమే పంపిణీ చేయాలన్నారు. నిరుద్యోగ యువత కోసం తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చీమ నరేష్, నాయకులు బత్తుల ఉపేందర్, బిఆర్ఎస్వీ నాయకులు నవీన్, సతీష్, వితేష్, వంశీ, బన్నీ, సాయిలతో పాటు వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సినీ ఫక్కీలో ఘరానా మోసం

- దత్తత పేరుతో రూ.1.40 లక్షల మోసం
- ఆరుగురు నిందితుల అరెస్ట్.. రూ.1.40 లక్షలు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇల్లందు డిఎస్పీ వెంకన్నబాబు

**టేకులపల్లి, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** సినీ ఫక్కీలో జరిగిన ఓ ఘరానా మోసాన్ని టేకులపల్లి పోలీసులు చేదించి నిందితులను అదుపులోకి తీసుకొని, నగదు సెల్ ఫోన్ లో స్వాధీన పరుచుకున్న ఘటన పై ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు టేకులపల్లి సిఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పిల్లలు లేని మహిళకు చిన్నారిని దత్తత ఇస్తామని నమ్మించి రూ.1.40 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు శనివారం చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, బీరంగూడకు చెందిన గౌరిగారి ప్రమీలకు వివాహమై ఎనిమిదేళ్లు అవుతు న్నా పిల్లలు లేనందున, ఓ చిన్నారిని దత్తత తీసుకో వాలనే ఉద్దేశంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన, పోస్టును గమనించిన ఖమ్మంకు చెందిన వ్యక్తి, తమకు తెలిసిన వారి వద్ద మగశిశువు ఉన్నాడని, రూ.4 లక్షలకు దత్తత ఇస్తారని, వాట్సాప్‌లో సంప్రదించాడు. అంత మొత్తం తన వద్ద లేదని ప్రమీల చెప్పడంతో రూ.1.40 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని, ఈ విషయాన్ని లక్ష్మీదేవిపల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన వేదలపల్లి రాంబాబుకు, ఖమ్మం వ్యక్తి చెప్పి, చిన్నారిని చూపించి, డబ్బులు తీసుకున్న తరువాత, సినీ ఫక్కీలో ఓ పథకం ప్రకారం గొడవ జరిగినట్లు నటించి అక్కడి నుంచి పారిపోవాలని సూచించాడు. ఇందుకు సహకరించే వారికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో రాంబాబు తన కుమారుడు రోహిత్, స్నేహితులు తాటి నాగార్జున, ఈసం రాంబాబుతో పాటు చిన్నారి తల్లిదండ్రులు మడివి వెంకటేష్, శారదను పథకంలో భాగస్వాములను చేశాడు. ఈ క్రమంలో ఈ నెల 4న సంగారెడ్డి నుంచి ప్రమీల చిన్నారిని తీసుకునేందుకు రాగా, ఖమ్మంకు చెందిన వ్యక్తి పంపిన లొకేషన్‌కు రాంబాబు, చిన్నారి తల్లిదండ్రులు కారులో వెళ్లారు. అక్కడ ప్రమీలతో పాటు మరో మహిళ రూ.1.40 లక్షలు ఇచ్చిన వెంటనే నిందితులు, గొడవపడుతు న్నట్లు నటించి వారిని భయభ్రాంతులకు గురిచేసి, చిన్నారి తల్లిదండ్రులను కారులో అక్కడి నుంచి పంపించి, డబ్బులు తీసుకున్న వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకుని పరారయ్యారు. టేకులపల్లి మండలం లోని ఏ



కాలనీ తండా స్మశాన వాటిక సమీపంలో డబ్బు పంపకాలు నిర్వహించినట్లు తెలిపారు. పోలీసుల శనివారం బొమ్మనపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న, పోలీసులు నిందితులు అనుమానాస్పదంగా, పారిపోతుండటాన్ని గమనించి పట్టుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించి నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు వేదలపల్లి రాంబాబు, రోహిత్, తాటి నాగార్జున, ఈసంరాంబాబు, మడివి వెంకటేష్ , మడివి శారదలను అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.1.40 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ కె.తిరుపతి, సిబ్బందిని ఇల్లందు డీఎస్పీ యు.వెంకన్నబాబు అభినందించారు.






## జాగ్వార్ ల్యాండ్ రోవర్ కంపెనీలో 4వేల ఉద్యోగాలు కోత!

టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో బ్రిటన్‌లో దాదాపు 4 వేల ఉద్యోగాలకు కోత విధించనున్నట్లు 'ది టైమ్స్' కథనం పేర్కొంది. అమెరికా టారిఫ్‌లు, వాహన తయారీ ఖర్చులు పెరగడం, విక్రయాలు తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది. మరోవైపు, ఉద్యోగాల కోతకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి సమాచారం అందజేశామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడనున్నట్లు కంపెనీ పేర్కొన్నట్లు సదరు వార్తా కథనం తెలిపింది. ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేతన సిబ్బంది, మేనేజ్‌మెంట్ టీమ్‌లపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా, బ్రిటన్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన జేఎల్ఆర్ సంస్థ.. బ్రిటన్‌లో సుమారు 34 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ వ్యయం, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ ఆంక్షల ఒత్తిళ్లను తట్టుకొనేందుకే కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ ఆదాయం దాదాపు 10 శాతం వరకు తగ్గడం గమనార్హం. మరోవైపు, జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ కూడా లక్ష ఉద్యోగాలకు కోత విధిస్తున్నట్లుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా 'ఎన్ఎస్ఈ'

**సంస్థ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబరు 15 విడుదల!**
**పదేళ్ల నిరీక్షణ అనంతరం సెబీ నుంచి అనుమతులు**
**వచ్చే వారం ధరల శ్రేణిపై ప్రకటన**

**మార్కెట్ వర్గాలు చాన్నాళ్లుగా ఆతృతతో ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూకు సెబీ ఆమోదముద్ర వేసింది. ఇష్యూ పరిమాణం రూ.30,000 కోట్లుగా ఉండొచ్చని చెబుతున్నారు. ఇప్పటివరకు చూస్తే దేశ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా ఇది నిలిచే అవకాశం ఉంది.**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సెప్టెంబరు 15న ఎన్ఎస్ఈ ఐపీఓ ప్రారంభం కావచ్చని ఈ పరిణామాలను దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబరు 24 లేదా 25న స్టాక్ ఎక్స్ఛేంజీలో షేర్లు నమోదవుతాయని అంటున్నారు. ఐపీఓలో భాగంగా విక్రయించే షేర్లకు ధరల శ్రేణి, ఇతరత్రా కీలక వివరాలను వచ్చే వారంలో (11న) ఎన్ఎస్ఈ ప్రకటించే అవకాశం ఉంది.

**దశాబ్ద కాలంగా ఎదురుచూపులు..**

కోలొకేషన్ వివాదంతో నియంత్రణపరమైన అడ్డంకుల వల్ల దాదాపు దశాబ్దకాలంగా ఈ ఐపీఓ జాప్యం అవుతూ వచ్చింది. తొలుత రూ.10,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో 2016లో ఎన్ఎస్ఈని లిస్టింగ్ చేయాలని భావించారు. అయితే పాలనాపరమైన వైఫల్యాలు, కోలొకేషన్ కేసు దృష్ట్యా ఐపీఓకి తప్పనిసరి అయిన నో- అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ)ను ఇవ్వడానికి సెబీ నిరాకరించింది. అప్పటి నుంచి కేసుల పరిష్కారానికి చర్యలు చేపడుతూనే.. 2019, 2020, 2024లో సెబీ నుంచి ఎన్ఓసీ పొందేందుకు ఎన్ఎస్ఈ ప్రయత్నించింది. ఎట్టకేలకు ఈ ఏడాది ప్రారంభంలో కో-లొకేషన్, డార్క్ ఫైబర్ కేసుల వ్యవహారాలను సెబీతో ఎన్ఎస్ఈ పరిష్కరించుకొని ఎన్ఓసీ పొందడంతో ఒక కీలక అడుగు పడినట్లయ్యింది. ఈ ఏడాది జూన్ 17న ఎన్ఎస్ఈ తన ఐపీఓ ముసాయిదా పత్రాలను సెబీ వద్ద దాఖలు చేయగా.. సెప్టెంబరు 4న తుది అనుమతులు లభించాయి. ఎన్ఎస్ఈ సమర్పించిన ఐపీఓ ముసాయిదా పత్రాల ప్రకారం...ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉంటుంది. తాజా షేర్లను జారీ చేయడం లేదు. ప్రతిపాదిత ఐపీఓ ప్రక్రియలో ప్రస్తుత వాటాదార్లు సుమారు 6% వాటాకు సమానమైన 14.89 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ప్రధానంగా ఎస్‌బీఐ




2.48 కోట్లు, ఎంఎస్ స్ట్రాటజిక్ (మారిషస్) లిమిటెడ్ 1.60 కోట్ల షేర్ల చొప్పున విక్రయించనున్నాయి. ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐకి 3.23%, అనుబంధ సంస్థ ఎస్‌బీఐ కేపిటల్ మార్కెట్స్‌కు 4.33 శాతం వాటాలు ఉన్నాయి. ఎన్ఎస్ఈలో 10.82 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ఎల్ఐసీ ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎటువంటి షేర్లను విక్రయించడం లేదు. ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ సుమారు రూ.5 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. ఐపీఓలో 6 శాతం వాటాను ప్రస్తుత వాటాదార్లు విక్రయిస్తుండటంతో ఇష్యూ పరిమాణం రూ.30,000 కోట్లుగా ఉండొచ్చని లెక్కగడుతున్నారు. ఇష్యూ ధరల శ్రేణి రూ.2000 దరిదాపులో ఉండొచ్చని బ్యాంకర్లు అంచనా వేస్తున్నాయి.

జియో ఐపీఓ వస్తే.. రెండో స్థానానికి

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు కూడా సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఇష్యూ పరిమాణం రూ.37,700 కోట్లుగా ఉండొచ్చని చెబుతున్నారు. జియో కంటే ముందే ఎన్ఎస్ఈ ఐపీఓనే వచ్చే అవకాశం ఉండటంతో.. దేశంలో ఇప్పటివరకు అతి పెద్ద ఐపీఓగా ఎన్ఎస్ఈదే అవుతుంది. ఆ తర్వాత జియో ఐపీఓ వచ్చాక... ఈ సంస్థదే అతిపెద్ద ఐపీఓగానూ, ఎన్ఎస్ఈ ఐపీఓ రెండో స్థానంలో ఉంటుంది.

## జియో సేవలకు పదేళ్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 2016 సెప్టెంబర్ 5న వాణిజ్య సేవలు ప్రారంభించిన రిలయన్స్ జియో.. పదేళ్లలో దేశీయ టెలికాం రంగాన్ని మలుపు తిప్పింది. డేటా అయిపోతుందేమోనన్న భయం నుంచి అపరిమిత డిజిటల్ లభ్యత వరకు జరిగిన పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. 2016లో 1 జీబీ డేటా ధర సుమారు రూ.228గా ఉండేది. దేశమంతటా కలిపి 4జీ వాడుతున్న వారి సంఖ్య కోటి కంటే తక్కువే. ఇంటర్నెట్ వేగం సగటున 2.5 ఎంబీపీఎస్ దాటడానికి ముప్పుతిప్పలు పడాల్సి వచ్చేది. హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను విలాసవంతమైన వస్తువుగా కాకుండా ప్రాథమిక అవసరంగా మార్చడమే ప్రధాన వ్యూహంతో జియో దూసుకెళ్లింది. ఫలితంగా.. ఈ దశాబ్ద కాలంలో 1 జీబీ డేటా ధర ఏకంగా 97 శాతం తగ్గి, ప్రస్తుతం రూ.7.9కి పడిపోయింది. దేశంలో 4జీ, 5జీ వాడే చందాదారుల సంఖ్య 93.8 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఒక జియో వినియోగదారు సగటున నెలకు ఏకంగా 42.3 జీబీ డేటాను వాడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రికార్డు వృద్ధి: తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) టెలికాం సర్కిల్‌లో జియో సేవలు ప్రారంభించిన తొలి నెలలోనే 12.4 లక్షల కనెక్షన్లను సాధించింది. జూన్ 2026 నాటికి ఇవి 3.25 కోట్లకు చేరాయి. 2024 జూన్ నాటికి ఏపీ, తెలంగాణలో జియో గరిష్ఠంగా 3.30 కోట్ల చందాదారుల మైలురాయిని తాకింది. 2026 జూన్ నాటికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మొత్తం 8.83 కోట్ల వైర్‌లెస్ కనెక్షన్లలో 36.9% వాటాతో జియో బలమైన రెండో అతిపెద్ద టెలికాం వ్యవస్థగా అవతరించింది.




### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,60,754 | ₹ 1,75,370 |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 2,50,000

## 4 రోజుల తర్వాత మళ్లీ లాభాలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,112 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.8,930 కోట్లు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నాలుగు రోజుల వరుస నష్టాల నుంచి దేశీయ సూచీలు శుక్రవారం బలంగా పుంజుకున్నాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో లోహ, ప్రైవేట్ బ్యాంకులు, చమురు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 8 పైసలు పెరిగి 94.43 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.40% తగ్గి 95.14 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.17 లక్షల కోట్లు పెరిగి రూ.488.25 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 505 పాయింట్ల లాభం (క్రితం ముగింపు 76,152.86 పాయింట్లు)తో 76,657.02 వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 76,883.14 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 24.25 పాయింట్లు పెరిగి 23,897.70 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,895.85- 24,005.75 పాయింట్ల మధ్య చలించింది. సెన్సెక్స్ 30 షేర్లలో 20 లాభపడ్డాయి. టాటా స్టీల్ 2.91%, రిలయన్స్ 1.61%, బజాజ్ ఫైనాన్స్ 1.47%, ట్రెంట్ 1.34%, అదానీ పోర్ట్స్ 1.33%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.30%, కోటక్ బ్యాంక్ 1.15%, అల్ట్రాటెక్ 1.11%, టైటన్ 1.01% రాణించాయి. భారతీ ఎయిర్‌టెల్ 1.24%, హెచ్‌సీఎల్ టెక్ 1.24%, ఎటర్నల్ 1.09% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 1.42%, హౌసింగ్ ఫైనాన్స్ 1.41%, టెలికాం 1.39%, బీమా 1.37% మెరిశాయి. స్థిరాస్తి, యంత్ర పరికరాలు, వాహన, ఆరోగ్య సంరక్షణ, హాస్పిటల్స్, ఐటీ నిరాశపరిచాయి. బీఎస్ఈలో 2388 షేర్లు లాభపడగా, 1991 స్క్రిప్‌లు నష్టపోయాయి. 251 షేర్లలో ఎటువంటి మార్పులేదు. ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్‌లో ప్రమోటర్లయిన ఆజాద్ మూపెన్, ఆయన కుటుంబ సభ్యులు తమ భాగస్వామ్యాన్ని మరింత పెంచుకున్నారు. దాదాపు రూ.350.34 కోట్లతో 0.57 శాతం వాటాలను కొనుగోలు చేశారు. దీంతో సంస్థలో వీరి మొత్తం వాటా 24.58 శాతానికి చేరింది.

ఐపీఓ సమాచారం

ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబరు 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.139-146 నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ427 కోట్లు సమీకరించనుంది. కరంతారా ఇంజినీరింగ్ రూ.875 కోట్ల ఐపీఓ 9న ప్రారంభమై 11న ముగియనుంది. ధరల శ్రేణిగా రూ.241-254 నిర్ణయించారు. గరిష్ఠ ధర ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ.8174 కోట్లుగా నమోదుకావొచ్చు. రెంటోమోజో రూ.1256 కోట్ల ఐపీఓ 9న ప్రారంభమై 11న ముగియనుంది. ధరల శ్రేణి రూ.384-404. మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ రూ.805 కోట్ల ఐపీఓ 9న ప్రారంభమై 11న ముగియనుంది. ధరల శ్రేణిగా రూ.322-339 నిర్ణయించారు.

# కలిసొచ్చిన ఏఐ రంగం

## 15 ట్రిలియన్ డాలర్లకు చేరిన కుబేరుల సంపద

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కృత్రిమ మేధ కారణంగా ఒకవైపు చాలామంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. మరోవైపు పెద్ద పెద్ద కంపెనీలు భారీగా సంపద సృష్టిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు కలసిరావడంతో ప్రపంచవ్యాప్తంగా సంపన్నుల జనాభా పెరుగుతోంది. గతేడాది బిలియనీర్ల సంఖ్య దాదాపు 3800కు చేరినట్లు గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అల్ట్రాటా తన వెల్త్ రిపోర్ట్‌లో వెల్లడించింది. వీరి మొత్తం సంపద సుమారు 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1,417.37 లక్షల కోట్లు) చేరుకున్నట్లు తెలిపింది. గత 5 ఏళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) వరకు పెట్టుబడులు చేసిన కంపెనీలు అధిక మార్కెట్ విలువను సాధించాయని అల్ట్రాటా తన నివేదికలో పేర్కొంది. దీంతో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరగ్గా.. కుబేరుల సంఖ్య 8.2 శాతం ఎగబాకింది. ఏఐ రంగానికి సంబంధించిన టెక్నాలజీ స్టాక్స్‌లో పెట్టుబడులు భారీ సంపద సృష్టించాయని నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుబేరుల మొత్తం సంపదలో.. 27శాతం కేవలం 29 మంది సూపర్ బిలియనీర్ల (50 బిలియన్ డాలర్లను మించి ఆదాయం ఉన్న వారిని ఇలా పరిగణిస్తారు) వద్దే ఉన్నట్లు పేర్కొంది. అత్యధికంగా 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 1,081 మందితో ఐరోపా రెండో స్థానంలో ఉంది. ఆసియాలో 881 మంది బిలియనీర్లు ఉన్నారు. మొత్తం సంపన్నుల్లో మహిళలు కేవలం 13 %మాత్రమే ఉండడం గమనార్హం.



## కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు దరఖాస్తులు వచ్చాయి

**పుకార్లను ఖండించిన కేంద్రం**



కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించలేదంటూ వచ్చిన వార్తల్ని కేంద్రం ఖండించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాలేదన్న వాదనను తోసిపుచ్చింది. అవన్నీ అవాస్తవాలని, ఇలాంటి అసత్యాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపబోవని బొగ్గు గనుల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఎన్‌టీపీసీ నుంచి ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయని బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కంపెనీల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్న వాదనను తోసిపుచ్చిన కేంద్రం.. తొలి రౌండ్ అప్లికేషన్ విండో ప్రక్రియ సెప్టెంబర్ 7న ముగుస్తుందని స్పష్టం చేసింది. ఈ స్కీమ్‌లో భాగంగా దాదాపు 25 ప్రాజెక్టులకు గానూ.. రూ.2.5- 3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తోంది. తద్వారా 50 వేల ఉద్యోగాలు సృష్టించొచ్చని భావిస్తోంది. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ ఇంధన అవసరాలకు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు 'బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్)' ప్రక్రియకు కేంద్రం సంకల్పించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే.

## సీఈఓలు కావాలెను

- కొత్త సారథుల అన్వేషణలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఉజ్జీవన్
- కోటక్, ఫినో పేమెంట్స్ బ్యాంక్‌లో తుది దశకు ఈ ప్రక్రియ




దిల్లీ: ప్రైవేట్ రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంకు, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ఫినో పేమెంట్స్ బ్యాంకులు కొత్త సారథుల నియామక ప్రక్రియలో ఉన్నాయి. తదుపరి వృద్ధి దిశగా నడిపిచేందుకు కొత్త ఎండీ, సీఈఓల నియమాకం కోసం అర్హులైన అభ్యర్థులను అన్వేషించే ప్రక్రియను ఇప్పటికే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రారంభించాయి. మరోవైపు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫినో పేమెంట్స్ బ్యాంక్‌ల్లో ఈ అన్వేషణ ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. జీఎస్‌టీ చట్టంలోని నిబంధనల ఉల్లంఘన ఆరోపణలకు సంబంధించి ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ రిషి గుప్తాను ఫిబ్రవరిలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ అరెస్టు జరిగిన వెంటనే ముఖ్య ఆర్థిక అధికారిగా (సీఎఫ్ఓ) ఉన్న కేతన్ మర్చంట్‌కు తాత్కాలిక ఎండీ, సీఈఓ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత గుప్తా స్థానంలో మరొకరిని నియమించే ప్రక్రియను బోర్డు ప్రారంభించింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ వాస్వాని మూడేళ్ల పదవీకాలం 2026 డిసెంబరు 31తో ముగుస్తుంది. అయితే తన పదవీకాలం ముగిశాక, తిరిగి పొడిగింపును కోరకూడదని జూన్‌లో ఆయన నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఈ పదవి కోసం అంతర్గత అభ్యర్థుల పేర్లనే బ్యాంకు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ నెల ప్రారంభంలో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ సంజీవ్ నౌటియాల్ స్వచ్ఛందంగా ముందస్తు పదవీ విరమణ కోరడంతో ఆయన స్థానంలో మరొకరిని నియమించాల్సిన పరిస్థితి బోర్డుకు ఏర్పడింది. ఎస్‌బీఐ మాజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేసిన నౌటియాల్ 2024 జులై 1 నుంచి అమల్లోకి వచ్చేలా మూడేళ్ల కాలానికి ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఎండీ, సీఈఓగా నియమితులయ్యారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సారథిని ఎంపిక చేసే ప్రక్రియకు కూడా మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఎందుకంటే గత నెలలో ఆ బ్యాంకు ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ పునర్నియామక ప్రక్రియ నుంచి వైదొలిగారు. 61 ఏళ్ల జగదీశన్ అక్టోబరు 26న తన ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత పునర్నియామకాన్ని కోరకూడదని నిర్ణయించుకున్నారు. జగదీశన్ వారసుడి ఎంపిక, నియామక ప్రక్రియను నిర్ణీత సమయంలోపే వేగవంతం చేస్తామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు పేర్కొంది.

## జీవితకాల గరిష్ఠానికి ఫారెక్స్ నిల్వలు



ముంబయి: మన దేశ విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరాయి. ఆగస్టు 28తో ముగిసిన వారానికి 11.475 బిలియన్ డాలర్లు పెరిగి 740.803 బి.డాలర్లకు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం గణాంకాలు వెల్లడించింది. అంత క్రితం వారం కూడా నిల్వలు 12.422 బి.డాలర్ల మేర పెరిగి 729.328 బి.డాలర్లకు పెరిగాయి. గతంలో ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో 728.94 బి.డాలర్ల వద్ద జీవితకాల గరిష్ఠానికి చేరగా, తాజాగా ఆ రికార్డును అధిగమించాయి. ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం..ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఆగస్టు 28తో ముగిసిన వారంలో 9.337 బి.డాలర్ల మేర పెరిగి 600.67 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 2.191 బి.డాలర్ల మేర పెరిగి 116.409 బి.డాలర్ల(సుమారు రూ.11 లక్షల కోట్లు)కు చేరాయి. మన దేశ ప్రత్యేక ఉపసంహరణ హక్కులు (ఎస్‌డీఆ ర్‌లు) మాత్రం 43 మి.డాలర్ల మేర తగ్గి 18.81 బి. డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద మన దేశ నిల్వల స్థితి కూడా 11 మి.డాలర్ల మేర తగ్గి 4.914 బి.డాలర్లకు పరిమితమైంది.

## కియా సొరెంటోతో హైబ్రిడ్ ఎస్‌యూవీ

**ధరల శ్రేణి రూ.27.99-40.39 లక్షలు**

దిల్లీ: కియా ఇండియా తన ప్రీమియం 7-సీటర్ ఎస్‌యూవీ సొరెంటోను శుక్రవారం విడుదల చేసింది. ధరల శ్రేణి రూ.27.99-40.39 లక్షలు. ఇందులో 1.6 లీటర్ స్ట్రాంగ్ హైబ్రిడ్, 2.0 లీటర్ డీజిల్ ఇంజిన్లు అందించారు. ఈ కారును ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్లాంట్‌లో తయారు చేస్తున్నారు. పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, పవర్డ్ టెయిల్‌గేట్, బోస్ 12-స్పీకర్ ప్రీమియం ఆడియో సిస్టమ్, డ్యూయల్ 12.3 అంగుళాల డిస్‌ప్లే, లెవెల్-2 అడాస్ భద్రతా ఫీచర్లు ఉన్నాయి. టాప్ వేరియంట్లలో కియా కనెక్ట్ 2.0, ఓవర్-ది-ఎయిర్ అప్‌డేట్‌లు, డిజిటల్ కీ, హెడ్-అప్ డిస్‌ప్లే, జనరేటివ్ ఏఐ అసిస్టెంట్ ఉన్నాయి. ఏడుగురు ప్రయాణించేందుకు వీలుగా మూడు వరుసల సీటింగ్ ఉంది. 6 సీట్ల ఆప్షన్ కూడా ఉంది. భద్రత కోసం 7 ఎయిర్‌బ్యాగులు ఇచ్చారు. టాప్ వేరియంట్లలో 10 ఎయిర్‌బ్యాగులు, లెవెల్ 2+ అడాస్, సరౌండ్ వ్యూ మానిటర్, రిమోట్ పార్కింగ్ అసిస్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. టయోటా ఫార్చునర్, స్కోడా కొడియాక్, జీప్ మెరిడియన్, ఫోక్స్‌వ్యాగన్ టైరాన్‌తో ఇది పోటీ పడనుంది.

## ఎగుమతుల కోసమే సరుకు నిల్వ ఉంచుకోవాలి

**ఎఫ్‌డీఏ కలిగిన ఇ-కామర్స్ సంస్థలకు నిబంధనలు నోటిఫై చేసిన ఆర్థిక శాఖ**

దిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఏ) కలిగిన ఇ-కామర్స్ సంస్థలకు సంబంధించి భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం ఎగుమతుల కోసం మాత్రమే ఇ-కామర్స్ సంస్థలు తమ సొంత సరుకును నిల్వ ఉంచుకోవడానికి వీలు కల్పిస్తూ కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) 2026 సెప్టెంబరు 2 నాటి నోటిఫికేషన్ ద్వారా ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ (నాన్-డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్) రూల్స్ 2019కి సవరణలు చేసింది. వీటి ప్రకారం..ఇ-కామర్స్ సంస్థలు నిల్వ ఉంచే సరుకులు కచ్చితంగా మన దేశంలో తయారైనవి లేదా ఉత్పత్తి చేసినవై ఉండాలి. ఈ సడలింపులు విదేశీ వాణిజ్య విధానం 2023, ఫెమా నిబంధనలకు లోబడి ఉంటాయి. సరుకులు భారతదేశంలో తయారైనవేనని, వాటి ఎగుమతి ద్వారా లభించే ఆదాయం నిబంధనల ప్రకారమే జరుగుతోందని ఇ-కామర్స్ సంస్థలు ప్రతి లావాదేవీలోనూ నిరూపించాల్సి ఉంటుంది. దేశీయ మార్కెట్‌పై ప్రభావం ఇలా..: మన దేశంలోని స్థానిక కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను రక్షించడానికి దేశీయ బీ2సీ (బిజినెస్ టు కన్జ్యూమర్) విక్రయాల కోసం ఇన్వెంటరీ ఆధారిత ఇ-కామర్స్ నమూనాపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం అలాగే ఉంచింది. విదేశీ నిధులున్న అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు మన దేశంలో సొంతంగా సరుకులను నిల్వ ఉంచుకుని ఇక్కడి వినియోగదార్లకు నేరుగా విక్రయించడానికి వీల్లేదు. ఒకవేళ ఎగుమతుల కోసం కేటాయించిన ఇన్వెంటరీని దేశీయ విపణిలోకి మళ్లిస్తే అది ఫెమా నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. కఠిన చర్యలు ఉంటాయి. దీని వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ వస్తువుల విక్రయాలు భారీగా పెరుగుతాయి. భారతీయ తయారీదార్లకు ప్రోత్సాహం లభిస్తుంది.



## బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి రూ.6 లక్షల కోట్లు వెనక్కి: ఆర్‌బీఐ

ముంబయి: బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు నగదు లభ్యత (లిక్విడిటీ) రికార్డు స్థాయికి చేరడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం నాడు రెండు 'వేరియబుల్ రేట్ రివర్స్ రెపో' (వీఆర్ఆర్ఆర్) వేలం ప్రక్రియ ద్వారా రూ.6.02 లక్షల కోట్లకు పైగా నిధులను వెనక్కి తీసుకుంది. 3 రోజుల వ్యవధి గల వీఆర్ఆర్ఆర్ వేలంలో మొత్తంగా రూ.7 లక్షల కోట్లను నోటిఫై చేయగా, రూ.5,41,975 కోట్ల విలువైన బిడ్లను స్వీకరించి ఆమోదించింది. మరొక 3 రోజుల వ్యవధి ఉన్న వీఆర్ఆర్ఆర్ వేలంలో రూ.1.5 లక్షల కోట్ల నోటిఫై మొత్తానికి గాను రూ.60,419 కోట్లను బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద ఉంచాయి. దీనికి 5.24 శాతం వడ్డీ రేటును చెల్లించనుంది. ఈ రెండు వేలాల ద్వారా మొత్తం రూ.6,02,392 కోట్ల అదనపు నగదు ఆర్‌బీఐకి చేరింది. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. సెప్టెంబరు 3 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.10.32 లక్షల కోట్ల అదనపు నగదు లభ్యత ఉన్నట్లు అంచనా.


# రెండు బస్సులు ఢీ - తప్పిన పెను ప్రమాదం

## విద్యార్థులకు స్వల్ప గాయాలు



సిరిసిల్లలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద చౌరస్తాలో శనివారం ఉదయం స్థానిక విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్ బస్సు విద్యార్థినీ విద్యార్థులను స్కూలుకు తీసుకు వెళుతుండగా, పెద్దూరుకు చెందిన ఆపెరల్ పార్క్ బస్సు అతివేగంగా ఢీ కొట్టడంతో స్కూల్ బస్సు అద్దాలు పగిలాయి. దీంతో పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం స్కూల్ బస్సును అపరెల్ పార్క్ కు చెందిన బస్సు వెనుక వైపు నుండి ఢీకొట్టడంతో ఈ సంఘటన జరిగిందని తెలిపారు. పెను ప్రమాదం తప్పడంతో ప్రాణ నష్టం కలగలేదు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. కొత్త బస్టాండ్ కు దగ్గరలో చౌరస్తా ఉండడంతో అనేక యాక్సిడెంట్లు అవుతున్నాయని స్థానిక షాపు యజమానులు మొరపెట్టుకుంటున్నారు. వాహనాల రద్దీ, జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతం కాబట్టి స్పీడ్ బ్రేకర్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు, ఆర్టీసీ బస్సులు అత్యంత వేగంతో రావడంతోనే యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, గతంలో ప్రాణ నష్టం కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి రోడ్డు రవాణా శాఖ కు సంబంధించిన అధికారులు స్పీడ్ బ్రేకర్లు పెట్టి ప్రాణ నష్టం నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇంటి తాళం పగలగొట్టి బంగారు,వెండి ఆభరణాల చోరీ



**వీణవంక సెప్టెంబర్ 5 (జనంసాక్షి)** వీణవంక మండలంలోని బేతిగల్ గ్రామంలో ఇంటి తాళం పగలగొట్టి బంగారు,వెండి ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన బేతిగల్ గ్రామంలో చోటుచేసుకుంది.బేతిగల్ గ్రామానికి చెందిన కోక్కిరాల సంపత్ రావు,ఇదే నెల 3-09-2026 ఉదయం తన ఇంటికి తాళం వేసి ఫంక్షన్‌కు వెళ్లారు. మరుసటి రోజు04-09-2026న ఇంటి పక్కన నివాసం ఉండే వారు సంపత్ రావుకు ఫోన్ చేసి,ఆయన ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. దీంతో సంపత్ రావు ఇంటికి వచ్చి పరిశీలించగా,గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి అర్ధ తులం బంగారు కమ్మలు,రెండు వెండి పల్లాలు,రెండు వెండి మొలతాడులు చోరీ చేసినట్లు గుర్తించారు.ఈ మేరకు సంపత్ రావు శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా,విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఏఎస్ఐ వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.చోరీకి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

**సామాజిక విలువలు, క్రమశిక్షణ అంశాలు బోధించాలి**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 05(జనం సాక్షి);**
విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 37 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించగా,ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడంతో మిగతా వారికి మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల తరువాత విద్యార్థులపై ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనని స్పష్టం చేశారు.సర్వేపల్లి రాధాకృష్ణన్,అబ్దుల్ కలాం, మహాత్మా జ్యోతి రావు పూలే దంపతుల బోధనలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. టీచర్లు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని,ప్రతి విద్యార్థి మనో వికాసం,సమాజ విలువలు,కట్టుబాట్లు, క్రమశిక్షణ అంశాలపై బోధించాలని సూచించారు.విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాలని,అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. డైట్ చార్జీలు,కాస్మోటిక్ చార్జీలు పెంచామని తెలిపారు.మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు.ఉదయం పూట టిఫిన్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రభుత్వ విప్ తెలిపారు.ఇప్పటికే 11 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో రెండు స్కూళ్లు రానున్నాయని వెల్లడించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు.విద్యలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులకు టీచర్లు రోల్ మోడల్ అని పేర్కొన్నారు.తాను టీచర్స్ డే రోజు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.తాను ఆరో తరగతిలో పద్యం,స్పీచ్ ఇవ్వడం మరిచిపోలేని అనుభూతి అని గుర్తు చేశారు.అప్పటి తమ మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఖర్గోన్ జిల్లా కలెక్టర్ ను కలిసి ఆమె మాటలతో స్ఫూర్తి పొందానని వివరించారు. ప్రతి ఏడాది జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజున అదే విషయం గుర్తుకు వస్తుందని తెలిపారు.ఎన్నికల సమయంలో జిల్లాలో ఉపాధ్యాయులు ఎంతో చక్కగా విధులు నిర్వర్తించి,ప్రక్రియ సాఫీగా సాగేలా సహకారం అందించారని కొనియాడారు.పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ), విద్యాలయాల్లో విద్యార్థుల నమోదులో మెరుగైన సేవలు అందించారని గుర్తు చేశారు.జిల్లాలో పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) ప్రక్రియను ఖమ్మం జిల్లా నుంచి టీచర్స్ వచ్చి చూశారని తెలిపారు.ప్రతి విద్యార్థిని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకమని స్పష్టం చేశారు.విద్యార్థి ఇష్టపడే టీచర్ బోధించే సబ్జెక్ట్ ను ఇష్టపడతారని వివరించారు.టీచర్ రోల్ మోడల్ గా తీసుకుంటారని తెలిపారు.ప్రతి టీచర్ ప్రవర్తన కీలకమని పేర్కొన్నారు.విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో టీచర్లు కీలకమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారని జిల్లా కలెక్టర్ వివరించారు.

**ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందినది వీరే..**

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన హెచ్ ఎంలు, పీడీ, పీఈటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, కేజీబీవీ ఎస్ఓ, సీఆర్టీ, పీజీ సీఆర్టీలు, ఐఈ ఆర్పీలు పొందినది వీరే..చిట్నేని శ్రీకాంత్ రావు, టీ మనోహరాచారి, ఆడెపు రాజేశం, అజ్మీరా మదన్ లాల్, గుర్రం సందీప్, నర్ర శ్రీనివాసరెడ్డి, టీ మధుకర్ రెడ్డి, గంప లక్ష్మీనారాయణ, ఎం లక్ష్మయ్య, మోహమ్మద్ రహీం, సీహెచ్ రమాదేవి, ఎం కోటేశ్వర్, కొప్పు రాములు, వెంగల మహేష్, మాదాడి వెంకటరావు, కుమ్మరి మల్లేశం, సీహెచ్ మాధవి లత, ఎన్ కనకయ్య, ఈ శ్రీనివాస్, కపిల్ల నరేష్, రామగిరి స్వరాజ్యలక్ష్మి, కొత్తపల్లి మమత, యాస శ్రీలత,డీ రఘు, ఎం సుజాత, బోనగిరి రాజేందర్, ఊతం విజయకుమార్, దరిపెల్లి రాజేశం, బొల్లి రమేష్, అణువోజు రాజు, తెల్ల వకుల, మేకల పద్మ, మామిళ్ల విఠల్, కే జయలక్ష్మి, ఆర్ వసంత, బి సుధారాణి, టి గీత అవార్డులు పొందారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా విద్యాధికారి మొండయ్య,కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ చట్టంతో కాంగ్రెస్ చేస్తున్న భూ దోపిడీని అడ్డుకుంటాం



నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 జనం సాక్షి :**
రైతుల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ చేపట్టిన మహాధర్నాకు నిజామాబాద్ నుంచి భారీగా బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు.కాంగ్రెస్ మెడలు వంచే వరకు రైతుల కోసం పోరాటం ఆగదని నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా స్పష్టం చేశారు.అమాయక రైతులు, ప్రజల భూములను 22-ఏ చట్టం పేరుతో నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బంది పెట్టడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన దీక్షకు ఇందూరు నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున కదలివెళ్లారు. ఇందలవాయి టోల్‌గేట్ వద్ద దీక్షకు వెళ్లే వాహనాలకు అర్బన్ ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన 22-ఏ చట్టాన్ని అడ్డుపెట్టుకుని, రైతుల భూములను ఇబ్బందుల పాలుజేస్తున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. రైతుల పక్షాన నిలబడి కాంగ్రెస్ పార్టీ మెడలు వంచే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.



# స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ అకాడమీకి తుంపల్లి పాఠశాల విద్యార్థినిల ఎంపిక

**సిరికొండ సెప్టెంబర్ 5(జనం సాక్షి ):** నిజామాబాద్ జిల్లా, సిరికొండ మండలం, తుంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాదావత్ అఖిల, బాదావత్ పల్లవి ప్రతిష్టాత్మకమైన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ అకాడమీకి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేష్ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల 'సాయ్' సెంటర్‌లో వీరికి నిర్వహించిన హాకీ ప్రత్యేక ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన హాకీ ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి క్రీడా అకాడమీకి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి క్రీడా అకాడమీకి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి అకాడమీకి ఎంపికైన అఖిల, పల్లవిలను సిరికొండ మండల విద్యాధికారి (వీజూా) రాములు సార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించడంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేష్ చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభకు కొదవ లేదని, సరైన ప్రోత్సాహం, శిక్షణ అందిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం కటాఫ్ డేట్ తీసేసి అర్హులైన బీడీ కార్మికులందరికీ చేయూత పెన్షన్ ఇవ్వాలి

**తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ డిమాండ్**




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 (జనం సాక్షి) :** ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కటాఫ్ డేట్ తీసేసి అర్హులైన బీడీ కార్మికులందరికీ చేయూత పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగడి బజార్ నుండి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రంను తహసీల్దార్ కు అందజేశారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ మాట్లాడుతు రాష్ట్రంలో ఏడు లక్షల 50 వేల మంది బీడీ కార్మికులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1,50,000 మంది బీడీ కార్మికులు ఉన్నారని, చాలీచాలని కూలితో దినదిన గండముగా దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని అన్నారు. వ్యవసాయ రంగం తర్వాత బీడీ పరిశ్రమ రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా ఉన్నదన్నారు. పాలకవర్గాలు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు మాత్రమే హామీ ఇచ్చి వారి ఓట్లు దండుకొని వీరికి ఎగనాగం పెడుతున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను,అనేక హక్కులను కాలరస్తుందన్నారు. మోడీ కార్మిక వర్గ వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు.యాజమాన్యం బీడీ కార్మికుల అనేక చట్టాలను నిరాటంకంగా ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం బీడీ కార్మికులకు అందరికీ పెన్షన్, జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చి తర్వాత కట్ ఆఫ్ డేటు అనేది పెట్టి బీడీ కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు.




# మాతా శిశు ఆసుపత్రిలో విషాదం

## రెండేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 జనం సాక్షి :** జిల్లా కేంద్రంలోని మాతా శిశు ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పసిబిడ్డ క్షణాల వ్యవధిలో కంటిచూపునకు దూరమవ్వడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాలను ద్రవింపజేస్తున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం..బాల్కొండ మండలం నాగపూర్ గ్రామానికి చెందిన రెండేళ్ల ఐదు నెలల వేదాంత్ ఆసుపత్రి నిమిత్తం తల్లిదండ్రులతో కలిసి మాతా శిశు ఆసుపత్రికి వచ్చాడు.తల్లిదండ్రులు వైద్య పరీక్షల నిమిత్తం లోపల ఉండగా, బాలుడు తన అన్నతో కలిసి బయటకు వచ్చాడు. ఆ సమయంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి బాలుడి చేయి పట్టుకుని తీసుకెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఘటన జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. పసిబిడ్డ జాడ కోసం తల్లడిల్లుతున్న ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. పోలీసులు వెంటనే స్పందించి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టి, బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్‌ను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు

**కరీంనగర్ లో కేటీఆర్ నిర్వహించిన 'యువ సమర భేరీ' పూర్తిగా అట్టర్ ఫ్లాప్**

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యువతకు చేసిందేంటి?**

**కుటుంబ వారసత్వ రాజకీయాలకు, ప్రజా పోరాటాలకు చాలా తేడా ఉంది**

**కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 05 (జనంసాక్షి)**
కరీంనగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన 'యువ సమర భేరీ' కార్యక్రమం పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయిందని, పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు యువత సమస్యలు గుర్తుకురాని కేటీఆర్‌కు, అధికారం కోల్పోయిన తర్వాతే 'యువ సమర భేరీ' పేరుతో యువత గుర్తుకు వచ్చారా అని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రశ్నించారు. శనివారం కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మేయర్ కొలగాని శ్రీనివాస్ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బండి సంజయ్ గురించి మాట్లాడే ముందు కేటీఆర్ తన రాజకీయ చరిత్రను ఒకసారి పరిశీలించుకోవాలని హితవు పలికారు. కార్యకర్త స్థాయి నుంచి ప్రజల మధ్య నిరంతరం పోరాడుతూ ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఎదిగిన నాయకుడు బండి సంజయ్ అయితే, కేటీఆర్ మాత్రం కుటుంబ రాజకీయ వారసత్వంతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి అని విమర్శించారు. "ఒకరు ప్రజల మధ్య నుంచి ఎదిగిన జననేత అయితే.. మరొకరు కుటుంబ వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన వారసుడు" అని ఆయన ఎద్దేవా చేశారు. కరీంనగర్ ప్రజలు ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారో, ఎవరు ఎన్నికల సమయంలో వచ్చి రాజకీయ డైలాగులు చెబుతున్నారో స్పష్టంగా గమనిస్తున్నారన్నారు.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యువతకు ఇచ్చిన హామీలు, చేసిన అన్యాయాలను కేటీఆర్ మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థుల సమస్యలు, ఆత్మహత్యలపై అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వ తీవ్ర విమర్శలకు గురైన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. యువకులకు ప్రతి నెల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసి, వారి జీవితాలతో చెలగాట మాడారని ఆయన మండిపడ్డారు. బిఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షలు, పేపర్ లీకేజీల వ్యవహారాలతో నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయిందన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 317 జీవో కారణంగా ఉద్యోగులు, వారి కుటుంబాలు ఎదుర్కొన్న ఇబ్బందులకు అప్పటి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బండి సంజయ్ కుమార్ చేసిన కృషి, కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులు ప్రజలకు తెలుసన్నారు. శాతవాహన యూనివర్సిటీకి 12బీ హోదా, ఎస్ఆర్ఆర్ కళాశాలకు అటానమస్ హోదా సాధించడంలో బండి సంజయ్ కృషి కీలకమని




తెలిపారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి, నగరంలోని మౌలిక వసతుల కల్పనకు కేంద్ర నిధులు అందేలా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. సిరిసిల్ల అభివృద్ధికి కేటీఆర్ తెచ్చిన నిధులెన్ని? ఆయన ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధి పై మాట్లాడుతున్న కేటీఆర్ ముందుగా తాను ప్రాతినిధ్యం వహించిన సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతమేరకు నిధులు తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న కేటీఆర్ సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధికి నయాపైసా తెచ్చినవా?" అని ఆయన నిలదీశారు. కేసీఆర్, బోయినపల్లి వినోద్ కుమార్ లాంటి వారు ఎంపీలుగా ఉన్నప్పుడు కరీంనగర్‌కు ఏవిధమైన నిధులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని సభలు పెట్టినా, ఎంత పెద్ద రాజకీయ నినాదాలు చేసినా యువతను మోసం చేసిన బీఆర్ఎస్ చరిత్రను కరీంనగర్ ప్రజలు మరిచిపోరన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, భూపతి రవీందర్, మేకల వెంకటేష్, ఒంటెల సత్యనారాయణ రెడ్డి, ఎన్నం ప్రకాష్, గాజ శివరాం, కర్రే అనిల్, పొన్నం మొండయ్య, కొలిపాక శ్రీనివాస్, సాధినేని మునిందర్ పాల్గొన్నారు.




# మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో..

# 12 ప్యాడ్ క్లీనింగ్ మోటార్లు చోరీ

**మంథని, సెప్టెంబర్ 05, (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 12 ప్యాడ్ క్లీనింగ్ మోటార్లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 26న మోటార్లు చోరీకి గురైనట్లు మార్కెట్ కమిటీ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో 27న మార్కెట్ యార్డు కార్యదర్శి కట్ట సతీష్ కుమార్ మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మోటార్ల విలువ లక్షల రూపాయల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. మార్కెట్ యార్డులో నైట్ వాచ్‌మెన్ ఉన్నప్పటికీ చోరీ జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మోటార్లను ఎప్పుడు చోరీ చేశారు? ఎంతమంది ఈ ఘటనకు పాల్పడ్డారు? వాటిని ఎలా తరలించారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం పోలీసులు మార్కెట్ యార్డులో విచారణ చేపట్టి, సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అయితే యార్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం గమనార్హం. ఇదే అదునుగా తీసుకుని దుండగులు చోరీకి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. గతంలోనూ మార్కెట్ యార్డులో చోరీలు జరిగినట్లు ఆరోపణలు ఉండటంతో భద్రతా ఏర్పాట్లపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చోరీకి గురైన మోటార్లను గుర్తించి, నిందితులను త్వరగా పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రాజకీయ ప్రయోగశాలగా రెవెన్యూ వ్యవస్థ

**దేవాలయ భూములు, నక్షా బాటలు, పానాదుల రక్షణకు సమగ్ర సర్వే సరిపోతుందా?**
**సమగ్ర సర్వే నుండి ఈ భూములకు విముక్తి లభించేనా ?**
**రెవెన్యూ విభాగం కాస్త రిజిస్ట్రేషన్ల విభాగంగా మారిపోయిందా ?**



**యాలాల, సెప్టెంబర్ 5 (జనంసాక్షి)** గ్రామీణ ఆర్థిక రంగానికి, సామాజిక శాంతి భద్రతలకు మూలస్తంభం లాంటి రెవెన్యూ వ్యవస్థ నేడు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు భూమి రికార్డులను కాపాడుతూ, సామాజిక అవసరాల కోసం కేటాయించిన పానదులు, నక్షా బాటలను, దేవుడి పేరిట ఉన్న మాన్యాలను కంటికి రెప్పలా కాపాడిన రెవెన్యూ యంత్రాంగం, నేడు వాటిపై క్రమంగా ఆజమాయషిని కోల్పోతోందనే విమర్శలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి. పార్టీల అధికార మార్పిడి జరిగినప్పుడల్లా తమకు అనుకూలంగా చట్టాలను మార్చడం, అధికారుల విచక్షణాధికారాలను రద్దు చేయడం వల్ల వ్యవస్థ కుప్పకూలిందనేది నగ్నసత్యం. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తెచ్చిన 'సమగ్ర డిజిటల్ భూ సర్వే' మరియు కొత్త 'భూ భారతి' చట్టం ఈ లోపాలను ఎంతవరకు సరిదిద్దగలవనే అంశంపై ప్రత్యేక విశ్లేషణ.

**వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న అధికార మార్పిడులు**

భూ పరిపాలన అనేది నిరంతరాయంగా, స్థిరంగా సాగాల్సిన ప్రక్రియ. కానీ, దురదృష్టవశాత్తూ మన రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మారిన ప్రతిసారీ రెవెన్యూ విభాగాన్ని ఎవరికి వారు తమ రాజకీయ ప్రయోజనాలకు, ఓటు బ్యాంకు వ్యూహాలకు అనుగుణంగా మార్చేసుకుంటున్నారు.గత ప్రభుత్వము రెవెన్యూ వ్యవస్థలో ప్రయోగాల పరంపరలో భాగంగా గతంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల వ్యవస్థను రద్దు చేసి, తహసీల్దార్ల సివిల్ కోర్టు అధికారాలను తొలగించి, కేవలం 'ధరణి' పోర్టల్‌ను తెచ్చారు. డిజిటలైజేషన్ పేరుతో క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తిగా నిలిపివేయడంతో అది అనేక సాంకేతిక లోపాలకు దారితీసింది. ఇది ఇలా ఉండగా ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరణి లోపాలను సరిదిద్దుతూ, కొత్తగా 'తెలంగాణ భూ భారతి చట్టం'ను ప్రవేశపెట్టింది. ఇలా ప్రతి ఐదేళ్లకోసారి వ్యవస్థల మార్పిడి వల్ల క్షేత్రస్థాయి సిబ్బందిలో గందరగోళం పెరిగింది. సామాన్య రైతులకు ఏ అధికారిని ఆశ్రయించాలో తెలియని నిస్సహాయ స్థితి ఏర్పడింది.

**అధికారుల విశేష అధికారాల రద్దు**

గతంలో తహసీల్దార్, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్లకు భూ వివాదాలను విచారించి, తీర్పులు ఇచ్చే 'అర్ధ-న్యాయ అధికారాలు' ఉండేవి. అయితే, అవినీతిని అరికట్టే నెపంతో ఈ అధికారుల విచక్షణాధికారాలను, కోర్టు అధికారాలను రద్దు చేయడంతో తీవ్రమైన దుష్పరిణామాలు ఎదురయ్యాయి.

**కేవలం రిజిస్ట్రేషన్ల విభాగంగా రెవెన్యూ**

తహసీల్దార్లకు జాయింట్ సబ్-రిజిస్ట్రార్ హోదా ఇవ్వడంతో, వారు కేవలం స్లాట్లు బుక్ చేయడం, రిజిస్ట్రేషన్లు చేయడం, కంప్యూటర్ మ్యుటేషన్లు చేయడానికే పరిమితమయ్యారు. రెవెన్యూ విభాగం తన మౌలిక విధులను విస్మరించి, కేవలం ఒక 'రిజిస్ట్రేషన్ ఆఫీసు' లాగా మారిపోయింది.

**నిస్సహాయ స్థితిలో యంత్రాంగం**

బ్రిటీష్ లేదా నిజాం కాలంలో గ్రామీణ నక్షా (మ్యాప్స్)లలో స్పష్టంగా కేటాయించిన దారులు (నక్షా బాటలు), పానదులు, ప్రభుత్వ వాగులు, వంకలతో పాటు వేల ఎకరాల దేవాలయ భూములు (ఇనాం/మాన్యాలు) ప్రస్తుతం భూ బకాసురుల కబ్జాలకు గురవుతున్నాయి. క్షేత్రస్థాయిలో విలేజ్ అసిస్టెంట్లు లేకపోవడం, తహసీల్దార్లకు క్షేత్రస్థాయి తనిఖీ అధికారాలు లోపించడంతో కబ్జాదారులు దేవుడి భూములను, నక్షా బాటలను సైతం దున్నేసి తమ పట్టా భూముల్లో కలుపుకుంటున్నారు. దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా కోర్టులలో సైతం ప్రభుత్వ భూములను కాపాడుకోలేని నిస్సహాయత నెలకొంది. మ్యాప్‌లలో దారులు ఉన్నప్పటికీ, వాస్తవంగా అక్కడ భూములు ఆక్రమణకు గురికావడంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు నిత్యం ఘర్షణలు పడాల్సి వస్తోంది.

**ప్రభుత్వ సమగ్ర సర్వే, 'భూ భారతి' వీటిని రక్షించగలవా ?**

ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర డిజిటల్ భూ సర్వే మరియు కొత్తగా తెచ్చిన 'భూ భారతి' చట్టం ఈ లోపభూయిష్ట వ్యవస్థను ప్రక్షాళన చేయగలవా అంటే, కొన్ని సానుకూల అంశాలు కనిపిస్తున్నాయి: వ్యవస్థను రక్షించే విధానం ఆధునిక/రోవర్స్ సర్వే నిజాం కాలం నాటి పాత మ్యాప్‌ల స్థానంలో, శాటిలైట్, డిఫరెన్షియల్ సాంకేతికతతో సర్వే చేయడం వల్ల ప్రతి కమతం, నక్షా బాటల అక్షాంశాలు, రేఖాంశాలు డిజిటల్‌గా లాక్ అవుతాయి. దీనివల్ల కబ్జాలు అసాధ్యం అవుతాయి. ల్యాండ్ పార్సిల్ మ్యాప్, ల్యాండ్ టైట్లింగ్ : ప్రతి రైతు భూమికి, దేవాలయ భూములకు ఆధార్ లాంటి విశిష్ట సంఖ్యతో పాటు 'ల్యాండ్ పార్సిల్ మ్యాప్'ఇస్తారు. ఇందులో నక్షా బాటల సరిహద్దులు స్పష్టంగా ఉంటాయి. ల్యాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు, కోర్టుల చుట్టూ తిరిగే పని లేకుండా, వివాదాల త్వరితగతిన పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక 'ల్యాండ్ ట్రిబ్యునల్స్' తీసుకురావడం కొంతవరకు ఊరట కలిగిస్తుంది. ఈ లోపభూయిష్ట వ్యవస్థను సరిదిద్ది పరిష్కార మార్గాలు చూపేది ఎవరు? రాజకీయాలకు అతీతంగా స్థిరమైన విధానం అవసరము. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా భూ పరిపాలన చట్టాలను పూర్తిగా మార్చకుండా, ఒక నిర్దిష్టమైన, శాశ్వతమైన 'భూ విధానాన్ని' రూపొందించాలి. న్యాయపరమైన అధికారాల పునరుద్ధరణ, తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలలో రికార్డులను సరిదిద్దే మరియు సరిహద్దు వివాదాలను పరిష్కరించే పరిమిత 'సివిల్ అధికారాలను' చట్టబద్ధంగా తిరిగి అప్పగించాలి. అయితే, ఈ అధికారాల దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి బలమైన ఆన్‌లైన్ జవాబుదారీతనం ఉండాలి.

**సర్వే విభాగాన్ని బలోపేతం చేయడం**

కేవలం సాఫ్ట్‌వేర్ ను నమ్ముకోకుండా, క్షేత్రస్థాయిలో తగినంత మంది ప్రభుత్వ సర్వేయర్లను నియమించి, నిరంతర పర్యవేక్షణ జరిగేలా చూడాలి. భూమి అనేది కేవలం ఒక స్థిరాస్తి కాదు, అది గ్రామీణ ప్రజల జీవనాధారం మరియు రాష్ట్ర సంపద. రెవెన్యూ యంత్రాంగాన్ని కేవలం 'రిజిస్ట్రేషన్ యంత్రం'గా మార్చడం వల్ల వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. ప్రస్తుతం జరుగుతున్న సమగ్ర సర్వే కేవలం కాగితాలకో, వెబ్‌సైట్లకో పరిమితం కాకుండా, కబ్జాకు గురైన దేవుడి మాన్యాలను, ప్రతి నక్షా బాటలను,పానాదులను విడిపించి, పేద రైతుకు దారి చూపేలా ఒక పదునైన అస్త్రంగా మారాలి. అప్పుడే ఈ వ్యవస్థలోని లోపాలు నిజంగా సరిదిద్దబడతాయి.

# ఉప్పల్‌లో ఆక్రమణలపై కొరడా

**ప్రజా ప్రదేశాలు ఆక్రమణలకు కాదు.. సరస్వతి నగర్‌లో క్షేత్రస్థాయి తనిఖీ**
**అనధికార ఆక్రమణలు, రాకపోకలకు ఆటంకాలపై చర్యలకు ఎంఎంసీ కమిషనర్ ఆదేశాలు**



**ఉప్పల్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** ఉప్పల్ ప్రాంతంలో ప్రజా ప్రదేశాల పరిరక్షణ, అనధికార ఆక్రమణల నియంత్రణపై అధికారులు దృష్టి సారించారు. ఉప్పల్ పరిధిలోని సరస్వతి నగర్‌లో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన స్థలాలను ఆక్రమించకుండా చూడడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు కలిగించే అడ్డంకులను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సరస్వతి నగర్‌లో పర్యటన సందర్భంగా ప్రధాన రహదారులు, ప్రజా వినియోగ ప్రదేశాలు, రాకపోకలకు సంబంధించిన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో అనధికారంగా ఏర్పాటైన ఆక్రమణలు, నిర్మాణాలు లేదా ప్రజా రాకపోకలకు ఆటంకం కలిగించే అడ్డంకులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**ప్రజా స్థలాల పరిరక్షణకు ప్రాధాన్యం**

ఉప్పల్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రాకపోకలకు అనుగుణంగా ప్రజా ప్రదేశాలను సక్రమంగా వినియోగంలో ఉంచాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు, ఇతర ప్రజా వినియోగ ప్రదేశాలను ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా స్థలాల్లో అనధికార ఆక్రమణలు ఏర్పడితే వాటి కారణంగా పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, అలాంటి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

**రాకపోకలకు ఆటంకాలు లేకుండా చర్యలు**

ఉప్పల్‌లో ప్రధాన రహదారులు, కాలనీలు, వాణిజ్య ప్రాంతాల్లో ప్రజల రాకపోకలు సులభంగా సాగేలా మౌలిక వసతులను కాపాడాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు. ప్రజా ప్రదేశాల్లో అనధికారంగా ఏర్పాటు చేసిన అడ్డంకులు, ఆక్రమణలను నిబంధనల మేరకు తొలగించి, ఆయా ప్రాంతాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అలాగే ఆక్రమణల తొలగింపు అనంతరం తిరిగి అదే ప్రాంతాల్లో ఆక్రమణలు ఏర్పడకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజా భూములు, ప్రజా వినియోగ ప్రదేశాలను కాపాడటంలో అధికారులు, స్థానిక ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

**ఉప్పల్‌లో పర్యవేక్షణకు మరింత ప్రాధాన్యం**

ఉప్పల్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం, రహదారుల నిర్వహణ, పారిశుధ్యం, ఆక్రమణల నియంత్రణ వంటి అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రజా ప్రదేశాలను ఆక్రమణలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో రాకపోకలకు సంబంధించిన సమస్యలు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రదేశాలను పరిరక్షించడం, అనధికార ఆక్రమణలను అరికట్టడం, రహదారులు మరియు పౌర వినియోగ ప్రాంతాలను సక్రమంగా నిర్వహించడం అధికారుల బాధ్యతతో పాటు ప్రజల సామాజిక బాధ్యత కూడా అని అధికారులు పేర్కొన్నారు. ప్రజా ప్రదేశాలను రక్షించాలి.. ఆక్రమణలను అరికట్టాలి.. ఉప్పల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి అని అధికారులు పిలుపునిచ్చారు.

# సిరిసిల్లాలో వెండి వెన్నెల చీరను ఆవిష్కరించిన కేటీఆర్

**నేతన్న విజయ్ ప్రయత్నాలకు అభినందనలు**
**బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే కర్మాగారం ఏర్పాటు చేస్తామని హామీ**



**సిరిసిల్ల సెప్టెంబర్ 5 (జనంసాక్షి)** చేనేత రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ కొత్త తరహా హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని రూపొందించిన నేతన్న నల్లా విజయ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. విజయ్ ఆహ్వానం మేరకు సిరిసిల్లలోని ఆయన ఇంటికి వెళ్లిన కేటీఆర్ ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని పరిశీలించి ఆవిష్కరించారు. ఈ మగ్గంపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను కూడా కేటీఆర్ ఆవిష్కరించారు. ఒకప్పుడు సిరిసిల్లలో అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన మహానుభావుడు నల్లా పరంధాములు అని కేటీఆర్ గుర్తుచేశారు. ఆయన కళా నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా సిరిసిల్లకు గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. సిరిసిల్లలో ఇంత అద్భుతమైన కళాకారులు ఉన్నారా అని ప్రపంచం ఆశ్చర్యపడేలా పరంధాములు చేనేత కళను చాటారని పేర్కొన్నారు. నల్లా పరంధాములు వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమారుడు నల్లా విజయ్ అనేక వినూత్న ప్రయోగాలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. చేనేత కళాకారుల నైపుణ్యానికి ఆధునిక సాంకేతికతను జోడించి మెరుగైన ఉత్పత్తులను అందించాలనే తపనతో విజయ్ ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తున్నారని ప్రశంసించారు.

ప్రస్తుతం 'షిఫ్ట్ జాకార్డ్' పేరుతో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వెండి, బంగారంతో ప్రత్యేకమైన చీరలను రూపొందిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. 'వెండి వెన్నెల' పేరుతో రూపొందించిన చీర అద్భుతంగా ఉందని, విజయ్ నైపుణ్యం, సృజనాత్మకతను అభినందించేందుకు, ఆయన చేసిన ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూడాలనే ఉద్దేశంతో ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చానని చెప్పారు. విజయ్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానని కేటీఆర్ అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విజయ్ కోసం సిరిసిల్లలో ఒక అద్భుతమైన కర్మాగారం ఏర్పాటు చేసి, అవసరమైన అన్ని రకాల సబ్సిడీలు అందించడంతో పాటు ఈ పరిశ్రమను మరింత మంది నేతన్నలు అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తానని కేటీఆర్ తెలిపారు. సిరిసిల్లను కేవలం పవర్‌లూమ్ పరిశ్రమకే పరిమితం చేయకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన హ్యాండ్‌లూమ్ చేనేతకు కూడా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో విజయ్ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో మగ్గంపై పని వేగం పెరగడంతో పాటు నేతన్నల శ్రమ తగ్గుతుందని విజయ్ తెలిపారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు పని సులభతరం అవుతుందని, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. కొత్త సాంకేతికతతో రూపొందిస్తున్న ప్రత్యేకమైన చీరలకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, తద్వారా నేతన్నలకు అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడంలో కేటీఆర్ ఎప్పుడూ ముందుంటారని విజయ్ తెలిపారు. గతంలో తాము రూపొందించిన వినూత్న చీరలను కూడా కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించామని, ఈసారి ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని, దానిపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



# కోట్పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులు తీసుకొచ్చిన ఘనత మాణిక్‌రావుదే..

**పీపుల్స్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించిన నేత**

**తాండూరు సెప్టెంబర్ 5(జనంసాక్షి)**స్వర్గీయ మాజీ మంత్రి, తెలంగాణ సర్దార్‌గా పేరుగాంచిన బీసీ ముద్దుబిడ్డ ఎం. మాణిక్‌రావు జయంతి సందర్భంగా తాండూరు నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బీసీ సంఘం కన్వీనర్ రాజ్‌కుమార్ కందుకూరి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి దశ ఉద్యమంలో జైలు జీవితం అనుభవించిన మాణిక్‌రావు, తెలంగాణ కోసం పోరాడిన తొలి తరం నాయకుల్లో ఒకరని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవులు నిర్వహిస్తూ, అసెంబ్లీలో బీసీల హక్కులు, సమస్యలు, అభివృద్ధి అంశాలను తొలిసారిగా బలంగా గళమెత్తిన నాయకుడిగా మాణిక్‌రావుని కొనియాడారు. తాండూరు ప్రాంత అభివృద్ధికి కోట్పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులను తీసుకురావడంలో మాణిక్‌రావు కృషి మరువలేనిదని అన్నారు. అలాగే తాండూరులో పీపుల్స్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశం కల్పించి, వారి భవిష్యత్తుకు బాటలు వేసిన మహానేత మాణిక్‌రావుని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ షకుర్, వడ్డెర సంఘం జిల్లా నాయకులు వడ్డే సత్యనారాయణ, మండలాల అధ్యక్షులు నరేందర్ ముదిరాజ్, బసంత్ కుమార్, బీసీ సంఘం యువ నాయకులు జోసఫ్, శ్రీకాంత్, బసవరాజ్, నాయి రాజు, అరుణ్ రాజ్, మోచిరాజు, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



# ఆల్ ఇండియా ర్యాంక్ 3,759.. తెలంగాణ రాష్ట్ర ర్యాంక్ 117

**99.08 శాతం పర్సంటైల్ సాధించిన మహతి షిరాల్కర్‌కు ఘన సన్మానం**

**ఉప్పల్, సెప్టెంబర్ 5 (జనం సాక్షి):** నీట్ ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా స్థాయిలో 3,759వ ర్యాంక్, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 117వ ర్యాంక్ సాధించిన మహతి షిరాల్కర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. ఉప్పల్ నియోజకవర్గం బీరప్పగడ్డ డివిజన్ కళ్యాణపురి కాలనీలో నివసించే అమిత్, లలిత దంపతుల కుమార్తె మహతి షిరాల్కర్ నీట్‌లో 99.08 పర్సంటైల్ సాధించడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కళ్యాణపురిలోని మహతి నివాసానికి శనివారం వెళ్లిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ఆమెను అభినందించారు. మహతిని శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా మహతి సాధించిన ర్యాంక్ ఆమె పట్టుదల, కృషికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహతి ఉన్నత విద్యకు సంబంధించిన ఫీజులను తాను భరిస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళ్యాణపురి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఆర్ వికాస్, జీఎస్ గణేష్‌కుమార్, జేఎస్ ప్రదీప్, సీఎస్ మాధవిరెడ్డి, ఏఎస్ఎన్ మూర్తి, శ్వేత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు, యువత సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**విద్యార్థులు యువత భారీ ర్యాలీ**
**విద్యార్థులకు యువతకు ఎమ్మెల్యేబండారి లక్ష్మారెడ్డి మద్దతు**




**కాప్రా, సెప్టెంబర్ 5 ( జనం సాక్షి ) :** విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థులు, రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి, నిరుద్యోగ యువత జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి అనే ప్రధాన డిమాండ్లతో శుక్రవారం ఈ సెల్ క్రాస్ రోడ్ నుండి రాధిక చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువతకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి వెంటనే పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంతో పాటు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా రీయింబర్స్‌మెంట్ బకాయిలను త్వరితగతిన విడుదల చేయాలని అన్నారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, నిరుద్యోగ యువత, మాజీ కార్పొరేటర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, శివకుమార్ గౌడ్ మహేష్ గౌడ్, సార్ అనిల్, యువజన నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కర్ణాటక బార్డర్‌లో అక్రమ మద్యం

**బంట్వారం మండలంలో అమ్మకాల జోరు**
**పట్టించుకోని అధికారులు అమాయకుల ప్రాణాలతో చెలగాటం**

**బంట్వారం సెప్టెంబర్ 05 (జనం సాక్షి) :** బంట్వారం మండల పరిధిలోని పలు గ్రామాలలో విచ్చల విడిగా మద్యం బెల్ట్ షాపులు జోరుగా కొనసాగుతున్నా సంబంధి శాఖ అధికారులు చూసి చూడ నట్లు వ్యవహారిస్తు న్నారు. మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికా రులు ఉండటం వల్ల వివిధ గ్రామాలలో బహిర్గ తంగానే బెల్ట్ దుకాణాలు ముమ్మరంగా సాగుతు న్నాయని పలువురు ఆరోపణలు ఉన్నాయి. అధి కారుల అండదండలతో స్థానిక పాలకుల సహ కారం కారణంగా ఒక్కో గ్రామంలో నాలుగైదు వరకు బెల్ట్ షాపులను నిర్వహాకులు నిర్వహి స్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ విషయం సంబంధిత శాఖల అధి కారులకు తెలిసిన,కళ్లకు అద్దుకు న్నట్లు కనిపించిన చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నా " రనే ఆరోపణలు అధికం గానే ఉన్నాయి. వికారాబాద్ ఎక్సైజ్ పరిధిలో నికి వచ్చే బంట్వారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలతో పాటు వాటికి అనుబంధంగా ఉన్న గ్రామాలలో రోజు రోజుకు బెల్ట్ దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకో - స్తున్నాయి. గిరిజన తండాలలో సైతం మద్యం ఏరులైపారుతుంది. గ్రామాలలో మద్యం అమ్మరాదని ఖచ్చితమైనా అదేశాలు ఇచ్చిన ఎక్సైజ్ శాఖ అధికారులు నామికే వాస్తిగా తనిఖీలు చేసి వారి నుండి మమూళ్లు వచ్చిన కాడికి రెండు చేతుల సంపా దించుకుంటున్నారే తప్ప మద్యం అక్రమ దుకా

**కిరణం దుకాణాలలో విచ్చల విడిగా చీప్ లీక్కరు బీర్లు అమ్మకాలు దుకాణాలు**

నివారించడంలో పూర్తిగా విఫల మయ్యారని పలువురు చర్చించుకుంటున్నారు. గ్రామా లలో ఇదే అదునుగా భావించిన బెల్ట్ షాపుల యాజమాన్యులు చీప్ లీక్కరు, బీర్లులతో పాటు లీక్కరును అధిక ధర లకు అమ్ముతూ పేద వారిని పూర్తిగా దోచుకుంటున్నారు. కాయ కష్టం చేసుకోని సాయంత్రం మద్యం తాగే వారికి బెల్ట్ దుకాణాదారులు షాపుల దగ్గరనే బహిర్గతంగా గ్లాస్లలో పెగ్గు లెక్క కల్తీ మందు ఇస్తూ అమాయక ప్రజలను ఆర్థి కంగా, శారీరకంగా నష్టపోయేలా చేస్తున్నారు. ప్రభుత్వం నాటు సారాను తయ్యారు చేయకూడ దని హెచ్చరించడంతో గ్రామాలలో సారా నిషేదిం చడం వల్ల రోజు మద్యం సేవించే వారిని ఆసరగా తీసుకోని మర్పల్లి, మోమిన్ పెట్ తాండూర్ తదితర ప్రాంతాల నుంచి లీక్కరు, బీర్లు తీసుకవచ్చి కిరాణం దుకా ణాలలో క్వాటర్ బాటిళ్లకు అధనంగా 10 నుంచి 20 రూపాయలను తీసుకోని ప్రజలను మోసం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్న తాధికారులు స్పందించి పూడూరు మండల పరిధి లోని వివిధ గ్రామాలలోని బెల్ట్ షాపులపైనా దాడులు నిర్వహించి అక్రమంగా బెల్ట్ దుకాణాలు అమ్ముతున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఫోరెన్సిక్ అధికారులకు నైపుణ్య శిక్షణ.. విజయవంతంగా ముగింపు



**రాజేంద్రనగర్,సెప్టెంబర్5 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ లో నూతనంగా నియమితులైన 53 మంది సైంటిఫిక్ అధికారులకు తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 5 వరకు నిర్వహించిన రెండు వారాల రెసిడెన్షియల్ ఫౌండేషనల్ శిక్షణ విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి టిజిపిఏ డైరెక్టర్ అభిలాష బిస్త్, ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రీయ నిబద్ధత, ఖచ్చితత్వం, నిష్పాక్షికతతో విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం ట్రైనీ అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు. గురుపూజోత్సవం సందర్భంగా డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్లను ట్రైనీలు సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు మురళీధర్ , వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ కె.ధనజ, వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, నరహరి, డీఎస్పీలు సతీష్, అమృతారెడ్డి, రామారావు, తోట శ్రీనివాసులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




# నకిలీ సర్టిఫికేట్‌లు.. నేరస్థుల అరెస్ట్

**జిల్లా పోలీస్ కమీషనర్ పి సాయి చైతన్య**

**బోధన్, సెప్టెంబర్ 5 ( జనంసాక్షి ) :** బోధన్ లో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న నేరస్తులను అరెస్ట్ చేసినట్లు జిల్లా పోలీస్ కమీషనర్ పి సాయి చైతన్య వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం, బోధన్ పట్టణం రాకాసిపేట్ లోని "సహారా మీ సేవ కేంద్రం" లో నకిలీ ప్రభుత్వ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, నిజామాబాద్ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ సీసీఎస్ ఏసిపి శ్రీశైలం గారు, జజూ సిబ్బంది మరియు బోధన్ పోలీస్ సిబ్బంది కలిసి, రాకాసిపేట్ పెద్ద మసీదు దగ్గర గల సహారా మీ సేవ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో మీ సేవ ఆపరేటర్ షేక్ వసీమ్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో గత రెండు సం ల నుండి మీ సేవ యజమాని మహమ్మద్ ముక్రమ్ , మరియు ఇతరులతో కలిసి తన మీ సేవ సెంటర్ నందు మరియు ఇంటిదగ్గర నకిలీ మీ సేవ సర్టిఫికేట్ లు తయారు చేసి ఇస్తున్నాడని, అట్టి సర్టిఫికేట్ లపై సంబందిత రబ్బర్ స్టాంప్ లు వేసి ఒరిజినల్ సర్టిఫికేట్ ల లాగా ఇస్తున్నారు , ఒక్కో సర్టిఫికెట్ కు రూ. 5,000/- నుండి రూ. 10,000/- వరకు వసూలు చేసి పంచుకునేవారు. అట్టి సర్టిఫికేట్లను తీసుకున్నవారు మోసపూరితముగా ప్రభుత్వము నుండి లబ్ది పొందుటకు అట్టి నకిలీ సర్టిఫికేట్ లను ఉపయోగించినట్లు తెలిసిందన్నారు. ఈ దర్యాప్తులో సహకరించిన సిసిఎస్ సీఐ అజయ్, ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాములు కానిస్టేబుల్ అనిల్, గంగప్రసాద్, మరియు బోధన్ ఎసిపి శ్రీనివాస్, బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్సై ఎల్. రామ్, కానిస్టేబుల్ గంగారం, శివ కృష్ణలను నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అబినందించినారు.

# సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

**కాంగ్రెస్ అధిష్టానానికి రుణపడి ఉంటా**

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు నూతన వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్‌గా, క్యాబినెట్ మంత్రి హోదాతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి రుణపడి ఉంటానని, సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానానికి,రాష్ట్ర నాయకత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు, మంత్రివర్గానికి గద్వాల్ విజయలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఇంత కీలకమైన బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీమతి సోనియా గాంధీకి, పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకి, అగ్రనేత రాహుల్ గాంధీకి, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్ కి, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'నాకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేస్తాను. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా, తెలంగాణ ప్రజల ఆశీస్సులతో మరింత బాధ్యతగా ముందుకు సాగుతాను' అని గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా తనకు లభించిన ఈ అవకాశం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగించుకుంటానని ఆమె తెలిపారు. తెలంగాణ సమగ్ర, సుస్థిర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో జీవో 97ను ఎండగడతాం

**పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్ను**

- పాలిటెక్నిక్ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది కేటీఆర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్ను వేసి జీవో 97 తీసుకువచ్చిందని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శుక్రవారం వేములవాడ అర్బన్ మండలంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ జీవో 97 వెనుక అసలు ఉద్దేశాన్ని బయటపెడతమన్నారు.పాలిటెక్నిక్ కళాశాలల విలువైన భూములు,ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్నేసిందని అయన ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు తీసుకొచ్చిన జీవో నంబర్ 97 వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగడతామన్నారు.జీవో 97ను రద్దు చేసే వరకు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంట ఉంటుందని విద్యార్థులకు ఆయన భరోసా ఇచ్చారు.జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులకు పైగా ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఆవేదనను విన్నారు. విద్యార్థులు రోడ్డెక్కితే కేసులు పెడతామని ప్రభుత్వం భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని విద్యార్థులకు సూచించారు.హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌తో పాటు సిరిసిల్ల,కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాల్లో విలువైన భూముల్లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలల వ్యవస్థను బలహీనపరిచి వాటి భూములను, ఆస్తులను ఇతర అవసరాలకు వినియోగించుకునే ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు.సోమవారం నుండి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో జీవో 97 అంశాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ప్రభుత్వం ముందు బలంగా ప్రస్తావిస్తారని కేటీఆర్ తెలిపారు. తాను సిరిసిల్ల ఎమ్మెల్యేగా,మాజీ మంత్రిగా,ఈ జిల్లా బిడ్డగా విద్యార్థులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలంతా కలిసి విద్యార్థుల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టిందన్నారు.పెట్టుబడులను ఆకర్షించేందుకు టీఎస్ఐపాస్ వంటి విధానాలను తీసుకొచ్చి పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించామని, 2014లో తెలంగాణలో టెక్నాలజీ రంగంలో 3.23 లక్షల ఉద్యోగాలు ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆ సంఖ్య 10 లక్షలకు చేరిందని, సుమారు 6.5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించామని విద్యార్థులకు వివరించారు.యువత నైపుణ్యాలను పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం టాస్క్, వి-హబ్ వంటి సంస్థలను ఏర్పాటు చేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. టాస్క్ ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, హార్డ్ స్కిల్స్‌లో శిక్షణ అందించామన్నారు. యువత ఉద్యోగాలు పొందడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అవసరమైన వేదికలను ఏర్పాటు చేశామన్నారు.ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.రూ 5 లక్షల విద్యా భరోసా కార్డు, విద్యార్థులకు వివిధ దశల్లో ఆర్థిక సాయం,ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. విద్యార్థులపై పోలీసులు కేసులు పెట్టినా,ఎలాంటి వేధింపులకు గురిచేసినా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులపై నమోదైన కేసులను కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడ విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతామన్నారు. జీవో 97ను రద్దు చేసే వరకు, ఎస్‌బీటీఈటీని కొనసాగించే వరకు విద్యార్థుల వెంట బీఆర్ఎస్ ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటంలో వెనక్కి తగ్గవద్దని, ప్రభుత్వం దిగివచ్చే వరకు అసెంబ్లీలోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం కొనసాగిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పి చైర్పర్సన్ తుల ఉమా, వేములవాడ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, బిఆర్ఎస్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 3 డెయిరీల లైసెన్సులు రద్దు


**హైదరాబాద్ (జనంసాక్షి) :** టీజీ సేఫ్ అధికారులు జరిపిన దాడుల్లో పాలు లేకుండానే పనీర్ తయారు చేస్తున్న డైయిరీల వ్యాపారం వెలుగు చూసింది. శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు, 'హెచ్-ఫాస్ట్' అధికారులతో కూడిన 12 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంతో పాటు పరిసర జిల్లాల్లోని 14 డెయిరీ ఉత్పత్తులు, రిటైల్ యూనిట్లలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పాలు లేకుండా రసాయనాలతో కల్తీ పనీర్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే తయారీ కేంద్రాల్లో బొద్దింకలు, ఈగలతో పారిశుధ్య లోపాలు ఉన్నట్లు గుర్తించారు. పాలను ఎక్కడి నుంచి సేకరిస్తున్నారో తెలిపే ఎలాంటి రికార్డులు లేకపోవడాన్ని గుర్తించిన అధికారులు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న లక్ష్మీఫుడ్స్, ధనలక్ష్మీ డెయిరీ, నటరాజ్ మిల్క్ ప్రొడక్ట్స్ కు సంబంధించిన ఫుడ్ సేఫ్టీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేశారు. వీటిలో వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేశారు.

# పారదర్శకంగా పెన్షన్ల వెరిఫికేషన్



- చేయూత మంజూరుకు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభం
- ఈ నెల 25 లోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి
- అర్హులైన లబ్ధిదారుల జాబితా కలెక్టర్లకు చేరాలి
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి) :** చేయూత సామాజిక భద్రత పెన్షన్ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు మంజూరు చేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రారంభించింది. దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నప్పటికీ, పెన్షన్ల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలన ప్రక్రియను సమాంతరంగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో తొలి దశలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారిని గుర్తించి పెన్షన్లు మంజూరు చేసేలా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. దరఖాస్తుదారుల అర్హతను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లో మండల స్థాయి అధికారులు, మున్సిపాలిటీల్లో సంబంధిత అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సర్కిల్ స్థాయి అధికారులు ఈ వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొంటారు. క్షేత్రస్థాయి పరిశీలన కోసం ప్రత్యేకంగా చేయూత వెరిఫికేషన్ మొబైల్ యాప్ ను రూపొందించారు. నియమిత అధికారులు దరఖాస్తుదారుల వివరాలు, పత్రాలు, అర్హత ప్రమాణాలను పరిశీలించి తమ వెరిఫికేషన్ నివేదికను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి దరఖాస్తుదారుడి సామాజిక, ఆర్థిక పరిస్థితి, నివాస స్థితి, పెన్షన్ కేటగిరీ, పథకానికి సంబంధించిన ఇతర అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. దరఖాస్తుతో పాటు అవసరమైన పత్రాలు సమర్పించకపోతే, అర్హత నిర్ధారణకు అవసరమైన పత్రాలను సంబంధిత అధికారి సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అర్హతను నిర్ధారించుకుని తమ వెరిఫికేషన్ నివేదికను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వెరిఫికేషన్ ప్రక్రియను ఈ నెల 25 లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు సంబంధిత డీఆర్ డీఓ లకు పంపుతారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ అనంతరం అర్హులైన లబ్ధిదారుల జాబితాను సంబంధిత అధికారులు పరిశీలించి జిల్లా స్థాయికి పంపిస్తారు. అనంతరం తుది అర్హుల జాబితాను జిల్లా కలెక్టర్ ఆమోదిస్తారు. జిల్లా కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాత సంబంధిత మండల, మున్సిపల్, కార్పొరేషన్ అధికారులు చేయూత కొత్త పెన్షన్లకు సంబంధించిన మంజూరు ఉత్తర్వులను సిద్ధం చేసి, నిర్దేశిత విధానం ప్రకారం లబ్ధిదారులకు అందజేయనున్నారు.



# 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు.సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్? ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండాగా ఉంటాయి.

## సెప్టెంబర్ 10న 'ఛలో హైదరాబాద్'

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పింఛనర్ల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) పోరుబాట పట్టింది. సెప్టెంబర్ 10న నిర్వహించే "చలో హైదరాబాద్" పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లో యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. టీజీఈజేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్స్, టీఎన్జీవో జనరల్ సెక్రటరీ ముజీబ్ హుస్సేని, టీజీవో స్టేట్ జనరల్ సెక్రటరీ బి.శ్యామ్ పాల్గొన్నారు.













Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370